# దాదా భగవాన్ ?




Telugu

# దాదా భగవాన్?

(పరమ పూజ్య దాదాశ్రీ జీవిత చరిత్ర- సంక్షిప్తంగా)

మూల గుజరాతి సంకలనం - డా.నీరు బెహన్ అమీన్

తెలుగు అనువాదం - మహాత్మగణం

**ప్రకాశకులు :** అజీత్ సి.పటేల్
దాదా భగవాన్ విజ్ఞాన్ ఫౌండేషన్
1, వరుణ్ అపార్ట్‌మెంట్, 37,శ్రీమాలి సొసైటీ
నవరంగ్‌పురా పోలీస్ స్టేషన్ ఎదురుగా,
నవరంగ్‌పురా, అహ్మదాబాద్ – 380009
గుజరాత్, భారత్
**ఫోన్:** + 91 7935002100, +91 9328661166/77

**కాపీ రైట్ :** © Dada Bhagwan Foundation,
5, Mamta Park Society, B\h. Navgujarat College,
Usmanpura, Ahmedabad -380014, Gujarat, India.
**Email :** info@dadabhagwan.org
**Tel :** +91 9328661166/77

**All Rights Reserved. No part of this publication may be shared, copied, translated or reproduced in any form (including electronic storage or audio recording) without written permission from the holder of the copyright. This publication is licensed for your personal use only.**

**మొదటి ముద్రణ** : November 2025 ( 500 Copies)

**భావ మూల్యం** : 'పరమ వినయం', మరియు "నాకు ఎంతమాత్రం తెలియదు. అదే భావన

**ధర** : Rs. 70

**ముద్రిక** : అంబా మల్టి ప్రింట్
హెచ్.బి.కపాడియా న్యూ హైస్కూల్ ఎదురుగా,
ఛత్రల్–ప్రతాప్పురా రోడ్, ఛత్రల్,
తాలూకా. కలోల్, జిల్లా.
గాంధీనగర్ – 382729, గుజరాత్.
**ఫోన్:** +91 79 3500 2142

**ISBN/eISBN** : 978-81-981667-0-8

**Printed in India**

# త్రిమంత్రం



నమో అరిహంతాణం

నమో సిద్ధాణం

నమో ఆయరియాణం





నమో ఉవజ్ఝాయాణం

నమో లోయే సవ్వ సాహూణం

ఏసోపంచణమోక్కారో,

సవ్వాపావప్పణాసణో

మంగళా ణం చ సవ్వేసిం,

పడమం హవయీ మంగళం

ఓం నమో భగవతే వాసుదేవాయ

ఓం నమో శివాయ

జై సచ్చిదానంద



# అనువాదకుని విజ్ఞప్తి

అంబాలాల్ ఎమ్. పటేల్ నామధేయులైన జ్ఞానిపురుషుని దాదాశ్రీ లేక దాదాశ్రీ గా భక్తులందరూ పిలుస్తారు. ఆత్మ విజ్ఞాన సంబంధమైన మరియు ప్రపంచ వ్యవహార జ్ఞాన సంబంధమైన తన సత్సంగాన్ని యధాతధంగా అనువదించటం సాధ్యం కాదని ఆయన తరచూ చెప్పేవారు. అనువాద క్రమంలో లోతైన, సహేతుకమైన అర్థం ముముక్షువులకు అందకపోవచ్చు అనికూడా దాదాశ్రీ చెప్పేవారు. గుజరాతీ భాషని నేర్చుకోవటంలోని ప్రాముఖ్యతను ఆయన నొక్కి వక్కాణించేవారు. తద్వారానే దాదాశ్రీ అమూల్యమైన బోధల సంపూర్ణసారాన్ని యధాతధంగా గ్రహించే అవకాశం ఉంటుందని దాదా మాటల సారాంశం.

అయినప్పటికీ దాదాశ్రీ తన బోధలను ఇంగ్లీషు మరియు ఇతర భాషలలోకి అరువదించటానికి, తద్వారా ప్రపంచంలోని మానవాళి పొంది తమ బాధలనుంచి విముక్తి పొందాలని, జీవన్ముక్తిని అనుభవించాలని దాదాజీ యొక్క ప్రగాఢమైన వాంఛ. ఈ విజ్ఞానం కూడా దాదాజీ చెప్పారు.

జ్ఞానిపురుషులైన దాదాజీ బోధలను తెలుగుభాష ద్వారా తెలుగు ప్రజలకు అందించటం కోసం చేసిన చిన్న ప్రయత్న ఫలమే ఈ పుస్తకం యొక్క అనువాదం. యధాతధంగా అందించలేకపోయినా సత్సంగ సందేశాన్ని, భావాన్ని ఎటువంటి చెఱుపు లేకుండా అందించడంకోసం ఎంతో శ్రద్ధ వహించటం జరిగింది.

అనంతమైన దాదాజీ జ్ఞాన ఖజానాకి ఇది ప్రాధమిక పరిచయం మాత్రమే. ఈ అనువాదంలో ఏమైన తప్పులు దొర్లివుంటే అవి పూర్తిగా అనువాదకులవే అని గమనించగలరు. వాటినిమిత్తమై మేము మీ క్షమను అర్థిస్తున్నాము.

# సంపాదకీయం

అది 1958వ సంవత్సరం జూన్ నెలలో సంధ్యా సమయం సుమారు 6.00 గంటలౌతుంది. రద్దీగా ఉండే సూరత్ రైల్వే స్టేషన్‌లో 3వ నంబరు ప్లాట్‌ఫార్మ్ మీద ఒక బెంచీ మీద శ్రీ అంబాలాల్ మూల్‌జీ భాయ్ పటేల్ కూర్చునివున్నారు. సోన్‌గఢ్ నుంచి బడౌదా వెళ్ళేందుకు తపతి వ్యాలీ రైలు నుండి దిగి, బడౌదా వెళ్ళే రైలు కోసం వేచిచూస్తున్నారు. ఆ సమయంలో ఆశ్చర్యకరంగా, ప్రకృతి అద్భుతమైన ఒక ఆధ్యాత్మిక మార్గ రచన చేసింది.

శ్రీ అంబాలాల్ మూల్‌జీ భాయ్ అనే దేహ మందిరంలో ప్రకృతి సిద్ధంగా, అక్రమ రూపంలో, ఎన్నో జన్మల నుండి వ్యక్తమవటానికి ఆత్రుతతో ఎదురుచూస్తున్న 'దాదా భగవాన్' పూర్ణరూపంలో ప్రకటితమయ్యారు. ఒక గంట సమయంలోనే ఆయనకి విశ్వదర్శనమైంది. ప్రపంచంలో అన్ని ఆధ్యాత్మిక ప్రశ్నలకూ ఆయనకు సమాధానం లభించింది. రహస్యమంతా బట్టబయలైంది. ప్రశ్నల పూర్ణాహుతి జరిగింది. ఈ ప్రపంచం ఏమిటి? ఎలా నడుస్తూవుంది? మనం ఎవరం? వీళ్ళందరూ ఎవరు? కర్మ అంటే ఏమిటి? బంధాలు అంటే ఏమిటి? ముక్తి అంటే ఏమిటి? ముక్తి లభించే ఉపాయం ఏమిటి? ఇలాంటి అసంఖ్యాక ఆధ్యాత్మిక ప్రశ్నలకు సంపూర్ణ సమాధానాల ప్రాప్తి జరిగింది. అలా విశ్వం గురించి ఒక అద్వితీయ పూర్ణ దర్శనం కలుగజేయటం జరిగింది. అందుకు శ్రీ అంబాలాల్ మూల్‌జీ భాయ్ పటేల్ ఒక మాధ్యమం అయ్యారు. ఆయన గుజరాత్‌లోని చరోతర్ క్షేత్రంలోని భాదరణ్ గ్రామ పాటీదార్, వృత్తిరీత్యా కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నవారు. అయినా, 'పరమసత్యాన్ని' తెలుసుకునే, 'సత్యాన్ని' గ్రహించేందుకు, బాల్యం నుంచే నిరంతరం 'సత్యస్వరూపులు' గా జీవించే కోరికతో ఉన్న ఈ భవ్య పాత్రలోనే 'అక్రమ విజ్ఞానం' ప్రకటితమైంది.

ఆయనకు ప్రాప్తించింది ఒక ఆశ్చర్యకరమైన సృష్టే కానీ, అందులోను మరింత ఆశ్చర్యకరమైన విషయం, ఆయన చూసింది, తెలుసుకున్నది, అనుభవం పొందినదాన్ని అదే విధంగా ఇతరులకు కూడా ప్రాప్తించేందుకు ప్రయత్నించటం.

స్వయంగా తన ఆత్మ కోసం మేలు చేసుకుని ముక్తిచెందేవాళ్ళు అనేకమంది ఉంటారు. కానీ, తనలా వేలాదిమందికి ముక్తి కలిగించే శక్తి కేవలం తీర్థంకరులు లేక జ్ఞానులలో కూడా ఎవరో కొందరు విలక్షణమైన జ్ఞానులకే ఉంటుంది. అటువంటి విలక్షణమైన జ్ఞాని ఈ కలికాలానికి తగ్గట్లుగా 'ఇన్‌స్టెంట్' ఆత్మజ్ఞాన ప్రాప్తి కోసం అద్భుతమైన మార్గాన్ని తయారుచేసారు, అది 'అక్రమ' అనే పేరుతో ప్రచారంలోకి వచ్చింది. 'అక్రమ' అంటే అహంకారానికి ఫుల్‌స్టాప్ (పూర్ణ విరామం). 'క్రమ' అంటే అహంకారానికి కామా (అల్ప విరామం). అక్రమ అంటే క్రమ పద్ధతి కానిది. క్రమంలో మెట్లు ఎక్కటమైతే అక్రమ లో లిఫ్ట్ ఎక్కి వెంటనే చేరుకోవటం. క్రమ అనేది ముఖ్య మార్గం, నియమిత విధానంలో ఉండేది. అయితే అక్రమ అనేది నియమానికి విరుద్ధంగా ఉండేది- డైవర్షన్.

క్రమ మార్గం ఎక్కడి వరకు పోతుంది? మనోవాక్కాయకర్మల ఏకత్వం ఉన్నంత వరకు. అంటే, మనసులో అనుకునేదే మాటలలోను, వ్యవహారంలోను ఉండాలి. అయితే ఇది ఈ కాలంలో అసంభవమన్నది నిర్వివాదం. ఎందుకంటే, క్రమ అనే వారధి మధ్యలో తెగిపోయింది. మోక్షమార్గాన్ని తెరిచే ఉంచేందుకుగాను చివరి అవకాశంగా ప్రకృతి ఈ 'డైవర్షన్' అనే అక్రమ మార్గాన్ని ప్రపంచంలో అందుబాటులోకి తెచ్చింది. ఈ చివరి అవకాశాన్ని ఉపయోగించుకుని లాభపడ్డవారు, గట్టెక్కినట్లే.

క్రమ మార్గంలో పాత్రశుద్ధి చేసి చేసి, క్రోధం-మానం-మాయ-లోభాలను శుద్ధి చేస్తూ చేస్తూ, సాధుకునికి అహంకారాన్ని పరిపూర్ణంగా శుద్ధిచేయవలసివుంది. అప్పుడే శుద్ధాత్మతో ఏకమవటం జరుగుతుంది.

ఈ కాలంలో క్రమిక మార్గం అసంభవం అవటం వలన, 'అక్రమ విజ్ఞానం' ద్వారా మనోవాక్కాయకర్మల మలినాలను ఒక పక్కకు పెట్టి, 'డైరెక్ట్' అహంకార శుద్ధి అవటం, తన స్వరూపంతో కలిసిపోవటం సంభవమౌతుంది.

ఆ తర్వాత జ్ఞాని ఆజ్ఞలకు బద్ధులై ఉన్నట్లయితే, మనోవాక్కాయకర్మల మాలిన్యం క్రమక్రమంగా అవి తలెత్తుతుంటేనే సహజ పద్ధతిలో శుద్ధి అవుతుంటాయి.

ఈ ప్రదూషిత కాలంలో, కఠినమైన కర్మాచరణల మధ్య ప్రాపంచిక బాధ్యతలన్నిటినీ నెరవేరుస్తూనే, నిరంతరం 'నేను శుద్ధాత్మను' అనే దృష్టి ఉంటుంది. 'అక్రమ విజ్ఞానం' అందించే ఈ అద్భుతమైన వరం చూడండి ఎలాంటిదో! ఎక్కడా వినంది, ఎక్కడా చదవని అపూర్వమైన ఈ విషయం, ఒక్కసారికే నమ్మబుద్ధి కూడా కాదు కానీ, ఈనాడు అది నిజమైంది.

అటువంటి అద్భుత 'అక్రమ విజ్ఞానాన్ని' ప్రచారం చేయగల పాత్రను ప్రకృతి ఏ విధంగా ఎంచుకునివుంటుంది అన్నది ప్రస్తుత సంకలనంలో, అక్రమ జ్ఞాని పూర్వాశ్రమంలోని విషయాలు, జ్ఞాన ప్రాప్తి తర్వాత ఆయనకి కలిగిన జాగృతిలోని పరాకాష్టతను తెలియజేసే విషయాల ద్వారా స్వయంగా తెలుసుకోవచ్చును.

జీవితంలో తీపి చేదు అనుభవాలు ఎవరికి కలగవు? అయితే జ్ఞాని వాటి నుంచి విడిగా ఎలా ఉండగలిగారు? జీవితంలో పౌర్ణమి, అమావాస్యల ఆస్వాదన, జ్ఞాన అజ్ఞాన దశలలో అనుభవంలోకి తెచ్చుకోవటం వంటి మాటలలో జ్ఞానికి ఉండే విశేషమైన, మౌలికమైన దృష్టి తెలుస్తుంది. అలాంటి సామాన్యమైన సందర్భాలలో అజ్ఞాని వేలసార్లు వెళ్ళవలసివుంటుంది. కానీ, అతనికి అంతర్దృష్టి తెరుచుకోదు, వేదనలో సమ్యక్ దృష్టి ఆవిర్భావమవదు. కానీ జ్ఞాని తన అజ్ఞాని దశలో కూడా అరె, జన్మతః సమ్యక్ దృష్టిని కలిగివుంటాడు. ఏ సందర్భంలోనైనా వీతరాగ దర్శనం చేత సమ్యక్ మార్గాన్ని స్వయంగా తయారు చేసుకుంటాడు. అజ్ఞానికి అటువంటి సందర్భాలు వేలకొద్దీ వచ్చివుండవచ్చు కానీ, జ్ఞాని వాటి నుంచి సత్యాలను తెలుసుకుని జ్ఞానమార్గాన్ని వెతుక్కుంటాడు.

'హోనహార్ బిర్వాన్ కే హోత్ చీక్‌నే పాత్' (గుణవంతుడు చిన్నప్పటి నుంచే అతను గుణవంతుడు అనే లక్షణాలు కనిపిస్తాయి). ఈ మాటను నిజం చేస్తూ, ఆయన చిన్నప్పటి విషయాలలో, ఆయన తల్లిగారు వైష్ణవ సంప్రదాయానికి చెందిన మాలను వేసుకోమని బలవంతపెట్టినపుడు, 'నాకు వెలుగుని చూపించేవాడే నాకు గురువు' అని, 'చెడ్డ గురువు కంటే, గురువు లేకపోవటమే మంచిది' అని చెప్పారు. ఇటువంటి విషయాల ద్వారా ఏ వ్యక్తి గురించైనా లేక అతని ప్రవర్తనను పక్కకు పెట్టి, బాల్య దశ నుంచే జ్ఞాని ఆలోచనలు, అలౌకి దృష్టి ఎంత అద్భుతంగా ఉంటుంది అన్నది ఆయన జ్ఞాన దశని దృష్టిలో పెట్టుకుని స్టడీ (పరిశీలన) చేస్తే ఎంతో మేలు జరుగుతుంది.

ప్రస్తుత సంకలనంలో జ్ఞాని పురుష్ వాణిలో సంక్షిప్తంగా ఆయన జీవితంలోని సంఘటనల సంకలనం చేయటం జరిగింది. దీని వెనుకనున్న ఉద్దేశ్యం ఏమిటంటే, 'ప్రకటితమైన జ్ఞాని పురుషుని' ఈ అద్భుత దశ గురించి జగత్తులో అందరూ తెలుసుకుని, అర్థం చేసుకుని, దాన్ని ప్రాప్తించుకోవాలన్నదే. ఇదే మా కోరిక.

జై సచ్చిదానంద

**-డా.నీరు బెహన్ అమీన్**

# దాదా భగవాన్?

## 1. జ్ఞానం ఎప్పుడు ఎలా కలిగింది?

### నాకు ఈ అక్రమ మార్గం లభించింది

**ప్రశ్నకర్త:** మీకు ఈ జ్ఞానం ఎలా ప్రాప్తించింది?

**దాదాశ్రీ:** ఇది నాకు ప్రాప్తించిన లబ్ధి.

**ప్రశ్నకర్త:** నైసర్గికంగానా? ఇది నేచురల్‌గా (ప్రకృతి క్రమంలో) ప్రాప్తించిందా?

**దాదాశ్రీ:** ఔను. దిస్ ఈజ్ బట్ నేచురల్.

**ప్రశ్నకర్త:** ఇది మీకు లభించటం కూడా సూరత్ స్టేషన్‌లో జరిగింది. ఇది అందరికీ జరగదు. మీకే జరిగింది. ఎందుకంటే, మీరు కూడా క్రమిక మార్గంలో నెమ్మది నెమ్మదిగా అభ్యాసం చేసివుంటారు కదా?

**దాదాశ్రీ:** చాలవరకు, అంతా క్రమిక మార్గంలోనే చేసాను. కానీ అక్రమ రూపంలో ఇది నాకు వచ్చింది. ఎందుకంటే కేవలజ్ఞానంలో అనుత్తీర్ణమైంది. దాని ఫలితంగా ఇది అక్రమ రూపంలోనే వచ్చేసింది.

## క్రమ, అక్రమలలో భేదం

**ప్రశ్నకర్త:** ముందుగా 'అక్రమ విజ్ఞానం' అంటే ఏమిటో తెలుసుకోవాలి.

**దాదాశ్రీ:** అహంకారానికి ఫుల్‌స్టాప్ (పూర్ణ విరామం). దాని పేరు 'అక్రమ విజ్ఞానం'. అహంకారానికి కామా (అల్పవిరామం). దాని పేరు 'క్రమిక విజ్ఞానం'. ఈ అక్రమ విజ్ఞానాన్ని ఆంతరిక విజ్ఞానం అని అంటారు. అది సనాతన సుఖం వైపు తీసుకునివెళ్తుంది. అంటే, మనకి సనాతన సౌఖ్యాన్ని అందించేదాన్ని ఆత్మ విజ్ఞానమని అంటారు. ఈ టెంపరరీ అడ్జస్ట్‌మెంట్ సౌఖ్యాన్ని అందించేదంతటినీ బాహ్య విజ్ఞానమని అంటారు. బాహ్య విజ్ఞానం వినాశనమయ్యేది కాని లేక వినాశనం కలిగించేది కాని అయితే, ఇది (అక్రమ విజ్ఞానం) సనాతనమైనది, సనాతనంగా తయారుచేసేది.

## జ్ఞానాగ్నిలో పాపం భస్మమౌతుంది

**ప్రశ్నకర్త:** ఒక గంటలోనే మనిషిలోని చింతలను దూరం చేసే ఈ ప్రక్రియ ఏమిటి? ఇందులో ఏమైనా చమత్కారం ఉందా? ఏమైనా విధి ఉందా?

**దాదాశ్రీ:** జ్ఞానిపురుషుడు పాపాలన్నిటిని జ్ఞానాగ్నిలో దహించి భస్మం చేస్తాడని కృష్ణ భగవానుడు అన్నాడు. ఈ జ్ఞానాగ్నితో నేను పాపాలను కాల్చివేసి భస్మీభూతం చేస్తాను. దానితో ఆ వ్యక్తి చింతల నుండి ముక్తుడౌతాడు.

## ప్రకాశంలో ఎక్కడా ఏ తేడా లేదు

**ప్రశ్నకర్త:** మీరు భగవద్గీత థీరీని నమ్ముతారా?

**దాదాశ్రీ:** అన్ని థీరీలను నమ్ముతాను. ఎందుకు నమ్మవద్దు? భగవద్ థీరీలన్నీ ఒకటే కదా! వాటిలో డిఫరెన్స్ లేదు. నా థీరీకి, దానికి మధ్య డిఫరెన్స్ ఏమీ లేదు. ప్రకాశంలో తేడా లేదు. పద్ధతిలోనే తేడా ఉంటుంది. అంతే! జ్ఞాన

ప్రకాశమంతా ఒకటే. జ్ఞాన ప్రకాశాలైన ఇతర మార్గాలు, ఈ మార్గం, సనాతన మార్గం అన్నీ సమానమే కాని, వాటి పద్ధతులు వేరువేరు. ఇది అలౌకికమైన పద్ధతి. ఒక గంట సమయంలోనే మనిషి స్వతంత్రుడు అయిపోతాడు. 'విదిన్ ఒన్ అవర్', చింతల నుండి విముక్తుడౌతాడు.

## సాధన సనాతన తత్వానిదే

**ప్రశ్నకర్త:** మీరు అంతకు ముందు ఉపాసన కాని, లేక ఏదైనా సాధన చేసారా?

**దాదాశ్రీ:** సాధనలైతే ఎన్నో రకాలైనవి చేసాను. కాని నేను, వస్తు ప్రాప్తి కోసం మాత్రం ఏ సాధనా చేయలేదు. ఎందుకంటే నాకు ఏ వస్తువు మీదా కోరిక ఉండేది కాదు. అందువలన అటువంటి సాధన చెయ్యవలసిన అవసరం పడలేదు. నేను సాధ్య వస్తువు కోసం సాధన చేసేవాడిని. అది వినాశనం చెందేది అవగూడదు. అటువంటి అవినాశి వస్తువు కోసం సాధన చేసేవాడిని. మరే ఇతర సాధనలనూ నేను చెయ్యలేదు.

## జ్ఞానానికి ముందు ఏమైనా మంథనం?

**ప్రశ్నకర్త:** జ్ఞానప్రాప్తికి ముందు ఏదైనా మంథనం చేసుండాలి కదా?

**దాదాశ్రీ:** ప్రపంచంలోని ఏ విషయమైనా నేను ఆలోచించకుండా మిగిలిపోలేదు. అందుకే ఈ జ్ఞానం ప్రకటితమైంది. మీరు రెండు ముక్కలు మాట్లాడారో లేదో నాకు మీ గురించి అంతా తెలిసిపోతుంది. ఒక నిమిషంలో నాలో ఐదైదు వేల రివొల్యూషన్స్ తిరుగుతుంటాయి. ఏ శాస్త్రమైనా రెండు నిమిషాల్లోనే దాని సారాంశం వచ్చేస్తుంది. పుస్తకంలో సర్వాంశం ఉండదు. సర్వాంశం జ్ఞాని పురుష్ దగ్గరే ఉంటుంది. శాస్త్రం కేవలం డైరెక్షన్ (దిశానిర్దేశం) చేస్తుంది.

## ఈ జన్మలో గురువెవరూ లభించలేదు

**ప్రశ్నకర్త:** మీ గురువు ఎవరు?

**దాదాశ్రీ:** ఈ జన్మలో ఎవరైనా ప్రత్యక్షంగా లభిస్తేనే వారిని గురువు అనగలుగుతాము. నాకు ఎవరూ అలా ప్రత్యక్షంగా లభించలేదు. ఎందరో సాధువులు సంత్‌లను కలిసాను. వాళ్ళతో సత్సంగం చేసాను. వాళ్ళకి సేవ చేసాను కానీ, గురువు అనదగ్గవారెవరూ దొరకలేదు. ప్రతి ఒక్క భక్తుడు జ్ఞానియై రాసిన పుస్తకాలన్నిటినీ చదివాను. కానీ ప్రత్యక్షంగా ఎవరినీ కలవలేదు.

అంటే, నేను శ్రీమద్ రాజచంద్రజీ (గుజరాత్‌లోని జ్ఞాని పురుష్) ని గురువు అని చెప్పలేను. ఎందుకంటే, ప్రత్యక్షంగా కలిస్తేనే గురువు అనగలుగుతాము. (శ్రీమద్ రాజచంద్ర దాదాజీకి ప్రత్యక్షంగా కలవలేదు). అయితే ఆయన పుస్తకాలు చాల బాగా ఉపకరించాయి. ఇతరుల పుస్తకాలను కూడా చదివాను. కానీ రాజచంద్రజీ పుస్తకాలు చాల ఎక్కువగా పనికివచ్చాయి.

నేను శ్రీమద్ రాజచంద్రజీ పుస్తకాలను చదువుతుండేవాడిని. భగవాన్ మహవీర్ శాస్త్రాన్ని చదివేవాడిని. కృష్ణ భగవానుని గీతా పఠనం చేస్తుండేవాడిని. వేదాంత ఖండాలను కూడా చదివాను. స్వామి నారాయణ సాంప్రదాయానికి చెందిన పుస్తకాలను చదివాను, ముస్లిం సాహిత్యాన్ని చదివాను. వాళ్ళంతా ఏం చెప్పే ప్రయత్నం చేసారో, వాళ్ళంతా చెప్పిన దానికి అర్థమేమిటి, దాని హేతువేమిటి అన్నవి తెలుసుకున్నాను. అందరు చెప్పేదీ నిజమే. కాకపోతే వారి వారి తరగతులకు అనుగుణంగా చెప్పారు. వారి వారి డిగ్రీలలో వారు చెప్పింది నిజమే. మొత్తం మూడు వందల అరవై డిగ్రీలు అనుకుంటే, కొందరు యాభై డిగ్రీల వరకు వచ్చారు, కొందరు ఎనభై, మరి కొందరు వంద డిగ్రీలకు వచ్చారు, ఇంకా కొందరు నూట యాభై డిగ్రీలకు చేరుకునివున్నారు. అందరు చెప్పేదీ సత్యమే. కానీ ఎవరి దగ్గరా మూడు వందల అరవై డిగ్రీలు లేదు. భగవాన్ మహావీర్‌కి మూడు వందల అరవై డిగ్రీలు ఉండేవి.

**ప్రశ్నకర్త:** మీకు ఈ అభ్యాసం ఎక్కడ జరిగింది?

**దాదాశ్రీ:** ఈ అభ్యాసమా? ఇది ఎన్నో జన్మల నుంచి వస్తున్న అభ్యాసం అయ్యుండాలి.

**ప్రశ్నకర్త:** కానీ మొదట్లో, జన్మ మొదలైన తర్వాత ఎలా ఉండేది? జన్మ తీసుకున్న తర్వాత ఎక్కడి నుంచి మొదలైంది?

**దాదాశ్రీ:** జన్మ మొదలైనప్పుడు వైష్ణవ మతంలో ఉండేవాడిని. తర్వాత స్వామి నారాయణ మతంలోకి వెళ్ళాను. ఇతర మతాలలోకి కూడా వెళ్ళాను, శివ మతం, తర్వాత శ్రీమద్ రామచంద్రజీ ఆశ్రమానికి వెళ్ళాను. ఆ తర్వాత మహవీర్ స్వామి పుస్తకాలన్నీ చదివాను. అవన్నీ మళ్ళీ మళ్ళీ చదివాను. నా స్థితి అలా ఉండేది. దానితో పాటు నా వ్యాపారం కూడా చూసుకునేవాడిని.

## సిన్సియారిటీ నిరంతరం వీతరాగుల పట్ల ఉండేది

**ప్రశ్నకర్త:** మీరు ఇంకేమైనా అలా చేసారా?

**దాదాశ్రీ:** ఏమీ చెయ్యలేదు. కాని, నిరంతరం వీతరాగుల పట్ల సిన్సియారిటీ (నిష్ఠ) ఉండేది. కృష్ణ భగవానుని పట్ల సిన్సియారిటీ! ఈ ప్రపంచం పట్ల ఆసక్తి ఉండేది కాదు. ప్రాపంచిక లోభం ఏమాత్రం ఉండేది కాదు. జన్మతః నాకు లోభ ప్రవృత్తి లేదు. అరె! ఎవరిదైనా పెద్ద తోట ఉన్నట్లయితే, దానిలో జామకాయలుంటే, దానిమ్మ పండ్లు ఉంటే, బత్తాయిలు ఉంటే, అలా పెద్ద పెద్ద తోటలలో పిల్లలంతా తిరగటానికి పోయి పండ్లను మూటగట్టుకుని ఇంటికి తెచ్చుకునేవారు. కానీ, నేను ఆ పని చేసేవాడిని కాను. అంటే, నా ఉద్దేశ్యం లోభ ప్రవృత్తి లేనేలేదు. అభిమానం ఎంత ఉండేదంటే, ప్రపంచంలో మరెవరికీ లేనంత. అభిమానం! చాల ఎక్కువ అభిమానం! అది నన్ను ఎలా నష్టపరచిందో నాకే తెలుసు.

**ప్రశ్నకర్త:** జ్ఞానప్రాప్తికి ముందు మీలో ఎలాంటి పరిణితి కలిగింది?

**దాదాశ్రీ:** నాలో సమ్యకత వచ్చినట్లుగా అనిపించేది. ఇక, పుస్తకాలను అన్నిటినీ స్టడీ చేసిన (పఠించిన) తర్వాత, 'వస్తువు అంటే ఏమిటి?' ఇలాంటి విషయాలను తరచిచూస్తే, ఇదంతా అర్థమైంది. తీర్థంకరులు, వీతరాగులు సత్యపురుషులు, వీతరాగుల మతం సరైనది అని నిర్ణయించుకున్నాను. వీతరాగులు నిజమైన పురుషులు. అనంతకాలంగా వస్తున్న ఆరాధన అదే. అంటే అంతా అదే. వ్యవహారంలో జైన-వైష్ణవ సమన్వయంతో ఉండేవాడిని. కొన్ని సందర్భాలలో వైష్ణవ వ్యవహారం, మరికొన్ని సందర్భాలలో జైన వ్యవహారం ఉండేది. ఎప్పుడూ మరిగిన నీళ్ళనే తాగేవాడిని. వ్యాపారంలో ఉన్నపుడు కూడా మరిగించిన నీళ్ళనే తాగుతుండేవాడిని! మీరు కూడా అలాంటి జైన పద్ధతిని అవలంబించివుండరు. కానీ, జ్ఞానం ప్రకటితమవటానికి అది కాదు కారణం. అందుకు కారణం ఎన్నో ఎవిడెన్స్‌లు కలిసి రావటమే. అలా జరిగివుండకపోతే, అక్రమ విజ్ఞానం ప్రకటితమెలా అవుతుంది? అక్రమ విజ్ఞానంలో ఇరవైనాలుగు మంది తీర్థంకరుల విజ్ఞానం మిళితమైవుంది. ఇరవైనాలుగు మంది తీర్థంకరుల కాలంలో అర్థం చేసుకోనిది ఇప్పుడు అర్థం చేసుకునేందుకున్నదే ఈ విజ్ఞానం.

## సత్యమైన హృదయం కలిగినవాళ్ళకే 'సత్యం' దొరికింది

**ప్రశ్నకర్త:** కానీ, మీకు అక్రమ జ్ఞానం ఎలా ప్రకటితమైంది? తనంతట తానుగా సహజసిద్ధంగానా లేక మీరు ఏమైనా దీర్ఘంగా ఆలోచించారా?

**దాదాశ్రీ:** తనంతట తానుగానే 'బట్ నాచురల్' (ప్రాకృతికంగా) అయింది. నేను ఎటువంటి దీర్ఘాలోచనా చేయలేదు. నాకు ఇదంతా ఎలా ప్రాప్తించేది? ఆధ్యాత్మికంగా ఏమైనా ప్రాప్తిస్తుందేమో అని నాకు అనిపించేది. సత్యమైన హృదయంతో ఉండేవాడిని. హృదయపూర్వకంగా చేసాను కనుకనే ఇలాంటి పరిణామం వచ్చింది. కొద్దిగా సమ్యకతత్వం కూడా పనిచేసింది అనిపిస్తోంది! సమ్యకతత్వం కిరణం ఉంటే దాని వెలుగు ప్రసరిస్తుంది. కానీ ఇది దానిబదులు వచ్చిన సంపూర్ణ ప్రకాశం.

## మోక్షానికి ప్రపంచం అవరోధం కాదు

**పశ్నకర్త:** మీరు సన్యాసం ఎందుకు తీసుకోలేదు?

**దాదాశ్రీ:** సన్యాసం అనే ఆలోచనే రాలేదు. దాని అర్థం సన్యాసం అంటే నాకు చిరాకు అని కాదు. కానీ నాకు అలాంటి ఉద్దేశ్యమే కాన రాలేదు. మోక్షమార్గంలో ప్రాపంచికం అడ్డంకి అవగూడదన్నది నా ధృఢ నమ్మకం. అవరోధం ప్రాపంచికం కాదు, అజ్ఞానమే అవరోధం. ఔను. భగవాన్‌కి ఈ త్యాగ మార్గాన్ని సామాన్య భావంతోనే ఉపదేశించవలసి వచ్చింది. అది ఎటువంటి విశేష భావంతోను చెయ్యలేదు. విశేష భావమేమిటంటే, ప్రాపంచికం అవరోధం కాదు. ఈ సంగతి నేను గ్యారెంటీతో చెప్తాను.

## జ్ఞానం ప్రకటితమవటం జగత్తు పుణ్యం

**ప్రశ్నకర్త:** ఈ అక్రమ జ్ఞానం ఎన్ని జన్మల పరిణామం?

**దాదాశ్రీ:** ప్రకటితమైన ఈ అక్రమ జ్ఞానం అనంత జన్మల ఫలితం. అన్నీ కలిసి ప్రాకృతిక రూపంలో ప్రకటమైంది.

**ప్రశ్నకర్త:** ఇది మీకు 'బట్ నాచురల్' గా జరిగింది. కానీ ఎలా?

**దాదాశ్రీ:** ఎలా అంటే, దాని పూర్తి సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ అంతా కలిసివచ్చింది. కనుకనే ప్రకటితమైంది. దీన్ని అందరికీ అర్థమయ్యేటట్లుగా చెప్పటం కోసం నేను 'బట్ నాచురల్' అని అనవలసివచ్చింది. నిజానికి అంతా సైంటిఫిక్ సర్క్‌మ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ కలిసిరావటం వలనే అలా ప్రకటమైంది.

**ప్రశ్నకర్త:** ఎలాంటి ఎవిడెన్స్ వచ్చి కలిసింది?

**దాదాశ్రీ:** అన్ని రకాల ఎవిడెన్స్ వచ్చి కలిసింది! జగత్కల్యాణం కోసం పరిపక్వ దశలో ఆ కాలం కలిసివచ్చింది. అలా జరగటానికి నిమిత్తులు ఎవరైనా కావాలి కదా?

## జ్ఞానానికి పూర్వపు దశ

ఆ దశని జ్ఞానాంక్షేపకవంత అంటారు. అంటే ఆత్మకి సంబంధించిన భావపరంపరలు పోనే పోవు. అది నాలో ఉండేది. అటువంటి దశ అది. ఆ, ఎన్నో రోజుల వరకు అదే లోపల నడుస్తూవుండేది. అది తెగనే తెగేది కాదు. నేను శాస్త్రాలలో ఆ దశ ఏమిటి అన్నది చూసాను. అప్పుడు నాకు అర్థమైంది అది జ్ఞానాంక్షేపకవంత దశ అని.

## మీరు ఎవరి ఆరాధన చేసారు?

**ప్రశ్నకర్త:** అంతా దాదాజీ దర్శనం కోసం వస్తారు. మరి దాదాజీ ఎవరికి సేవ, పూజ చేస్తారు? ఆయన ఆరాధ్య దేవత ఎవరు?

**దాదాశ్రీ:** లోపల భగవాన్ ప్రకటితమయ్యారు కదా, ఆయనకి పూజ చేస్తాను.

## నేను, దాదా భగవాన్ ఒకరం కాము

**ప్రశ్నకర్త:** మరి మిమ్మల్ని మీరు భగవాన్ అని ఎలా పిలిపించు కుంటున్నారు?

**దాదాశ్రీ:** నేను స్వయం భగవాన్‌ని కాను. దాదా భగవాన్‌కి నేను కూడా నమస్కరిస్తాను. నేను పూర్తిగా మూడు వందల యాభై ఆరు డిగ్రీలలో ఉ న్నాను, దాదా భగవాన్ మూడు వందల అరవై డిగ్రీలలో ఉన్నారు. అలా నాది నాలుగు డిగ్రీలు తక్కువ. కనుక నేను కూడా దాదా భగవాన్‌కి నమస్కరిస్తాను.

**ప్రశ్నకర్త:** ఎందుకలా?

**దాదాశ్రీ:** ఎందుకంటే నేనింకా నాలుగు డిగ్రీలను పూర్తి చేసుకోవాలి కదా. నేను పూర్తిచేసుకోవాలి కదా? నాలుగు డిగ్రీలు తక్కువగా ఉంది అంటే, ఉత్తీర్ణుడను కానట్లే. ఉత్తీర్ణత లేకపోతే ముక్తి కలిగినట్లు అవుతుందా?

**ప్రశ్నకర్త:** భగవాన్ అవాలనే మోహం ఉందా మీకు?

**దాదాశ్రీ:** భగవాన్ అవటమంటే నాకు భారంగానే కనిపిస్తుంది. నేను లఘుత్తమ పురుషుడను. ఈ ప్రపంచంలో నాకంటే ఎక్కువ లఘు ఎవరూ లేరు. నేను అలాంటి లఘు పురుషుడను. అందుకే భగవాన్ అవాలంటే భారం అనిపిస్తుంది. కాకపోతే, సిగ్గనిపిస్తుంది.

**ప్రశ్నకర్త:** భగవాన్ అవదలచుకోకపోతే ఆ నాలుగు డిగ్రీలను పూర్తి చేయాలనే పురుషార్థం ఎందుకు మీకు?

**దాదాశ్రీ:** అది నా మోక్షప్రాప్తి కోసం. నేను భగవాన్ అయితే ఒరిగేదేముంది? భగవద్గుణాలున్న వారంతా భగవాన్ అవుతారు. భగవాన్ అనేది శుద్ధ విశేషణం. ఎవరైతే అందుకు యోగ్యులౌతారో, వాళ్ళని లోకమంతా భగవాన్ అనే పిలుస్తారు.

## పదునాలుగు భువనాలకీ అధిపతి ఇక్కడ ప్రకటమయ్యారు

**ప్రశ్నకర్త:** 'దాదా భగవాన్' అనే పదాన్ని ఎవరి కోసం ఉపయోగిస్తున్నారు?

**దాదాశ్రీ:** దాదా భగవాన్ కోసం! నాకోసమైతే కాదు. నేను జ్ఞాని పురుషుడను.

**ప్రశ్నకర్త:** ఏ భగవాన్?

**దాదాశ్రీ:** పదునాలుగు భువనాలకు అధిపతియైన దాదా భగవాన్. ఆయన మీలోపలా ఉన్నారు. కాకపోతే మీలో ప్రకటితమవలేదు. మీలో అవ్యక్త రూపంలో ఉన్నారు, ఇక్కడ (నాలో) వ్యక్తరూపంలో ఉన్నారు. వ్యక్తమైనపుడు ఫలాలనిస్తారు. ఆయన నామాన్ని ఒక్కసారి తలచుకుంటే చాలు మీ పంట పండినట్లే.

కానీ గుర్తుపట్టి తలచుకుంటేనే మేలు జరుగుతుంది. ప్రాపంచికంగా ఏమైనా సమస్యలున్నా, అవి కూడా తొలగిపోతాయి. కానీ అందులో లోభం ఉండగూడదు. లోభానికి పోతే దానికి అంతమనేదే ఉండదు. దాదా భగవాన్ ఎవరు అన్నది మీకు అర్థమైందా?

## 'దాదా భగవాన్' స్వరూపం ఏమిటి?

**ప్రశ్నకర్త:** దాదా భగవాన్ స్వరూపం ఏమిటి?

**దాదాశ్రీ:** దాదా భగవాన్ స్వరూపం ఏమిటా? భగవాన్! ఇంకేముంటుంది? ఆయనకు ఈ వర్ల్డ్ (ప్రపంచం) తో ఎటువంటి బంధం లేదు, ఆయనలో అహంకారం లేదు, ఆయన బుద్ధి అనేదాన్నే ఉపయోగించనివారు, ఇదీ ఆయన స్వరూపం.

## ఆత్మజ్ఞానానికి పైన, కేవల జ్ఞానానికి కింద

జ్ఞాని పురుషునికి కేవలజ్ఞానం నాలుగు డిగ్రీల దగ్గర ఆగిపోయివుంది. ఆత్మజ్ఞానంలో ముందున్నారు. ఆత్మజ్ఞానంలో ముందుకి వెళ్ళివున్నారు, కేవలజ్ఞాన స్టేషన్ వరకు చేరుకోలేదు. ఈ మధ్యలో ఉన్న జ్ఞేయం ఏదైతే ఉందో, అది జగత్తుకి తెలియదు. నేను చెప్పేదానిలో ఒక్క వాక్యం కూడా జగత్తుకి తెలియదు, దాని ధ్యాసే లేదు. నేను చెప్పినది బుద్ధితో వాళ్ళు అర్థం చేసుకుంటారు. అర్థం కాదనేదేమీ లేదు. బుద్ధి అనేది ఒక ప్రకాశం. ఆ ప్రకాశంతో ఎదుటివారు చెప్పేది అర్థమౌతుంది, అది నిజమే అని తెలుస్తుంది. కానీ వాళ్ళకి మళ్ళీ అది గుర్తుండదు. కేవలం జ్ఞాని పురుషుడు చెప్పే మాటలలో వచన బలం ఉన్న కారణంగా, అవసరమైనప్పుడు అది గుర్తుకి వస్తుంది. సంకట సమయం వచ్చినపుడు ఆ మాటలు గుర్తుకి వస్తే, దాన్ని వచన బలం అంటారు.

## ప్రపంచం చూసింది కాని, పూర్తిగా అర్థం చేసుకోలేదు

నేను కేవలజ్ఞానంలో ఉత్తీర్ణుడను కానివాడిని.

**ప్రశ్నకర్త:** నాలుగు అంశాలు! ఆ నాలుగు అంశాలు ఏమిటి?

**దాదాశ్రీ:** మీకు కనిపించే చారిత్రమోహం నాకు కనిపించకపోవచ్చు కానీ, ఎదుటివారికి కనిపిస్తుంది కనుక, అన్ని అంశాలు తగ్గిపోతాయి. రెండవది, ప్రపంచం నాకు అర్థమైంది కాని, అవగాహన కాలేదు. కనుక, కేవలజ్ఞానాన్ని కూడా అవగాహన చేసుకోవాలి. ఇద్దైతే అర్థమైంది.

**ప్రశ్నకర్త:** అవగాహనలోకి రానిదాన్ని ఎలా విడదీయాలి?

**దాదాశ్రీ:** అర్థమైంది కాని అవగాహనలోకి రాలేదు. ఒకవేళ అది అవగాహనలోకి వస్తే దాన్ని కేవలజ్ఞానమంటారు. అర్థమైంది కనుక దాన్ని కేవల దర్శనం అంటారు.

**ప్రశ్నకర్త:** 'అవగాహన రాలేదు కాని అర్థమైంది' అన్నది నాకు అర్థం కాలేదు. కాస్త వివరిస్తారా?

**దాదాశ్రీ:** అర్థమవటం అంటే, ఈ ప్రపంచం అంటే ఏమిటి, ఎలా ఉత్పత్తయింది, మనస్సు అంటే ఏమిటి, మనసు ఫాదర్ మదర్ (తల్లిదండ్రులు) ఎవరు, బుద్ధి అనేదేమిటి, చిత్తమంటే ఏమిటి, అహంకారమంటే ఏమిటి, మనిషి జన్మ ఎందుకు కలుగుతుంది, ఫలానా జన్మ ఎలా జరుగుతుంది, ఇదంతా దేనితో నడుస్తోంది, ఎవరు నడుపుతున్నారు, భగవాన్ నడిపిస్తారా లేక మరెవరైనా నడుపుతున్నారా, నేనెవరు, మీరెవరు, ఈ విషయాలన్నీ మనకి అర్థమయ్యాయి, దివ్యచక్షువుల ద్వారా ప్రతి జీవిలోని ఆత్మ కనపడుతుంది. అంటే మొత్తం అంతా అర్థమైతే దాన్ని కేవలదర్శనం అంటారు.

## మాట్లాడుతున్నది టేప్‌రికార్డర్

**దాదాశ్రీ:** ఈ మాట్లాడేది ఎవరు? మీతో మాట్లాడుతున్నది ఎవరు?

**ప్రశ్నకర్త:** ఆ జ్ఞానం నాకు తెలియదు.

**దాదాశ్రీ:** అంటే, 'నేను' మీతో మాట్లాడటం లేదు. 'నేను' క్షేత్రజ్ఞునిలా చూస్తూవున్నాను. 'నేను' నా క్షేత్రంలోనే ఉంటాను. మీతో మాట్లాడుతున్నవారు ఒక రికార్డ్. కంప్లీట్ (పూర్తిగా) రికార్డ్. కనుక దానితో మరో రికార్డ్ తయారవగలదు. ఇది పూర్తిగా మెకానికల్ (యాంత్రికమైన) రికార్డ్.

అంటే, ఈ కనిపించేదేది భాదరణ్ కి చెందిన పటేల్. మాట్లాడుతున్నది (నోటి నుండి వెలువడుతున్న వాణి) టేప్‌రికార్డర్. ఒరిజినల్ టేప్‌రికార్డర్. లోపల దాదా భగవాన్ ప్రకటమైవున్నారు కదా, ఆయనతో నేను ఏకమైవుంటాను. ఎప్పుడైనా బయటకు వచ్చి, అంబాలాల్‌తో ఏకమౌతాను. రెండు వైపుల నుంచి వ్యవహారం నడిపించనివ్వాల్సివస్తుంది. అంబాలాల్‌తోను ఉండాలి, లేకపోతే లోపల అభేదం ఉంటుంది. ఇప్పుడు ఈ వ్యవహారంలోకి వచ్చాను కానీ, లేకపోతే నేను లోపల అభేదంతో ఉంటాను.

## గురు పౌర్ణమి నాడు సంపూర్ణ ఆత్మచంద్రుడు

మన దగ్గర ఈ మూడు రోజులను ఉత్తమంగా పరిగణిస్తారు– కొత్త సంవత్సరంలో మొదటి రోజు, జన్మదినం, గురుపౌర్ణమి. ఈ మూడు రోజులలోను మనం వేరే వ్యక్తులతో వ్యవహారం చేయం. అంటే, ఆ సమయంలో మన స్వరూపం పూర్తిగా ఏకీకృతమైవుంటుంది. నేను (జ్ఞాని పురుష్) నా స్వరూపంలో (దాదా భగవాన్‌తో) ఏకమైవుంటాను. ఆ దర్శనం వలన ఫలం లభిస్తుంది. అందువలన ఆ పూర్ణ స్వరూప దర్శనం ఎంతో మహత్వపూర్ణం కదా!

## పదకొండవ వింత, ఈ అక్రమ విజ్ఞానం !

భగవాన్ మహవీర్ వరకు పది వింతలైతే ఇది పదకొండవ వింత. జ్ఞాని పురుష్ వ్యాపారి రూపంలో వీతరాగులైయున్నారు. వ్యాపారి భావంతోనే వీతరాగి. అలాంటి దర్శనం కలిగిందంటే అది ఆశ్చర్యమే కదా! చూడండి, ఇది నా కోటు, ఇది నా టోపీ! జ్ఞానులలో ఎవరైనా ఇలా ఉంటారా? అతనికి పరిగ్రహణంతో పనేమిటి?

ఏమీ అవసరంలేని మనిషి పరిగ్రహణంలో ఇరుక్కుపోయారు! ఆయనకేమీ అవసరం లేదు. అయినా అంతిమ దశలో ఉన్నారు! కానీ లోకులకా భాగ్యం లేదు. అందుకే ప్రపంచంలోని వ్యావహారిక వేషధారణలో ఉన్నారు. అంటే, ఒకవేళ త్యాగి వేషంలో ఉండివుంటే, లక్షలు, కోట్లమంది గట్టెక్కేవారు. కానీ ఈ మనుషుల పుణ్యం అంతంత మాత్రంగానే ఉంది.

## నాకు లభించిన సుఖం అందరికీ లభించాలి

**ప్రశ్నకర్త:** ధర్మ ప్రచారణ చేసేందుకు మీకు ప్రేరణ ఎవరు కలిగించారు?

**దాదాశ్రీ:** ధర్మప్రచారణకి ప్రేరణ దైవికమే. స్వయంగా ఏ సుఖమైతే నాలో ఉత్పన్నమైందో, అది నాలో, ఈ మనుషులకు కూడా అటువంటి సుఖం కలగాలి అన్న భావనను కలిగించింది.

నన్ను అడుగుతుంటారు, 'లోకకళ్యాణం కలుగజేయాలనే మనో నిశ్చయాన్ని మీరు ఎలా పూర్తిచేస్తారు?' మీ వయసు మీరిపోయింది. ఉదయం లేచి టీ తాగేసరికే 10 గంటలౌతుంది. 'అరె భాయ్, నేను స్థూల రూపంలో ఏమీ చెయ్యనక్కర్లేదు. అంతా సూక్ష్మ రూపంలో జరిగిపోతూవుంది'. స్థూలం కేవలం చూపించటానికే. స్థూలానికి ఆధారమైతే ఉండాలి కదా!

## జ్ఞాని కరుణ హృదయాన్ని తడిచేస్తుంది

**ప్రశ్నకర్త:** మీవంటి వీతరాగికి ప్రపంచంతో ఏం సంబంధం?

**దాదాశ్రీ:** వీతరాగమనేది ఒక భావన. వేరే సంబంధమేమీ ఉండదు. కానీ ప్రస్తుతం పూర్తి వీతరాగిని కాను కదా! మీరు అడుగుతున్న మనిషి ఇప్పుడు పూర్తిగా వీతరాగి కాదు! ఇప్పుడు నేను *ఖట్‌పటియా* వీతరాగిని. ఖట్‌పటియా అంటే, ఎప్పుడూ లోకకళ్యాణం ఎలా చేయవచ్చా అన్న ఆలోచనలోనే ఉండటం. అందుకోసం *ఖట్‌పట్* చేస్తుంటాడు (తన శక్తిని ఖర్చుపెడుతుంటాడు). ఇకపోతే వీతరాగికి ఈ

ప్రపంచంతో ఏ సంబంధమూ ఉండదు. సంపూర్ణ వీతరాగి కేవలం దర్శనం ఇస్తుంటాడు కానీ వేరే ఏమీ చెయ్యడు.

**ప్రశ్నకర్త:** కానీ జనంతో కలిసే వీతరాగి, తన కర్మలను పోగొట్టు కోవటానికే అలా చేస్తాడా?

**దాదాశ్రీ:** తన లెక్క పూర్తి చేసుకోవటానికే కాని, ఇతరుల కోసం కాదు. వాళ్ళకి వేరే భావన ఏదీ ఉండదు. నాకు ఎలా మేలు జరిగిందో, ఇతరులకు కూడా అలాగే జరగాలి అన్న భావనే ఉంటుంది. వీతరాగికి అలా ఉండదు. అసలే భావనా ఉండదు సంపూర్ణ వీతరాగికి! నాకైతే ఈ రకమైన భావన ఉంటుంది. అందుకే ఉదయమే లేచి ప్రశాంతంగా కూర్చుంటాను. స్కూల్ (సత్సంగం) ప్రారంభిస్తాను. అది రాత్రి పదకొండు గంటల వరకు నడుస్తుంటుంది. అదీ నా భావన. ఎందుకంటే నాకు లభించిన సుఖం అందరికీ లభించాలి! ఈ దుఃఖమంతా ఎందుకు? దుఃఖమనేదే లేదు, అకారణంగా దుఃఖపడుతున్నారు. ఈ అజ్ఞానం తొలగిపోతే దుఃఖం పోతుంది. చెప్పటం వలన అది పోదు. చూపిస్తే తొలగిపోతుంది. అందువలన నేను చేసి చూపిస్తాను. దీన్ని మూర్త స్వరూపమంటారు. అందువలన శ్రద్ధ యొక్క మూర్తి అంటారు.

**ప్రశ్నకర్త:** ఆప్తపురుషుని వాణి, ప్రవర్తన, ఆలోచనలు ఎలా ఉంటాయి?

**దాదాశ్రీ:** అవన్నీ మనోహరంగా ఉంటాయి. మనసుని దోచుకునే విధంగా ఉంటాయి. మనసు ప్రశాంతమౌతుంది. వారి వినయం వేరే విధంగా ఉంటుంది. విదౌట్ ఇగోయిజమ్ (నిరహంకారి) ప్రవర్తన ఉంటుంది. అహంకార రహితమైన ప్రవర్తన ఈ ప్రపంచంలో బహుశా ఎక్కడో కానవస్తుందేమో కాని సాధారణంగా కనపడదు.

## జ్ఞాని అని ఎవరిని అంటారు?

**ప్రశ్నకర్త:** జ్ఞానికి నిర్వచనం ఏమిటి?

**దాదాశ్రీ:** అక్కడ నిరంతరం ప్రకాశం ఉంటుంది. అన్నీ తెలిసినవాడు, తెలుసుకోవలసిందంటూ ఏమీ లేనివాడు. జ్ఞాని అంటే వెలుగు. వెలుగు అంటే, ఏ విధమైన చీకట్లు లేనివాడు.

జ్ఞాని వర్ల్డ్‌లో ఎప్పుడో ఏదో సమయం ఒకరు అరా ఉంటారు. ఇద్దరు ఉండరు. జంట ఎప్పుడూ ఉండదు. జంట ఉండే స్పర్థలు ఉంటాయి. జ్ఞాని అవటమనేది ఒక నేచురల్ అడ్జస్ట్‌మెంట్. ఎవరూ తనంతట తానుగా జ్ఞాని అవలేరు!

జ్ఞానిపురుష్ ముక్తులైయ్యుంటారు. దేనితోను బంధంలో లేకుండా ఉంటారు. ఎవరూ అతనితో స్పర్థలతో ఉండలేరు. ఎందుకంటే స్పర్థలను పెట్టుకునేవాడు జ్ఞానే కాడు.

## ద్రవ్య, క్షేత్రం, కాలం, భావాలతో అప్రతిబద్ధత

ద్రవ్య, క్షేత్రం, కాలం, భావాలతో ఎవరైతే నిరంతరం అప్రతిబద్ధతతో తిరుగుతుంటారో, అటువంటి జ్ఞాని పురుషుని చరణారవిందాలను భజిస్తే మీకు సమాధానం దొరుకుతుందని వీతరాగులంటారు. ఏ డబ్బూ అతనిని కట్టిపడేయదు, ఏ కాలమూ అతన్ని కట్టిపడేయదు, ఎటువంటి భావనా అతన్ని కట్టిపడేయదు, ఏ ద్రవ్య, క్షేత్ర, కాలం అతన్ని కట్టిపడేయదు. ప్రపంచంలో ఈ నాలుగే ఉన్నాయి. వీటి మీదనే ప్రపంచమంతా ఆధారపడి నిలిచింది. ఎవరైతే ద్రవ్య, క్షేత్ర కాలం, భావనలతో అప్రతిబద్ధ రూపంలో తిరుగుతూవుంటారు. అటువంటి జ్ఞాని పురుష్ చరణారవిందాలకు పూజచేయమని భగవాన్ అన్నారు.

## రాగద్వేషాలూ ఉండవు, త్యాగాత్యాగాలూ ఉండవు

త్యాగం, అత్యాగం లేకుండా సహజభావంలో ఉండేవారిని జ్ఞానిపురుష్ అంటారు. వారికి రాగద్వేషాలుండవు. వారి విశేష విలక్షణత రాగద్వేషాలు లేకపోవటం.

## నిర్దోష దృష్టితో చూస్తే లోకమంతా నిర్దోషిలా చూస్తారు

ప్రపంచం మొత్తంలోను నాకు దోషులెవరూ కనిపించరు. నా జేబు కత్తిరించేవాడు కూడా నాకు తప్పుచేసినవాడిలా కనపడడు. అతని మీద కరుణ కలుగుతుంది. నాలో దయ ఏమాత్రం ఉండదు! మనుషులకు దయ ఉంటుంది.

జ్ఞాని పురుష్‌కి దయ ఉండదు. వారు ద్వందవిముక్తులైయ్యుంటారు. నా దృష్టే నిర్దోషంగా ఉంటుంది. అంటే తత్త్వదృష్టి ఉంటుంది కాని అవస్థా దృష్టి ఉండదు. అందరిలోను నేరుగా ఆత్మే కనపడుతుంది.

## 2. బాల్యావస్థ

### అహింసాధర్మాన్ని అమ్మ నుండి నేర్చుకున్నాను

మా అమ్మగారు నాకంటే 36 సంవత్సరాలు పెద్దది. ఒక రోజు నేను మదర్ (అమ్మ) ని అడిగాను, 'ఇంట్లో నల్లులు బాగా పెరిగాయి కదా, మిమ్మల్ని కుట్టవా?' అని. అందుకు అమ్మ, 'ఔను నాన్నా కుడతాయి కానీ పాపం అవి ఇతరులలా టిఫిన్ బాక్స్‌ని వెంట తీసుకుని రావు, 'ఏమైనా పెట్టండమ్మా అయ్యా' అని అడుక్కోవు. అవి పాపం గిన్నెలేమీ తెచ్చుకోవు. ఎంత తినాలో అంతే తిని వెళ్ళిపోతాయి' అన్నది. నేను, 'మీరు ధన్యులమ్మా! మీ కొడుకూ అదృష్టవంతుడు' అన్నాను.

మేము నల్లులను కూడా రక్తం తాగనిచ్చేవాళ్ళం, ఇంటికి వచ్చావు కదా భోజనం చేసి పో అని. ఎందుకంటే మన హోటల్ (శరీరం) ఎటువంటిదంటే, ఇక్కడ ఎవరికీ ఎటువంటి కష్టమూ కలుగకూడదు. ఇదే నా వ్యవసాయం! అందుకే, నల్లులకు కూడా భోజనం పెట్టాను. వాటికి భోజనం పెట్టనందుకు మాకు ప్రభుత్వమేమైనా శిక్ష విధిస్తుందా? లేదే! నాకు ఆత్మప్రాప్తి కదా కావలసింది! ఎప్పుడూ చోవిహార్ (కేవలం పగటి పూటే ఆహారం తీసుకోవటం), ఎప్పుడూ కందమూలాలను త్యజించటం, ఎప్పుడూ వేడి చేసిన నీళ్ళు తాగటం, ఇలాంటివి పాటించటంలో ఏమాత్రం లోపం రానివ్వలేదు! అందుకే ఇది ప్రకటమైంది, పూర్తిగా 'అక్రమ విజ్ఞానం' ప్రకటమైంది. ప్రపంచం మొత్తాన్ని శుద్ధి చేసేటువంటి విజ్ఞానం ప్రకటమైంది.

### అమ్మ అందించిన సంస్కారం దెబ్బలు తినటం నేర్పింది

మా తల్లిగారు అటువంటిదే! ఆమె నాకు మంచి విషయాలు నేర్పుతుండేది. చిన్నప్పుడు నేను ఒకడిని కొట్టి ఇంటికి వచ్చాను. ఆ అబ్బాయికి రక్తం వచ్చింది. అమ్మకి ఈ విషయం తెలిసి నాతో, 'నాయనా, అతనికి రక్తం వచ్చింది. నిన్ను

ఎవరైనా అలా కొట్టినట్లయితే నాకు, నీకోసం మందు వేయాల్సివుండేది కదా? ఇప్పుడు ఆ అబ్బాయి తల్లికి కూడా అతనికి మందు వేయాల్సివుండవచ్చు కదా? పాపం ఎంత ఏడుస్తుండవచ్చు? ఆమెకి ఎంత దుఃఖం కలిగివుండవచ్చు? అందువలన ఎప్పుడైనా నీవు దెబ్బలు తిని రా కాని, ఎవరినీ కొట్టిరావద్దు. నువ్వు దెబ్బలు తిని వస్తే నేను నీకు మందు వేస్తాను!' అంది. ఇప్పుడు చెప్పండి, అటువంటి తల్లి మహావీర్‌ని తయారుచేస్తుందా లేదా? ఆ విధంగా మా తల్లిగారు కూడా నాకు ఉచ్చకోటి సంస్కారాన్ని అందించింది.

## అందులో నష్టం ఎవరికి?

నేను చిన్నప్పుడు కాస్త అలిగేవాడిని! ఎక్కువేమీ కాదు!! అప్పుడప్పుడూ అలక చూపించేవాడిని. తర్వాత నేను లెక్కేసి చూసుకుంటే అలగటం వలన కేవలం నష్టమే జరుగుతోంది కనుక, నాతో ఎవరు ఎలా ప్రవర్తించినా సరే ఎప్పుడూ వారి మీద అలగకూడదని నిర్ణయించుకున్నాను. నేను అలగటం వలన ఆ రోజు ఉదయం నేను తాగవలసిన పాలను నేను పోగొట్టుకున్నాను. ఆ రోజు నేను సాయంత్రం వరకు లెక్కలు వేసుకుని చూసుకున్నాను ఆ రోజు నేను ఏమేం పోగొట్టుకున్నానో.

అమ్మ మీద నాకేం ఫిర్యాదు? 'నన్ను, వదినను అమ్మ ఒకేలా ఎందుకు చూస్తుంది? వదినకి అర్ధ శేరు పాలు, నాకు కూడా అర్థ శేరు పాలే ఇస్తావా? ఆమెకి తక్కువ ఇవ్వు' అని. నాకు అర్థ శేరు ఇస్తే చాలు. నాకు ఎక్కువేమీ వద్దు కానీ వదినకి తక్కువ చెయ్యాలి. ఒకటిన్నర పావు ఇవ్వు అన్నాను. అప్పుడు అమ్మ ఏమన్నదంటే, 'ఇక్కడ నీకు అమ్మ ఉంది కాని, ఆమె అమ్మ ఇక్కడ లేదు కదా! పాపం తప్పుగా అనుకుంటుంది, బాధపడుతుంది. అందువలన సమానంగానే ఇవ్వాలి' అని. అయినా నాకు అది సమ్మతం కాలేదు. అమ్మ మళ్ళీ మళ్ళీ నాకు నచ్చచెప్పజూసింది. ఎన్నో రకాలుగా వ్యర్థ ప్రయత్నం చేసింది. కానీ ఒక రోజు నేను పట్టుబట్టాను, దానితో నష్టం నాకే జరిగింది. అందువలన నేను ఆ రోజు నిర్ణయించుకున్నాను మరెప్పుడూ పట్టుదలకు పోగూడదని.

## చిన్న వయసులోనే సరైన అవగాహన

పన్నెండు సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు, గురువుగారి చేత కట్టించిన రక్ష తెగిపోయింది. అప్పుడు అమ్మ, 'మళ్ళీ కట్టిద్దాం రక్షని' అంది. అందుకు నేను, 'మన పూర్వీకులు ఈ బావిలోకి దూకినపుడు ఇందులో నీళ్ళు ఉండివుంటాయి. కాని ఇప్పుడు నేను ఇందులోకి తొంగిచూస్తే నాకు పెద్ద పెద్ద రాళ్ళు కనిపిస్తాయి. నీళ్ళు కనపడవు కాని, పెద్ద పెద్ద పాములు కనిపిస్తాయి. నేను ఈ బావిలోకి దూకదలచుకోలేదు' అన్నాను. తండ్రులు, తాతలు ఏ బావిలో దూకారో అందులోనే మనం కూడా దూకాలని ఎక్కడైనా రాసివుందా? నీళ్ళున్నాయో లేదో అని లోపలికి చూడు. ఉంటే దూకు కానీ నీళ్ళు లేకపోయినా అందులో పడి తల పగలగొట్టుకుంటే ఏం లాభం?

అప్పుడు గురువు అంటే ప్రకాశాన్ని ప్రసరింపజేసేవాడు అనే అర్థంలో నేను అర్థం చేసుకున్నాను. ఆయన నాకు ప్రత్యక్షంగా జ్ఞానం ఇవ్వకపోతే, ప్రత్యక్షంగా ప్రకాశాన్నివ్వకపోతే నేను ఆయనతో చల్లటి నీళ్ళు చిలకరించికాని లేక కుండలో నీళ్ళని గుమ్మరించికాని రక్ష కట్టించుకోవలసిన అవసరం లేదు. ఒకవేళ ఆయనను నేను గురువుగా స్వీకరించేందుకు యోగ్యులైతే, చల్లని నీరేమిటి చెయ్యి కోసుకోమని చెప్పినా కోసుకుంటా. చెయ్యి కట్ చేసుకుంటే మటుకేమిటి? అనంత జన్మలలో చెయితో పాటే తిరుగుతూ వచ్చాను కదా? ఎవరైనా ఆయుధంతో ఖండిస్తే ఖండించనిస్తాం కదా? మరి గురువే ఖండించటానికి వస్తే ఏమేం ఖండించనివ్వం? ఎవరైనా బందిపోట్లు ఖండిస్తే ఖండించనిస్తాం కదా, మరి గురువు ఖండిస్తే? కానీ గురువు పాపం ఖండించే మనిషి కాదు. కానీ కట్ చేయమని అన్నారనుకోండి, అలా చెయ్యకుండా ఉండటానికి మనకి కారణం ఏమైనా ఉంటుందా?

అందువలన అమ్మ నన్నందరూ *'నిగురు'* అంటారంటే, *'నిగురు'* అంటే ఏమిటి అని అడిగాను. అది నాకు అర్థం కాలేదు. ఈ పదాన్ని కేవలం అడ్జస్ట్‌మెంటు కోసం మనుషులు ఉపయోగిస్తుంటారని అనుకున్నాను. *'నిగురు'* అని ముద్రవేసి నిందిస్తారనుకున్నాను కాని, దాని అర్థం 'గురువు లేకపోవటం' అని నాకు తెలియదు

ఆ రోజుల్లో. అందువలన నేను, 'అందరూ నన్ను నిగురు అని నన్ను నిందిస్తారేమో, అంతకంటే ఇంకేమంటారు నన్ను?' అన్నాను. కానీ ఆ తర్వాత దాని అర్థం ఏమిటో నాకు తెలిసింది.

## అటువంటి మోక్షం నాకు వద్దు

పదమూడు సంవత్సరాల వయసులో స్కూల్ సమయంలో కొంత తీసి అక్కడ దగ్గర్లోని సంతపురుష్ ఆశ్రమానికి వెళ్ళి ఆయన దర్శనం చేసుకుంటూవుండేవాడిని. అక్కడ ఉత్తర భారతదేశంలోని కొందరు సాధువుల నివాసాలుండేవి. వాళ్ళు చాల సాత్వికులు. అందువలన నేను నా పదమూడవ సంవత్సరంలో వారికి పాదసేవ చేసేవాడిని. ఆ సమయంలో వాళ్ళు నాతో, 'నాయనా, భగవంతుడు నీకు మోక్షం ప్రసాదించి తీసుకునివెళ్తాడు' అనేవారు. అందుకు నేను, 'అయ్యా, అలాంటి మాటలు చెప్పకపోతేనే నాకు బాగుంటుంది. ఇలాంటి మాటలు నాకు ఇష్టం ఉండవు' అన్నాను. వాళ్ళకి నేను ఒక అమాయకపు బాలకుడు కాబట్టి అర్థం కాలేదు అనిపించింది. 'నెమ్మది నెమ్మదిగా నీకు అర్థమౌతుందిలే' అన్నారు మళ్ళీ. అప్పుడు నేను, 'సరేలే అయ్యా' అన్నాను. కానీ నాలో పెద్ద పెద్ద ఆలోచనలు రావటం మొదలుపెట్టాయి. భగవంతుడు నన్ను మోక్షంలో తీసుకునిపోయి నన్ను అక్కడ కూర్చోబెడితే, ఆయనకు తెలిసినవాళ్ళు ఎవరైనా వచ్చి, 'లేలే పో ఇక్కడి నుంచి' అంటే? నాకు వద్దు అలాంటి మీ మోక్షం. దానిబదులు భార్యతో ఉల్లిపాయ పకోడీలు తింటూ సరదాగా గడపవచ్చు కదా అందులో తప్పేముంది? దానితో పోలిస్తే ఈ మోక్షమేమైనా గొప్పదా? అక్కడ నుంచి ఎవరైనా నన్ను లేపేసేవాళ్ళుంటే, అక్కడ యజమాని ఎవరైనా ఉంటే, అలాంటి మోక్షం నాకు వద్దు.

అంటే పదమూడు సంవత్సరాల వయసులోనే స్వతంత్ర భావాలు వచ్చి, నా మీద పెత్తనం చలాయించే యజమాని ఉంటే నాకు అలాంటి మోక్షం వద్దు. అలా లేనట్లయితే, నా మీద యజమానీ వద్దు, నాకింద అండర్‌హ్యాండ్ కూడా వద్దు. అండర్‌హ్యాండ్ ఉండటం నాకు ఇష్టం ఉండదు.

'నేను కూర్చున్న చోటు నుంచి నన్ను లేపేసేవాళ్ళుంటే' అలాంటి మోక్షం నాకు వద్దు. యజమాని కాని, అండర్‌హ్యాండ్ కాని లేని వీతరాగ మోక్షం నాకు కావాలి. ఆ రోజుల్లో నాకు తెలియదు వీతరాగుల మోక్షం అలా ఉంటుందని. కానీ నాకు యజమాని అనేవాడు ఉండొద్దని నాకు ఆ రోజు నుంచి అర్థమైంది. లే ఇక్కడి నుంచి, అలాంటి మోక్షం నాకు వద్దు. అలాంటి భగవాన్ నా ఇంట్లో ఉండాలి! నీతో నాకేం పని? నువ్వు భగవాన్ అయితే నేనూ భగవానే! నన్ను కొద్దిసేపు నీ కింద అణిచివుంచే శక్తి నీకు వుందేమో! ఐ డోంట్ వాంట్ (నాకు అవసరం లేదు). అటువంటి కోరిక ఎందుకు? ఈ పంచేంద్రియాల వాంఛ కోసమా? ఎందుకా వాంఛ? జంతువులకు కూడా కోరికలుంటాయి, మనకీ కోరికలుంటాయి. ఇక మనకీ జంతువులకీ తేడా ఏమిటి?

## ఇతరుల వశంలో ఉండటం, ఐ డోంట్ వాంట్

ఎవరి దగ్గరా  ఉద్యోగం చేయగూడదు అనే ఆలోచన నాకు ముందు నుంచే ఉండేది. ఎవరి దగ్గరైనా ఉద్యోగం చెయ్యటం నాకు చాల బాధాకరంగా ఉంటుంది. బాస్ (యజమాని) నన్ను కోప్పడేదాని కంటే మరణమే మంచిది అనిపించేది. అది నేను భరించగలిగేది కాదు. నేను ఉద్యోగం చెయ్యను అనేది నాకు ఒక పెద్ద వ్యాధిగా ఉండేది, ఆ వ్యాధే నన్ను రక్షించింది. చివరకు ఒక స్నేహితుడు నన్ను, 'పెద్దన్నయ్య నిన్ను ఇంట్లోంచి వెళ్ళగొడితే ఏం చేస్తావు?' అని అడిగాడు. నేను, 'పాన్ దుకాణం పెట్టుకుంటాను' అన్నాను. అలా చేస్తే రాత్రి పది గంటల వరకు పాన్‌లు కట్టిస్తూ పదకొండు గంటలకు ఇంటికి పోయి తిని పడుకుంటా. అందులో మిగిలేది మూడు రూపాయలే కావొచ్చు. మిగిలేది రెండు రూపాయలైనా సరే దానితో గడిపేస్తాను. నాకు అన్నిటితోను సర్దుకుపోవటం వచ్చు. అంతే కాని పరతంత్రత ఏమాత్రం ఇష్టం ఉండదు. పరుల వశంలో ఉండటం ఐ డోంట్ వాంట్ (నాకు వద్దు)!

## అండర్‌హ్యాండ్‌ని ఎప్పుడూ కాపాడాను

జీవితంలో నా వ్యాపారమేమిటి? నా పై వాడిని ఎదుర్కోవటం, అండర్‌హ్యాండ్ (ఆధీనంలో ఉండి పనిచేసేవాడు) ని కాపాడటం. అది నా నియమం. ఎదుర్కోవాలి కానీ నా కంటే పై వాడితో. ప్రపంచమంతా ఎవరి ఆధీనంలో ఉంది? యజమాని

(మనకంటే పై స్థాయిలో ఉన్నవాడు) తో. అండర్‌హ్యాండ్‌ని తిడుతుంటారు. కానీ నేను పైవాడిని ఎదుర్కుంటాను. ఆ కారణంగా నాకు లాభం జరగలేదు. నాకు అటువంటి లాభంతో పనేలేదు. కానీ అండర్‌హ్యాండ్‌ని బాగా చూసుకున్నాను. అండర్‌హ్యాండ్ ఎవరున్నా వాళ్ళకి అన్నివిధాలా రక్షగా నిలిచాను. అండర్‌హ్యాండ్ ఎవరైనా కాని వారికి రక్షగా నిలవడమనేది అన్నిటికన్నా నాకున్న పెద్ద గుణం.

**ప్రశ్నకర్త:** మీరు క్షత్రియులు కాబట్టా?

**దాదాశ్రీ:** ఔను. క్షత్రియుడను. ఇది క్షత్రియుల గుణం. కాబట్టి దారిన పోతున్నప్పుడు ఎవరితోనైనా దెబ్బలాట జరిగితే నేను ఓడిపోయేవాడిని. దెబ్బలు తింటున్నవాని పక్షాన ఉండేవాడిని. ఇది కూడా క్షత్రియతే.

## చిన్నప్పుడు అల్లరి చేసే స్వభావం

నాకు అన్నీ కనిపిస్తాయి. ఇటువైపు చూస్తే ఇక్కడిదంతా కనిపిస్తుంది. అందుకే నేను అన్ని విషయాలనూ చెప్పగలుగుతాను. అటువంటి విషయాలను నా దృష్టికి వచ్చినపుడు చెప్తాను లేకపోతే ఎలా గుర్తుపెట్టుకోగలను? నాకు చివరి వరకు, బాల్యం వరకు అంతా కనిపిస్తుంది. వాటి అనుబంధ విషయాలన్నీ కనిపిస్తాయి. అప్పుడు అలా జరిగింది, ఇలా జరిగింది, స్కూల్ గంట మోగిన తర్వాత వెళ్తుండేవాడిని, అవన్నీ నాకు కనిపిస్తాయి. మాస్టారు నన్నేమీ అనలేక కోపం పెట్టుకునేవారు.

**ప్రశ్నకర్త:** మీరు స్కూల్ గంట కొట్టిన తర్వాత ఎందుకు వెళ్ళేవారు?

**దాదాశ్రీ:** నా గొప్పతనం చూపించుకోవటం కోసం! మనసులో అలా దర్పం! ఆ సమయంలో నేను సాదాసీధాగా ఉండేవాడిని కాను కనుక అలా వక్ర మార్గంలో ఆలస్యంగా పోయేవాడిని! సాదాసీధా అయితే గంట కొట్టటానికి ముందుగానే తన సీటులో కూర్చుంటాడు కదా.

**ప్రశ్నకర్త:** దర్పం చూపించటం వక్రమార్గం అనిపించుకుంటుందా?

**దాదాశ్రీ:** అది వక్ర మార్గమే అనిపించుకుంటుంది కదా! గంట కొట్టిన తర్వాత, మాస్టారు వచ్చిన తర్వాత వెళ్ళేవాడిని. మాస్టరుగారు ఆలస్యంగా వస్తే

పరవాలేదు కాని, పిల్లలైతే గంట కొట్టక ముందే వచ్చివుండాలి కదా? కానీ అలాంటి వక్రబుద్ధి! పైగా, 'మాస్టారు తనను తాను ఏమనుకుంటున్నాడు?' అనేవాడిని. అరె, నువ్వు చదువు నేర్చుకోవాలా లేకపోతే లడాయి పెట్టుకోవాలా? అని అడిగితే, 'లేదు ముందు లడాయే పెట్టుకోవాలి'.

**ప్రశ్నకర్త:** అయితే, మాస్టరుగారు మిమ్మల్ని ఏమీ అనలేకపోయేవారా?

**దాదాశ్రీ:** అనగలరాయన. కానీ అనలేకపోయేవారు. బయటికి పోయిన తర్వాత నేను రాయి వేసి ఆయన తల పగలగొడతానేమోనన్న భయం ఉండేది.

**ప్రశ్నకర్త:** దాదాజీ, మీరు ఇంత అల్లరి చేసేవారా?

**దాదాశ్రీ:** ఔను అల్లరివాడినే. నా సరుకు (ప్రకృతి స్వభావం) అల్లరిచేసేదే. వక్రమైన సరుకు.

**ప్రశ్నకర్త:** అలా ఉండి కూడా జ్ఞానం ప్రకటితమైందంటే ఆశ్చర్యకరమైన విషయమే అనాలి కదా!

**దాదాశ్రీ:** లోపల ఏ ధూళి లేదు కాబట్టి 'జ్ఞానం' కలిగింది. ఈ అహంకారం కూడా ఉండగూడదు నిజానికి. అయితే మమత్వం ఏమాత్రం ఉండేది కాదు. దురాశ ఉండేది కాదు. అందుకే ఈ దశ ప్రాప్తించింది. అయితే ఎవరైనా నా పేరెత్తితే మాత్రం వాళ్ళకి మూడేది. అందుకే నన్ను వెనక నుంచి ఇతనికి గర్వం ఎక్కువ అని అనుకునేవారు. కొంతమందైతే, 'వదిలెయ్యరాదూ అతనికి గర్వం ఎక్కువలే' అనేవారు. అంటే, నాకు ఎటువంటి విశేషణాలను అంటగట్టేవారన్నది నాకు తెలుస్తుండేది. కానీ నాలో మమత్వ భావన ఉండేది కాదు. అదే ప్రధానమైన గుణం. దాని ప్రభావమే ఇది! ఎవరైనా నేను, నాది అనే మమత్వ భావనతో ఉన్నప్పుడు వంద రెట్లు తెలివితేటలు ఉన్నాసరే, వాళ్ళు ప్రాపంచిక వ్యవహారాలలో పూర్తిగా కూరుకునిపోతారు. నాకు అలాంటి మమత్వం లేదు కనుకనే వాస్తవంలో ఆనందంగా ఉంటాను. ఈ మమత్వమే ప్రపంచం. అహంకారమనేది ప్రపంచం కాదు.

ఆ తర్వాత నేను కూడా తిన్నగా అయిపోయాననే అనుభవం నాకు వచ్చింది. ఎవరినైనా తిన్నగా చేయవలసిన అవసరం నాకు ఉండదు.

**ప్రశ్నకర్త:** దాదాజీ, మీరు తిన్నగా ఎలా అయిపోయారు?

**దాదాశ్రీ:** మనుషులు నన్ను ఎన్నో రకాల పట్టుకారులతో పట్టుకుని లాగి తిన్నగా చేసారు.

**ప్రశ్నకర్త:** అదంతా పూర్వ జన్మలలో శుద్ధమౌతూ వచ్చింది కదా?

**దాదాశ్రీ:** ఎన్నో జన్మల నుంచి శుద్ధమౌతూమైతూ ఈ జన్మలో పరిపూర్ణంగా తిన్నగా చేసింది.

## భాషను అర్థం చేసుకునేదానికంటే ఎక్కువ భగవంతుని మీద ఆసక్తి

నేను ఇంగ్లీషు మాస్టారితో, మీరేమైనా అనండి నన్ను కాని, నేనైతే ఇక్కడ మీ దగ్గర ఇరుక్కుపోయాను అని చెప్పాను. పదిహేను సంవత్సరాల నుంచి చదువుతున్నాను కాని మెట్రిక్ కూడా చెయ్యలేకపోయాను. ఒంట్లతో మొదలుపెట్టి ఇప్పటికి పదిహేను సంవత్సరాలైంది కానీ మెట్రిక్ పూర్తిచేయలేకపోయాను. ఈ పదిహేను సంవత్సరాలలో నేను భగవంతుడిని వెతికి పట్టుకోగలిగేవాడిని. ఇన్ని సంవత్సరాలు వ్యర్థమైపోయాయి. అవసరం లేని ఎబిసిడిలు చదివిస్తారు. వేరేవాళ్ళ భాష- ఫారిన్ భాష నేర్చుకోవటానికి మెట్రిక్ వరకు చదవాలా ఏమిటి? ఏం పిచ్చితనమిది? విదేశీ భాషను నేర్చుకునేందుకు ఇక్కడ మనుషుల జీవితంలో సగం గడిచిపోవాలా?

## లఘుత్తమాన్ని నేర్చుకుంటే భగవాన్ లభిస్తారు

అనంత జన్మల నుంచి అక్కడే పడివున్నాం. తిరిగి ఆవరిస్తే అందులోకి వచ్చేస్తాము. అజ్ఞానాన్ని నేర్చుకోవలసిన అవసరమేమీ లేదు. అజ్ఞానమనేది సహజంగానే వచ్చేస్తుంది. చదవాల్సింది జ్ఞానం. నాకు ఆవరించింది చాల తక్కువే కాబట్టి పదమూడు

సంవత్సరాలకే జ్ఞానం కలిగింది. చిన్నప్పుడు దారిలో వెళ్తున్న గుజరాతి స్కూల్ మాస్టారు నాతో, 'మీరు ఈ లఘుత్తమాన్ని (క.సా.గు) నేర్చుకోండి' అన్నారు. 'లఘుత్తమం అంటే ఏమిటి? మీరేం చెప్తున్నారు? లఘుత్తమాన్ని ఎలా తెలుసుకోవాలి?' అని అడిగాను. దానికి ఆయన, 'ఈ *రకం* లో అన్నిటికన్నా తక్కువ విలువైనదేదైతే ఉందో, ఏదైతే ఇంక విభజించటానికి ఉండదో, దేన్నయితే భాగించలేమో, అటువంటి '*రకం*' వెతికిపట్టుకోవాలి' అన్నారు. ఆ సమయంలో నేను చాల చిన్నవాడిని కదా, ఇతరులను ఎలా సంబోధిస్తాను? 'ఈ *రకాలు* మంచివారు కాదు'. మనిషి అనే మాటకు *రకం* అని సంబోధిస్తున్నారు. కనుక ఈ మాట నాకు బాగా నచ్చింది. అంటే, నాకు అనిపించినదాని ప్రకారం, ఈ రకంలో కూడా అలాగే కదా! అంటే, భగవాన్ అందరిలో అవిభాజ్య రూపంలో విరాజమానులైయున్నారు. అందువలన దానిలో నేను వెంటనే భగవాన్‌ని వెతికిపట్టుకున్నాను. ఈ మనుషులందరూ '*రకమే*' కదా! వారిలో భగవాన్ అవిభాజ్య రూపంలో ఉన్నారు.

## ఆత్మని తప్ప మరేమీ నేర్చుకోలేదు

చిన్నప్పుడు నేను సైకిల్ నడుపుతుండేవాడిని. ఆ సమయంలో యాభై రెండు రూపాయలకు ర్యాలీ సైకిల్ వచ్చేది. సైకిల్‌కి పంచర్ అయితే అందరూ వాళ్ళ వాళ్ళ ఇళ్ళల్లోనే రిపేరు చేసుకునేవారు. నేను చాల ఉదారుడిని కనుక ఒక సైకిల్ బాగుచేసే మనిషి దగ్గరకు పోయి, 'అన్నా, దీని పంచర్ వెయ్యవా?' అని అడిగాను. అతను, 'మీరు బయటి నుంచి రిపేర్ ఎందుకు చేయిస్తారు? ఇందులో చేయించాల్సింది ఏముంది?' అని అడిగాడు. జవాబుగా నేను, 'అన్నా, నేను ఇక్కడ అన్ని విషయాలనూ నేర్చుకోవటానికి రాలేదు. ప్రపంచంలో ఎన్నో విషయాలున్నాయి. అవన్నీ నేర్చుకోవటానికి కాదు నేను జన్మనెత్తింది. నేను ఆత్మ గురించి తెలుసుకోవటానికి వచ్చాను. నేను వీటన్నిటినీ నేర్చుకుంటూ కూర్చుంటే, ఆత్మ విషయంలో తెలుసుకోకుండా మిగిలిపోతుంది' అని చెప్పాను. అందువలన నేను నేర్చుకోలేదు. సైకిల్ నడపటం వస్తుంది. అదయినా, నేరుగా సైకిల్ మీదకు ఎక్కలేకపోయేవాడిని. వెనక చక్రం మీద నుంచి కాలుని తిప్పి ఎక్కి కూర్చునేవాడిని. నాకింకేమీ రాలేదు, నేర్చుకునే ప్రయత్నమూ చేయలేదు. అవసరాన్నిబట్టి నేర్చుకుంటూపోయాను. ఇంకా ఎక్కువ నేర్చుకోవలసిన అవసరం పడలేదు.

## గడియారం బాధాకరం అయింది

నాకు వేరే ధ్యాస ఏమి లేదు. ఏదైనా కొత్తది నేర్చుకుందామనే ప్రయత్నమేమీ చేయలేదు. ఇది నేర్చుకోవటానికి కూర్చుంటే అందులో (ఆత్మ గురించి నేర్చుకోవటంలో) తక్కువ పడుతుంది కదా? అందుకే కొత్త విషయాలేమీ నేర్చుకోలేదు.

చిన్నప్పుడు ఒక సెకండ్ హ్యాండ్ గడియారాన్ని పదిహేను రూపాయలకు తెచ్చాను. దాన్ని పెట్టుకుని తల కింద చేయి పెట్టుకుని పడుకున్నాను. ఫలితంగా చెవిలో నొప్పి మొదలైంది. దానితో, ఇది చాల బాధకలిగించేదయింది అనిపించింది. అందువలన దాన్ని మళ్ళీ పెట్టుకోలేదు.

## కీ ఇచ్చి సమయాన్ని నష్టపరచుకోలేదు

గడియారానికి కీ ఇవ్వటం నాకు ఒక పెద్ద కష్టమైన పనిగా ఉండేది. నా తోటివాడు ఒకసారి, ఏడు రోజులకోసారి కీ ఇచ్చే గడియారం ఉంది, దాన్ని తీసుకో అన్నాడు. అప్పుడు, ఏడు రోజులకు ఒకసారి కీ ఇస్తే నడిచే గడియారాన్ని తీసుకునివచ్చాను. కానీ తెలిసినతను వచ్చి, 'గడియారం చాల బావుంది' అన్నాడు. నేను అతనితో, 'సరే మరి మీరే తీసుకోండి. నాకు కీ ఇవ్వటం పెద్ద కష్టంగా ఉంది!' అన్నాను. అప్పుడు హీరా బా నాతో దెబ్బలాడటం మొదలుపెట్టింది, మీకు తోచిన వస్తువునల్లా ఇతరులకు ఇచ్చేస్తుంటారు. ఇప్పుడిక గడియారం లేకుండా సమయం ఎలా తెలుసుకోగలను అన్నది. ఇప్పుడైతే 15 సంవత్సరాల నుంచి నా మేనల్లుడే కీ ఇస్తున్నాడు. నేనెప్పుడూ గడియారం కీని తిప్పలేదు. నేను క్యాలెండర్ వైపు కూడా చూడనెప్పుడూ. క్యాలెండర్ చూసి నేను చెయ్యాల్సిందేముంది? ఆ పేజీలను ఎవరు చింపుతుంటారు? క్యాలెండర్ పేజీలను కూడా నేను చింపలేదు. అంత ఖాళీ సమయం నాకెక్కడిది? నేను గడియారం కీని తిప్పటంలోపెడితే, నా కీ ఎప్పుడు తిరుగుతుంది? అంటే నేను ఏ విషయంలోనూ నా సమయాన్ని పాడుచేసుకోలేదు.

## రేడియోని నేను పిచ్చితనమని అన్నాను

'రేడియో తీసుకురా!' అన్నాడొక మిత్రుడు. 'రేడియోనా? దాన్ని నేను వినాలా? నా టైం ఏమవాలి?' అన్నాను. వీళ్ళ మాటలు వింటుంటేనే చికాకు

వేస్తుంది ఇక రేడియో ఎలా ఉంటుంది నా దగ్గర? ఇదంతా మేడ్‌నెస్ (పిచ్చితనం) పూర్తిగా.

## ఫోన్ గోల కూడా పెట్టుకోలేదు

'మనం ఫోన్ పెట్టించుకుందామా?' అని అడిగితే, 'దానితో ఏం వేగుతాం? ప్రశాంతంగా నిద్రపోతుంటే గంట మోగుతుంది. ఇలాంటి వేతనలెందకు మనకి? అందరూ షోకుల కోసం పెట్టుకుంటారు. వాళ్ళ గొప్పతనం పెరుగుతుందనుకుంటారు. అందువలన గొప్పలకు పోయేవారికి అది అవసరం. మనం మామూలుగా బతికేవాళ్ళం. ప్రశాంతంగా నిద్రపోయేవాళ్ళం. రాత్రంతా స్వతంత్రం నిద్రపోతాం. ఈ టెలిఫోన్‌ని ఎవరు పెట్టుకుంటారు? రెండవ రోజే నేను దీన్ని పీకిపడేస్తాను. గంట మోగగానే ఆందోళన. గంట మోగగానే అంతా నాశనం. దోమలు, నల్లులు బాధపెడితే అది అనివార్యం. కానీ ఇది ఇచ్ఛాపూర్వకంగా చేసుకునేది కదా, దీన్ని ఎలా భరిస్తాం?

అంతకు ముందు కారు పెట్టుకున్నాం. డ్రైవర్ వచ్చి, 'సార్, ఈ పార్ట్ పోయింది' అంటుండేవాడు. నాకైతే ఆ పార్ట్ పేరు కూడా తెలియదు. నాకైతే ఇదేదో ఇరుక్కుపోయిట్లుగా అనిపించింది. నేను ఇరుక్కుపోవటం నా వైఫ్‌తో జరిగింది. ఫలితంగా పిల్లలు పుట్టారు. ఒక బజారుని నిలబెట్టటం సులభమే కానీ అలా ఇరుక్కుపోయే మూడు నాలుగు బజార్ల అవసరం ఏముంది? ఇలా ఎన్ని బజార్లు పెట్టుకుని తిరగాలి?

ఇదంతా కామన్‌సెన్స్ చెప్పే మాటలు. ఆ డ్రైవర్ కారులోంచి పెట్రోల్ తీసేసి వచ్చి, 'బాబాయ్, పెట్రోల్ పోయించాలా?' అని అడిగితే ఆ బాబాయికేం తెలుసు? అందువలన మేము కారుని పెట్టుకోలేదు. కానీ సంయోగం వలన కారు తీసుకునిరా అంటారు.

## అక్కడ ఏ సుఖాన్నీ చూడలేదు

**ప్రశ్నకర్త:** దాదాజీ, మాకు అన్నీ కావాలి, మీకేమీ అవసరం లేదు. కారణం ఏమిటి?

**దాదాశ్రీ:** మీరు ఇతరుల నుంచి తెలుసుకుని అడుగుతున్నారు. నేను ఇతరుల నుంచి ఏమీ నేర్చుకోలేదు. నేను ముందు నుంచే మనుషులకు వ్యతిరేకంగా నడిచేవాడిని. మనుషులంతా ఏ దారిలో నడుస్తుంటే దాన్నుంచి తిరిగి నేను మరో దారిలో పోతుంటే అంతా ఆ రోడ్డులో తిరిగి పోతుంటారు. నా లెక్క ప్రకారం తిన్నగా పోతే ఒక మైలు అయినట్లయితే, తిరిగి పోతే మూడు మైళ్ళవుతుంది. సగం వృత్తాన్ని తగ్గిస్తే, మైలున్నర దూరం మిగిలివుంటుంది. అలా నేను మధ్యలో తిన్నగా నడుస్తాను. దారిని లెక్కచూసి మధ్యలో తిన్నగా వెళ్ళిపోతాను. అలా నేను లోకవిరుద్ధంగా నడిచాను. వీళ్ళు చెప్పినట్లు ఎక్కడికైనా వెళ్ళిపోతానా ఏమిటి? లోకసంజ్ఞ నామమాత్రానికైనా ఉండేది కాదు. అందరూ ఎందులో సుఖముందని అనుకుంటే, అందులో నాకు సుఖమే కనిపించేది కాదు.

## ఇష్టం కేవలం మంచి బట్టల మీదనే

కేవలం ఒక విషయంలోనే ఆసక్తి ఉండేది- ఫస్ట్‌క్లాస్ బట్టలు వేసుకోవాలన్నది. అది అలవాటే అనుకోండి, లేదా మర్యాద కోసం అనుకోండి కాని, దానివలన మంచి మంచి బట్టలు వేసుకోవాలనే అలవాటు మాత్రం ఉండేది. మరేదీ లేదు. ఇల్లు ఎలాగైనా నడుపుతాను.

**ప్రశ్నకర్త:** చిన్నప్పటి నుంచేనా?

**దాదాశ్రీ:** ఔను చిన్నప్పటి నుంచే.

**ప్రశ్నకర్త:** స్కూలుకి వెళ్ళేటప్పుడు కూడా మంచి బట్టలు కావాలా?

**దాదాశ్రీ:** స్కూలుకి వెళ్ళేటప్పుడైనా మరెక్కడికెళ్ళినా, ప్రతి చోటకి మంచి మంచి బట్టలు కావాలి.

అంటే, కేవలం బట్టల విషయంలోనే శక్తి ఖర్చయింది. బట్టలు కుట్టించుకునే సమయంలో దర్జీతో, 'చూడు అన్నా కాలర్ ఇలా ఉండాలి, ఇది ఇలా ఉండాలి, ఇది ఇలా ఉండాలి' అని చెప్పవలసివచ్చేది. మరే విషయంలోనూ శక్తి ఖర్చవలేదు. పెళ్ళిలో కూడా శక్తి ఖర్చుపెట్టలేదు.

## ఉత్తీర్ణుడనవలేదు కానీ, పథకం ప్రకారమే

మా నాన్నగారు, నా పెద్దన్నయ్య ఇద్దరూ కలిసి గుప్తాలోచన చేసారు, 'మన కుటుంబంలో ఒకరు సుబేదారు అయ్యారు కనుక, ఇతన్ని కూడా మెట్రిక్ అవగానే సుబేదార్‌ని చేద్దాం' అని. ఆ గుప్త ఆలోచనను నేను విన్నాను. వాళ్ళకి సుబేదార్ అవాలన్న ఆలోచన ఉండేది. ఆ ఆలోచన కాస్తా మట్టిలో కలిసిపోయింది. నేను మనసులో, వీళ్ళు నన్ను సుబేదార్ చేద్దామనుకుంటున్నారు, నా మీద సర్–సుబేదారు ఉంటాడు, అతను నన్ను కోప్పడుతుంటాడు అనుకున్నాను. అందువలన నేను సుబేదార్ అవగూడదు. ఎందుకంటే ఎంతో కష్టం మీద ఈ జన్మ లభించింది. ఇక్కడ కూడా నా మీద కోప్పడేవాడుంటే? ఇక ఎందుకు ఈ జన్మ? భోగ విలాసాల మీద నాకు కోరికేమీ లేదు. అతనొచ్చి నన్ను కోప్పడుతుంటే ఎలా భరించగలను? భోగవిలాసాలు కావలసినవాళ్ళని తిట్టుతిననీ. నాకు అలాంటివేమీ అవసరం లేదు. నేను నిర్ణయించుకున్నాను– పాన్ దుకాణం తెరుస్తాను కానీ అలాంటి తిట్లు నేను తినలేను అని. కాబట్టి నేను మెట్రిక్‌లో ఉత్తీర్ణుడను కాకూడదనే నిర్ణయించుకున్నాను. కనుక దాని మీద మనసు పెట్టలేదు.

**ప్రశ్నకర్త:** పథకం ప్రకారమా?

**దాదాశ్రీ:** ఔను. పథకం ప్రకారమే. అలా నేను ఫెయిల్ అయ్యాను, అది కూడా పథకం ప్రకారం. అంటే నాన్‌మెట్రిక్. నేను ఈ సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్, వర్ల్డ్ ఈజ్ ద పజిల్ ఇట్‌సెల్ఫ్, దేర్ ఆర్ టు వ్యూ పాయింట్స్..... ఇలా అన్నీ అంటుంటే అందరూ ప్రశ్నిస్తారు, 'దాదాజీ, మీరు ఎంతవరకు చదివారు?' అని. దాదాజీ గ్రాడ్యుయేషన్ కంటే కూడా ఇంకా ఎక్కువ చదివి వుంటారని వాళ్ళు అనుకునివుంటారు. 'బాబూ, ఈ విషయాన్ని గుప్తంగానే ఉంచండి, దీన్ని వెల్లడించటంలో మజా ఏమీ ఉండదు' అని నేను అంటాను. వాళ్ళు 'ఇక చెప్పొచ్చు కదా చదువు ఎంతవరకు చదివారు' అని కోరినట్లయితే, 'మెట్రిక్ ఫెయిల్' అని చెప్తాను.

మెట్రిక్ ఫెయిలయినప్పుడు నా అన్నయ్య, 'నీకేం రాదు' అన్నాడు. అందుకు నేను, 'బ్రెయిన్ (మెదడు) ఖాళీ అయిపోయింది' అని చెప్పాను. అందుకాయన, 'ఇంతకు ముందు బాగానే వచ్చేది కదా?' అంటే నేను, 'ఏమైనా కానీలే కానీ, ఇప్పుడైతే బ్రెయిన్ మాట వినటంలేదు' అన్నాను. అప్పుడు, 'వ్యాపారాన్ని నడిపిస్తావా?' అని అడిగితే, 'వ్యాపారంలో చేసేదేముంది? మీరేం చెప్తే నేను అదే చేస్తాను' అన్నాను. ఫలితంగా, ఒకటిన్నర సంవత్సరాలు వ్యాపారం చేసిన తర్వాత అన్నయ్య అనటం మొదలుపెట్టాడు, 'నువ్వు మళ్ళీ మంచి మార్కులు తెచ్చుకున్నావు' అని. వ్యాపారంలో అభిరుచి పెరిగింది. డబ్బులు సంపాదించగలిగాను.

ఇతను సుబేదార్ అవవలసినవాడు, వేరే మార్గంలో పోతున్నాడు. కనుక అన్నయ్య విసిగిపోయి, ఇతన్ని వ్యాపారంలో పెట్టండి అన్నాడు. దానితో నేను, నా గ్రహ దశ మారింది అని అనుకున్నాను. శని దశ పోయింది. వ్యాపారంలో అంతా అర్థమవటం జరిగింది. అన్నీ వెంటవెంటనే వచ్చేసాయి. హోటల్‌కి వెళ్ళేవాడిని, టీ తాగిస్తుండేవాడిని. అన్నీ నడిచేవి. వ్యాపారమేమో కాంట్రాక్ట్ పని, నగ్నమైన వ్యాపారం.

## పెళ్ళి సమయంలో కూడా మూర్ఛపోలేదు

పెళ్ళి సమయంలో కొత్త తలపాగా చుట్టారు. దాని మీద కట్టిన సెహరా బరువుకి తలపాగ కిందికి జారుతూ జారుతూ కంటి మీదకు వచ్చింది. తిరిగి చూస్తే హీరా బా (ధర్మపత్ని) నాకు కనిపించలేదు. పెళ్ళి చేసుకోవటానికి వచ్చినపుడు పెళ్ళి కూతురు వైపు చూడటం సహజమే కదా? అతను కట్నం సామాన్లను చూడడు. ఎందుకంటే ఆ సమయంలో పెళ్ళికూతురుని చూపించే ఆనవాయితీ లేదు. అందువలన ఆమె లగ్న మండపంలోకి వచ్చినపుడు మాత్రమే చూడగలిగేవాళ్ళం. అప్పుడు నా ముఖం మీదకు పెద్ద సెహరా వచ్చింది, దానితో కనిపించటం మానేసింది. అప్పుడు వెంటనే నాకు వచ్చిన ఆలోచన– 'పెళ్ళయితే అవుతోంది కానీ, ఇద్దరిలో ఎవరో ఒకరికి వియోగం వచ్చితీరుతుంది కదా (అంటే, ఎవరికైనా మరణం సంభవించినపుడు ఇద్దరూ విడిపోతారు కదా), ఇద్దరికీ రాదు వియోగం' అని. ఆ సమయంలో అక్కడ నాకు అలాంటి ఆలోచన వచ్చింది. అలా వచ్చి తాకి వెళ్ళిపోయింది. ఎందుకంటే ఆమె ముఖం కనిపించలేదు కదా! అందుకే ఆ ఆలోచన వచ్చింది.

## ఓ..హెూ...హెూ...అతన్ని నేను 'గెస్ట్' గా భావించాను

నేను పంథొమ్మిది సంవత్సరాల వయసులో ఉన్నపుడు నాకు కుమారుడు కలిగాడు. నా మిత్రులందరికీ మిఠాయి తినిపించాను. అలాగే, అబ్బాయి చనిపోయినప్పుడు కూడా మిఠాయి తినిపించాను. అప్పుడు అంతా, 'ఏమిటి రెండవ సంతానం కలిగిందా?' అని అడిగారు. 'ముందు మిఠాయి తినండి అప్పుడు చెప్తాను' అన్నాను నేను. ఔను. లేకపోతే విచారంతో మిఠాయి తినలేరు. అందుకే ముందు వెల్లడించకుండా మిఠాయి పెట్టాను. అంతా తిన్న తర్వాత అప్పుడు చెప్పాను, 'అప్పుడు వచ్చాడు కదా అతిథి, అతను వెళ్ళిపోయాడు' అని. వాళ్ళు అప్పుడు, 'ఇలా ఎవరైనా చేస్తారా? మీరు మిఠాయి పంచారు మాకు' అన్నారు. 'మేము ఇప్పుడు వాంతి చేసుకుని శుద్ధిచేసుకోవాలి. అలాంటి పరిస్థితి అయింది' అన్నారు. అందుకు, 'అలాంటిదేమీ అవసరం లేదు. అతను అతిథే, గెస్టే. గెస్ట్ వచ్చినపుడు రండి, లోపలికి రండి అని అంటాము. వెళ్ళేటప్పుడు కూడా రండి లోపలికి రండి అంటే గెస్ట్‌కి సమస్యని కలిగించినట్లే కదా' అన్నాను. అప్పుడంతా, 'అతన్ని గెస్ట్ అంటారా? అతను మీ కొడుకు' అన్నారు. నేను అందుకు, 'నాకైతే గెస్టే' అని చెప్పాను. తర్వాత అమ్మాయి పుట్టినప్పుడు కూడా అలాగే జరిగింది. అంతా ఆ విషయం మర్చిపోయి పెట్టిన మిఠాయి తిన్నారు. అమ్మాయి చనిపోయినప్పుడు కూడా మిఠాయి తిన్నారు. మనవాళ్ళకి అంత జ్ఞాపకం ఎక్కడ పెట్టుకుంటారు? వీళ్ళకి మర్చిపోవటానికి సమయం ఏమీ పట్టదు. సమయం పడుతుందా ఏమిటి? మూర్ఛావస్థలో ఉన్నారు! మూర్ఛావస్థ అంటే ఏమిటి? మర్చిపోవటానికి సమయమే పట్టదని.

## అయినా మిత్రులు 'సూపర్ హ్యూమన్' గా చూసారు

**ప్రశ్నకర్త:** మీరు ఈ సత్సంగం మొదలుపెట్టారు కదా, అది ఏ వయసులో ఉన్నప్పుడు జరిగింది? మీరు అందరికీ మిఠాయిలు పంచారు కదా, దాన్ని సత్సంగం అనవచ్చా?

**దాదాశ్రీ:** లేదు. దాన్ని సత్సంగం అనరు. అది నా దర్శనం. ఒక విధంగా నాకు కలిగిన అవగాహన. సత్సంగం సుమారు 1942 లో మొదలైంది. నలభై రెండు అంటే ఈ రోజుకి నలభై ఒక్క సంవత్సరాలైంది (1983 లో). మౌలికంగా

సత్సంగమనేది నలభై రెండు నుంచి మొదలైంది. ఎనిమిది లో నా జన్మ. అంటే నా ముప్పై రెండవ సంవత్సరం నుంచే సత్సంగం మొదలైంది. అంటే, మొదట్లో ఇతరులకు కొన్ని కొన్ని వాక్యాలే అందేవి.

ఇరవై రెండు సంవత్సరాల వయసులోనే నేను నా మిత్రులతో, మీరు నా ఏ పనినీ ఎప్పుడూ చేయకండి అని చెప్పాను. అహంకారం శిఖరం మీద ఉంది కనుక, 'బాగా రాత్రయిన తర్వాతయినా సరే మీరు నాతో పనిచేయించుకోవచ్చు' అని అన్నాను. అందుకు అభ్యంతరం చెప్పిన మిత్రులు, 'అలా ఎందుకు అంటున్నారు? మాదీ మీదీ అనే అవసరం ఏముంది?' అన్నారు.

ఒకసారి ఏమైందంటే నేను ఒక వ్యక్తి ఇంటికి రాత్రి పన్నెండు గంటలకు పోయాను. అప్పుడు అతని మనసులో, ఇంత రాత్రి పన్నెండు గంటలకు ఎప్పుడూ రాలేదు ఈ రోజు వచ్చాడు అంటే డబ్బులుగిబ్బులేమైనా అవసరం పడిందేమో అనుకున్నాడు. అంటే అతను వేరే విధంగా అర్థం చేసుకున్నాడు. మీకు అర్థమౌతోంది కదా? నాకేమో ఏ అవసరమూ లేదు. అతని దృష్టిలో వచ్చిన తేడాను నేను గ్రహించాను. ప్రతి రోజు చూసే దృష్టికీ ఇప్పటికీ మధ్య తేడా కనిపించింది. అలా నాకు అనిపించేటప్పటికి నేను ఇంటికి వెళ్ళి విశ్లేషణ చేసాను. నాకు అనిపించింది ఏమిటంటే, ప్రపంచంలో మనుషుల దృష్టికోణం మారటంలో సమయమేమీ పట్టదని. అందువలన నాతో పాటు ఉండేవారిలో నేను నిర్భయత్వాన్ని కలిగించాలి, దానివలన వారి దృష్టిలో తేడా రాకుండావుండాలి. అందువలన నేను, 'మీలో ఎవరూ నా కోసం ఏ పనీ చెయ్యకండి. ఎందుకంటే నా గురించి మీ మనసులో ఎటువంటి భయాందోళనలూ కలుగకూడదు, ఇతనేమైనా అడగటానికి వచ్చేడేమో అని' అని వాళ్ళకి చెప్పాను. 'ఎందుకలా?' అంటే నేను జవాబు చెప్పాను, 'రెండు చేతులు ఉన్నవారి దగ్గరి నుంచి నేను ఏదీ అడగను. ఎందుకంటే, రెండు చేతులున్నవాళ్ళు ముందు నుంచే బాధితులు. వాళ్ళు సుఖాన్ని వెతుక్కుంటూవుంటారు. నేను వాళ్ళ దగ్గరి నుంచి ఏమీ ఆశించను. కానీ మీరు నా దగ్గరి నుంచి ఆశించవచ్చు. ఎందుకంటే మీరు వెతుకుతూవున్నారు కనుక, మీకు కావలసిన పనిని నాతో చేయించుకోవటానికి సందేహించకండి. కానీ నా పని ఏమీ మీరు చెయ్యకండి' అని. అలా వాళ్ళని నిర్భయులను చేసాను. అప్పుడు

వాళ్ళు నాతో, 'సూపర్ హ్యూమన్ తప్ప మరెవరూ అలా మాట్లాడలేరు' అన్నారు. వాళ్ళ ఉద్దేశ్యంలో అది సూపర్ హ్యూమన్ స్వభావమని, అది హ్యూమన్ నేచర్ కాదని అర్థం.

## నిరంతరం ఆలోచనా దశలోనే

1928లో సినిమా చూడటానికి వెళ్ళాను. అక్కడ నా మనసులో ఒక ప్రశ్న ఉదయించింది– 'అరె, ఇలాంటి సినిమాల వలన మన సంస్కారాల దశ ఎలా తయారౌతుంది, ఈ మనుషుల గతి ఏమౌతుంది?' అని. వెంటనే రెండవ ఆలోచన, 'ఈ ఆలోచనకు నా దగ్గరేమైనా పరిష్కారం ఉందా? నా దగ్గర అటువంటి అధికారం ఏమీ లేదు. నా దగ్గర అందుకు అవసరమైన శక్తి లేదు కనుక ఈ ఆలోచన ఎందుకూ పనికిరానిది. అటువంటి శక్తి ఏమైనా ఉంటే ఈ ఆలోచన వలన లాభముంటుంది. నా శక్తికి మించిన ఆలోచన ఏదైతే ఉందో, దాని వెనుక పరిగెత్తటం అహంకారమే ఔతుంది. ఆ తర్వాత మరో ఆలోచన కూడా వచ్చింది, 'భారతదేశంలో ఇదే జరగాల్సి వుందా?' అని. ఆ రోజుల్లో నాకు జ్ఞానమింకా కలుగలేదు. 1958లో జ్ఞానం కలిగింది. అంతకు ముందు అజ్ఞానినే కదా. అజ్ఞానాన్ని ఎవరూ తీసుకునిపోలేదు. జ్ఞానం లేదు కాని, అజ్ఞానమైతే ఉంది కదా! అయినా ఆ రోజు అజ్ఞానంలోనే ఇది కనిపించింది. 'ఇంత త్వరగా చెడు విషయాలను ప్రచారం చేయగలిగేవారు, మంచి విషయాలను కూడా అంతే త్వరగా ప్రచారం చేయగలుగుతారు.' అందువలన మంచి మాటలను చెప్పటానికి ఈ సాధనం సర్వోత్తమం. ఇదంతా అప్పుడు ఆలోచించాను కానీ 1958లో జ్ఞానం కలిగిన తర్వాత దాని గురించిన ఆలోచన ఎంతమాత్రం రాలేదు.

## జీవితంలోని నియమమే ఇది

చిన్నప్పుడు నేను నేర్చుకున్నది ఏమిటంటే, 'సోదరా నువ్వు నన్ను కలిసావు కదా, దానివలన నీకు ఎటువంటి సుఖమూ కలుగకపోయినట్లయితే నేను నిన్ను కలవటం వృథాయే!' నన్ను కలిసేవాళ్ళతో నేను ఇదే అనేవాడిని. అతనెంత పనికిరాని వాడైనా సరే, అది నేను చూడవలసిన అవసరం లేదు కానీ, నేను నిన్ను కలిసాను, నా దగ్గరి నుండి నీకు సుగంధం రానట్లయితే దాన్ని ఎలా ముందుకు సాగించాలి? ఈ అగర్‌బత్తి ఉంది కదా అది పనికిరానివాళ్ళకి సువాసననివ్వదా?

**ప్రశ్నకర్త:** అందరికీ ఇస్తుంది.

**దాదాశ్రీ:** అదే విధంగా నా నుంచి సుగంధం నీ వరకు చేరకపోతే, అది నా సుగంధమనే అనిపించుకోదు. అంటే, ఏదైనా లాభం కలగాలి. ఇలాంటి నియమం నాకు మొదటి నుంచీ ఉండేది.

నేను రాత్రిపూట ఆలస్యంగా వస్తే నా చెప్పుల శబ్దం వలన కుక్క లేవగూడదు. కనుక నేను పాదాన్ని నొక్కిపెట్టి నడిచేవాడిని. కుక్కలకైనా నిద్ర వస్తుంది కదా? పాపం వాటికి మాత్రం ఎక్కడ పక్క దొరికే అదృష్టం ఉంది? అలాంటప్పుడు కనీసం ప్రశాంతంగా నిద్ర కూడా పోనివ్వద్దా?

**ప్రశ్నకర్త:** దాదాజీ, మీ పాదాలలో ఈ ముళ్ళ గాయాలేమిటి?

**దాదాశ్రీ:** నేను ఆత్మ ప్రాప్తి కోసం చేసిన తపస్సు ఫలితమిది. ఆ తపం ఎలాంటిదంటే, చెప్పులలో నుంచి మేకులు పైకి ఉబికివస్తే దాన్ని అణగకొట్ట కూడదు. అలాగే నడుస్తూవుండాలి. కానీ నాకు ఆ తర్వాత, నేను సరైన మార్గంలో నడవటం లేదని అర్థమైంది. అలాంటి తపం చేసాను నేను. చెప్పుల నుంచి మేకులు పైకి వచ్చి పాదాలలో గుచ్చుకుంటూవుంటే, ఆ సమయంలో ఆత్మ క్షోభిస్తే నాకు ఆత్మ ప్రాప్తి కలుగనట్లే అని అప్పుడు నమ్మేవాడిని. అందువలన అక్కడ తపించనిచ్చేవాడిని. కానీ ఆ తపస్సు బాపతు మచ్చలు ఇప్పటివరకూ ఉన్నాయి. పోలేదు. తపానికి చెందిన మచ్చలు జీవితాంతం పోవు. అది తప్పు మార్గం అన్న విషయం నాకు అర్థమైంది. తపస్సనేది జరగవలసింది లోపల.

## ప్రాప్తించిన తపం అనుభవించాను, అదీర రూపంలో

ముంబై నుంచి బడౌదా కారులో రావలసివచ్చినపుడు ముందే చెప్పాను, 'ఏడు గంటలసేపు ఒకే చోట కూర్చోవలసివుంటుంది, ఆ తపం వచ్చింది' అని. నేను మీతో మాట్లాడుతూవుంటాను కాని, లోలోపల నేను నాతో ఇలా మాట్లాడుకుంటూ వుంటాను, 'ఈ రోజు నీకు తపం ఒకటి వచ్చింది– నోట్లోంచి ఒక్క ముక్క కూడా పలకవద్దు.' మనుషులకు నాకు భరోసా ఇచ్చేందుకు అంటూవుంటారు, 'దాదాజీ మీకు అనుకూలంగా ఉందా అని. అప్పుడు నేను, 'చాల అనుకూలంగా ఉంది' అని

చెప్తాను. ఎందుకంటే నేను ఎవరికీ కమిషన్ ఇవ్వను, అంతా నేనే అనుభవిస్తాను. నోటి నుంచి ఒక్క ముక్కయినా మాట్లాడితే, అతను దాదాజీ కాదు. దీన్నే అంటారు, ప్రాప్తించిన తపాన్ని అనుభవించటం అని.

## వేచిచూడటానికి బదులు ప్రయోజనాన్ని పొందాను

నేను ఇరవై రెండు సంవత్సరాల వయసులో ఉన్నపుడు, ఒక చోట కేవలం ఒకే ఒక్క నిమిషంలో బస్సు తప్పిపోయింది. హాలోల్ రోడ్డులో ఒక గ్రామం పడుతుంది. అక్కడున్నప్పుడు బస్సు వచ్చి వెళ్ళిపోయింది. నిజానికి నేను ఒక గంట ముందే అక్కడికి వచ్చివున్నాను. కానీ, హోటల్ నుంచి బయటకు రావటంలో ఒక నిమిషం ఆలస్యమైంది, బస్సు తప్పిపోయింది. అంటే అది ఒక విషాదమైన ఘడియ అనుకోవాలి. సమయానికి వచ్చివుండక బస్సు తప్పిపోతే అది 'పోనీలే లేటయింది' అనుకోవచ్చు. అలా జరిగితే అంత బాధ ఉండదు. అక్కడేమో సమయానికి ముందే వచ్చి కూడా బస్సు అందుకోలేకపోయాను. ఆ తర్వాత బస్సు గంటన్నర తర్వాతనే వస్తుంది.

అక్కడ నేను గంటన్నర సేపు వేచివుండాల్సివచ్చింది కదా, అప్పుడు నా స్థితి ఎలా ఉంటుంది? లోపల మెషీన్ నడవటం ప్రారంభించింది. అటువంటి సమయంలో ఎంత చికాకు పెడుతుంది? శారీరక కష్టం చేసేవారికి యాభై చికాకులుంటాయి, నాకేమో లక్ష ఉన్నాయి. ఏమాత్రం మనశ్శాంతి లేదు. నిలబడాల్సివచ్చింది. అక్కడ ఎవరూ రండి కూర్చోండి అని కూర్చోవటానికి పరుపు వేయలేదు. ఇక గంటన్నర సేపు ఇరవై గంటల కాలంగా అనిపించింది. దానితో నేను నా మనసులో, అన్నిటికన్నా ఎక్కువ మూర్ఖత్వం వేచిచూడటం అని అనుకున్నాను. ఏ మనిషి కోసమైనా లేక ఏ వస్తువు కోసమైనా వేచిచూస్తుండటంతో సమానమైన ఫూలిష్‌నెస్ (మూర్ఖత్వం) మరేదీ ఉండదు ఈ ప్రపంచంలో! అందువలన ఇరవై రెండు సంవత్సరాల వయసు వచ్చిన తర్వాత ఇక వేచిచూసే పని పెట్టుకోలేదు. ఎప్పుడైనా వేచిచూడవలసిన సందర్భం ఎదురౌతే, మరో పనేదైనా పెట్టుకుంటాను. వేరే మరే మార్గమూ లేదు! కానీ దాని బదులు నేను, వేచి చూసే సమయం చాల అందంగా ఉంటుంది అనుకున్నాను. లేకపోతే ఒట్టిగా అటూఇటూ తొంగిచూసుకుంటూ తిరగటం జరుగుతుంది బస్సుకాని వస్తుందేమోనని. అందువలన అటువంటి

సమయంలో, లోపల ప్రశాంతంగా ఉండేందుకు నేను వేరే రకమైన సెటింగ్ చేసుకున్నాను. అలాంటి సెటింగ్ ఏమైనా చేసుకోవచ్చా లేదా?

**ప్రశ్నకర్త:** అలా చేసుకోవచ్చు.

**దాదాశ్రీ:** పనులు చాల రకాలుగా ఉంటాయి కదా?

**ప్రశ్నకర్త:** అంటే, మనసుని పనిలో పెట్టుకోవాలా?

**దాదాశ్రీ:** ఔను. మనసుని పనిలో పెట్టుకోవాలి.

**ప్రశ్నకర్త:** ఏ పనిలో పెట్టుకోవాలి?

**దాదాశ్రీ:** ఎలాంటి సెటింగైనా చేసుకోవచ్చు. ఆ రోజుల్లో నేను ఏం చేస్తుండేవాడిని? ఎవరైనా సాధుసంతులు లేదా కృపాలదేవ్ (శ్రీమద్ రాజచంద్ర) గారు రాసిన సాహిత్యాన్ని, నేను ఎవరికీ చెప్పేవాడిని కాను కాని, చదివేవాడిని. చెప్పటం మొదలుపెడితే అది ముక్కునపెట్టుకుని వదిలినట్లవుతుంది. అది నేను చదువుతుండేవాడిని. అర్థమైందా మీకు?

**ప్రశ్నకర్త:** దాన్ని ఎలా చదువుతాం దాదాజీ? పుస్తకం లేకుండా ఎలా చదువుతాం?

**దాదాశ్రీ:** పుస్తకం లేకుండానే చదువుతుండేవాడిని. నాకైతే, 'హే ప్రభూ' అని రాసివున్న అక్షరాలు కనపడతాయి, నేను వాటిని చదువుతాను. లేకపోతే మనసులో లేనిపోనివన్నీ వస్తాయి, సంకల్పవికల్పాలు కలుగుతుంటాయి. కేవలం వ్యర్థమైనవే పెట్టుకుంటూవుంటే మనసు పాడైపోతుంది. 'హే ప్రభూ, హే ప్రభూ' అంటూవుంటే, ఖాళీగా ఉన్న మనసు బయటకు పోతుంది. అందువలన నేను చేసుకున్న అడ్జస్ట్‌మెంటు ఏమిటంటే, ఎలా రాసివుంటుందో అలా కనిపిస్తూవుండటం. ఎలా అంటే,

*'హే ప్రభూ, హే ప్రభూ, షూం కరూం, దీనానాథ దయాళ్*
*హుం తో దోష్ అనంతనుం, భాజన్ ఛూం కరుణాళ్!'*
(హే ప్రభూ, హే ప్రభూ, నేనేం చెయ్యను, దీనానాథ దయాళూ
నేను అనంత దోషాలకు పాల్పడ్డవాడిని కరుణాలవాలా!)

ఇందులోని ప్రతి పదం, ప్రతి అక్షరం, ఒత్తులు పొల్లులతో సహా అంతా కనిపిస్తుండేది. కృపాల్‌దేవ్ మరో మార్గాన్ని కూడా సూచించారు. అదేమిటంటే వెనకి నుంచి ముందుకు చదవటం. చివరి నుంచి మొదటి వరకు చదవటం. అలా మనుషులకు అది ప్రాక్టీస్ అయింది, అలవాటు కడూవ అయిపోయింది. మనసు స్వభావం ఎలాంటిదంటే, దాన్ని ఎందులో పెడితే అందులో ఉండటం అలవాటౌతుంది. అప్పుడు యాంత్రికంగానే చేసేస్తుంది. అయితే ఇలా చదవటం వలన యాంత్రికంగా చెయ్యకుండా ఉంటాము. కనిపించాలి అంతే. అందువలన, చదవటంలో ఇది నేను చేసిన ఒక గొప్ప ఆవిష్కరణ.  ఇంకా నేను ఇతరులకు కూడా నేర్పుతుంటాను. వీళ్ళందరికీ చదివి చెప్పటం నేర్పించారు.

**ప్రశ్నకర్త:** దాదాజీ, ఇరవై రెండవ సంవత్సరంలోనే అలాంటి శక్తి వచ్చిందా?

**దాదాశ్రీ:** ఔను. ఇరవై రెండు సంవత్సరాల వయసులోనే ఆ శక్తి ఉండేది.

## అయోమయంలో వికసించింది, అంతర్‌దృష్టి

అంటే, నాకు అయోమయంలో ఈ జ్ఞానం ఉత్పన్నమైంది. గంటన్నర సేపు సంక్లిష్టతలో లేకపోతే, అలాగే వేదనను అనుభవించేవాడినే.....

**ప్రశ్నకర్త:** ఒక్క నిమిషం మిస్ చేయకపోతే...

**దాదాశ్రీ:** అక్కడ ఒక్క నిమిషం తప్పిపోయింది, దాని ఫలితంగా జ్ఞానం వచ్చింది. అంటే, దెబ్బలు తిని తిని, ఈ జ్ఞానం ఉత్పన్నమైంది, అవగాహన ఏర్పడింది. దెబ్బతింటే అవగాహన లోపలి నుంచి కలుగుతుంది, ఆ అవగాహన నన్ను ఎల్లవేళలా హెల్పింగ్ (సహాయకం) గా ఉంటుంది. అలా ఆ తర్వాత మళ్ళీ దేని కోసమూ వేచిచూడటం జరగలేదు. ఇరవై రెండు సంవత్సరాల వయసు తర్వాత నేను మళ్ళీ ఎప్పుడూ దేనికోసమూ ఎదురుచూడలేదు. ఈ రోజు బండి మూడున్నర గంటలు లేటు అయినట్లయితే నేను అనవసరంగా టైముని (సమయాన్ని) వెచ్చించను. నేను ఉపయోగించుకుంటాను.

## అలాంటి కౌంటర్ పుల్లింగ్ సెటింగ్ చేసుకున్నాను

అలా ఎదురుచూడటంతో 'రివొల్యూషన్' గొప్పగా పెరిగింది.

ఈ శ్రామికులకు నిమిషానికి యాభై రివొల్యూషన్స్ (మనసు ఆలోచించే శక్తి వేగం) ఉంటుంది, నాకు నిమిషానికి ఒక లక్ష రివొల్యూషన్స్ ఉంటాయి. అంటే, నాకు, శ్రామికులకు మధ్య ఎంత తేడా ఉంది? వాళ్ళవి యాభై రివొల్యూషన్స్ అవటం వలన, వాళ్ళతో మీరేమైనా మాట్లాడితే వాళ్ళకి చాల ఆలస్యంగా అర్థమౌతుంది. మీరు మామూలు సాధారణమైన విషయం ఏమైనా చెప్పినా సరే వాళ్ళకి అర్థం కాదు. అందువలన వాళ్ళకి వేరే విధంగా చెప్తేనే వాళ్ళకి అర్థమౌతుంది. ఇక నా రివొల్యూషన్ చాల ఎక్కువగా ఉన్న కారణంగా, ఈ ఎక్కువ తెలివి ఉన్నవాళ్ళకి కూడా అర్థమవటానికి సమయం పడుతుంది. నేను విడమరచి చెప్పినా వాళ్ళకి అర్థం కాదు. అందువలన నేను, 'ఇతను పనికిరానివాడు, తెలివితక్కువవాడు' అనేవాడిని. దానితో లోపల పవర్ ఎక్కువగా పెరిగేది. 'ఇంత చెప్పినా నీకు అర్థం కాదా! ఎంత మూర్ఖుడివి!' అంటూ అతని మీద కోపం చూపిస్తుండేవాడిని. తర్వాత నాకు అర్థమైంది ఈ రివొల్యూషన్ కారణంగా అలా జరుగుతుందని, ఆ కారణంగా అతని మెదడులోకి పోవటం లేదని. ఇక నేను ఎదుటివాడిలో తప్పు చూస్తే అది నా పొరపాటే అవుతుంది. అందువలన నేను పుల్లీలను పెట్టటం మొదలుపెట్టాను.

ఎందుకంటే, పదిహేను వందల రివొల్యూషన్ కలిగిన పంపుని, మూడువేలు కలిగిన ఇంజిన్ మీద నడిపితే ఆ పంపు పేలిపోతుంది. దానికోసం పుల్లీ పెట్టవలసి వచ్చేది. కౌంటర్ పుల్లీ. ఇంజిన్ మూడువేలదైనా, పంపు పదిహేను వేలదైనా మధ్యలో పుల్లీలను పెట్టాలి. అప్పుడు పంపు వరకు పదిహేనువేలు మాత్రమే చేరుతుంది. కౌంటర్ పుల్లీ అంటే ఏమిటో మీకు అర్థమైందా? అలాగే నేను ఇతరులతో మాట్లాడేటప్పుడు, కౌంటర్ పుల్లీలను వేయటం మొదలుపెట్టాను. దానితో నాకు కోపం రావటం ఆగిపోయింది. ఎదుటివారికి అర్థమయే విధంగా కౌంటర్ పుల్లీని వేయాలి.

## 3. అహంకారం- మానానికి విరుద్ధమైన జాగృతి

## నివాస స్థానాన్ని ఎంచుకోవటం కూడా ఆలోచనతోనే

వాణిజ్య ప్రకృతిలోంచి కొంత తీసి క్షత్రియ ప్రకృతిలో కలిపి, క్షత్రియ ప్రకృతిలోంచి కొంత తీసి వాణిజ్య ప్రకృతిలో కలిపితే తయారైన ఆ మిక్చర్ చాల

గొప్పగా ఉంటుంది. పెరుగు పులుపు తీపి కలిసివుంటే, శ్రీఖండ్ చాల బాగా తయారౌతుంది. అందువలన నేను మొదటి నుంచి ఏం చేసాను? మొదట్లో పటేల్ సమాజం నివసించే ప్రదేశంలో ఉండేవాళ్ళం కదా! నా అన్నయ్య చేసే వ్యవహారమంతా పటేల్ మనుషులతో సంబంధమున్నది. కానీ, నాకు ఆ వ్యవహారం నచ్చటం లేదు. నేను చిన్నవాడిని అయినప్పటికీ నాకు పటేల్ మనుషులతో కలవటం ఇష్టం ఉండేది కాదు. ఎందుకు ఇష్టం ఉండదు? ఎందుకంటే, నా వయస్సు కేవలం ఇరవై రెండు సంవత్సరాలే కానీ, కేవలం తిరగటం కోసమే ముంబై వెళ్తుండేవాడిని. తిరిగివచ్చేటప్పుడు తక్కువ ధరలో దొరికే ముంబై హల్వా తీసుకునివచ్చి, నా వదిన, ఇంకా చుట్టుపక్కలవాళ్ళకి పంచిపెట్టేవాడిని. అలా ఒకటి రెండు సార్లు తీసుకెళ్ళాను కాని, ఒకసారి తీసుకెళ్ళటం మర్చిపోయాను. అప్పుడు వదిన కలిసే చుట్టుపక్కలవాళ్ళు, 'ఈసారి హల్వా తీసుకునిరాలేదా?' అని అడిగారు. 'ఈ పీడ నేనెందుకు తలకెత్తుకున్నాను' అనిపించింది నాకు. అంతకు ముందెప్పుడూ ఈ పీడ లేదు నాకు. 'తీసుకుని రాలేదు' అని నన్ను అవమానించేవారు కాదు ఎవరూ. తీసుకునిరావటమే నేను చేసిన తప్పు. ఒకసారి తెచ్చాను, రెండవసారి తెచ్చాను, మూడవసారి తీసుకునిరాలేదంటే తమాషా అయిపోయింది. 'చూడు, ఈ సారి తేలేదా?' ఈసారి బాగా ఇరుక్కుపోయాను. అంటే ఇలాంటి మనుషులతో వ్యవహారం చేయటం సరి కాదన్నమాట.

ఇక ఆ క్షత్రియుల వ్యవహారం ఎలా ఉండేది? అవసరమైతే నా తలని నరికిస్తాము, కాని మీరు మీ తల ఇవ్వాల్సివుంటుంది అనేవారు. తలలు నరుక్కుని ఇచ్చిపుచ్చుకోవటానికి కూడా సిద్ధమే. ఈ బేరం ఏమిటి? పెద్ద పెద్ద? పెద్ద స్థాయిలో పందేలు కాసుకునే బిజినెస్– తల తీసివ్వటం, తీసుకోవటం. అందువలన ఈ తలలు తీసి మార్చుకోవటమనేది నచ్చలేదు. నాకు మరొకరి తల వద్దు. వాళ్ళేమో నా తలని అడుగుతున్నారు. అలాంటి బేరాలు నాకు వద్దు. అందువలన, వ్యాపారులతో కలిసివుందామని అనుకున్నాను.

ఒక మనిషి నన్ను, 'రావణ రాజ్యం ఎందుకు పడిపోయింది?' అని అడిగాడు. 'ఎందుకు పడిపోయింది? నాకు కాస్త అర్థమయ్యేటట్లుగా చెప్పండి!' అన్నాను. 'రావణుడు

ఒక వైశ్యుని సెక్రటరీగా పెట్టుకునివుంటే, అతనికి రాజ్యాన్ని పోగొట్టుకోవలసిన అవసరం పడేది కాదు.' అన్నాడతను. 'అలా ఎందుకు? అని నేను అడిగితే అతను, 'నారదుడు సీత గురించి చెప్పినపుడు, సీత ఎంతో రూపవతి, ఇలా ఉంటుంది, అలా ఉంటుంది అని చెప్తే, రావణుడు ప్రలోభంలో పడి, ఎలాగైనా ఆమెని దక్కించుకోవాలని అనుకున్నాడు. అలాంటి సమయంలో ఒక వ్యాపారి అతని దగ్గర ఉన్నట్లయితే, అయ్యా, కాస్త సంభాళించుకోండి. నేను సీత కంటే కూడా గొప్ప స్త్రీని చూసానని చెప్పి వుండేవాడు. అలా రావణుడికి ఉన్న ఆ అవకాశాన్ని ఆ సమయంలో పోగొట్టేవాడు. ఒకసారి అవకాశం చెయిజారిపోయిందంటే ఒక వంద సంవత్సరాలు దూరం పెరిగినట్లే అని అర్థం చేసుకోండి' అన్నాడు. అతను ఇలాంటి విషయాలు చెప్పేవాడు. ఈ మాట నాకు చాల అర్థవంతమైనది అనిపించింది. అవకాశాన్ని వినియోగించుకోవటానికి ఇలాంటివాళ్ళుండాలి! అందుకే నేను ఆ వైశ్యులతో కలిసివున్నాను. మాకు ఇరువైపుల పొరుగువారూ వైశ్యులే. వాళ్ళతో నలభై సంవత్సరాల నుంచి కలిసివుంటున్నాను.

మన ఇంటికి ఎవరైనా ఏదైనా అడగటానికి వస్తే తప్పక ఇవ్వండి, తిరిగిచ్చినపుడు తీసుకోండి కాని, ఎప్పుడూ అడగకండి అని నేను ఇంట్లో చెప్పాను. ఒకసారి ఇచ్చిన తర్వాత రెండవసారి ఇవ్వవలసివస్తే, మూడవసారి ఇవ్వవలసివస్తే, అలా వందసార్లు ఇచ్చినా సరే, తిరిగివ్వమని ఎప్పుడూ అడగవద్దు. తిరిగిస్తే మాత్రం తీసుకోండి. ఈ వ్యాపారస్తుల వ్యవహారం ఎంత బావుంటుందంటే, ఒకసారి వాళ్ళకి బర్ఫీ పంపించి, ఆ తర్వాత సగం ముక్క కాని లేక నాలుగోవంతు ముక్క కాని పంపించినా సరే ఏమీ అనుకోరు, నిందించటం ఉండదు. ఒకటి, రెండుసార్లు అసలే పంపించకపోయినా నిందించరు. వాళ్ళతో నాకు నచ్చుతుంది. నిందించేవాళ్ళతో నేను కలిసివుండలేను.

ఆ తర్వాత నేను ఒక వైశ్యునికి నా దగ్గర గుమస్తాగా పెట్టుకున్నాను. ఒకతను నా దగ్గరకు వచ్చి, 'మీకు వైశ్యుల మీద ఎక్కువ ప్రేమ ఉంది కదా, ఇతన్ని ఉద్యోగంలో పెట్టుకుంటారా?' అని అడిగాడు. నేనప్పుడు, 'రండి. కార్ఖానాలో చాలమంది పనిచేస్తున్నారు. మీరేమో వైశ్యులు మరి. కనుక బావుంటుంది' అన్నాను. అలా నా దగ్గర ఎప్పుడూ వైశ్యులే ఉండేవారు.

## అంతా గొప్పల కోసం

ప్రతి రోజు, నాలుగు నాలుగు కార్లు ఆగివుండేవి. 'మామా కీ పోల్' (సంపన్నుల పేట), సంస్కారవంతుల గూడెం. ముప్పై ఐదు సంవత్సరాల క్రితం బంగళాలలో తక్కువగానే నివసిస్తుండేవారు. బడోదాలో 'మామా కీ పోల్' ని అన్నిటికన్నా గొప్పగా భావించేవారు. ఆ రోజుల్లో మేము 'మామా కీ పోల్' లో నివసిస్తుండేవాళ్ళం. అద్దె నెలకి పన్నెండు రూపాయలు ఉండేది. ఆ రోజుల్లో చాలమంది నెలకి ఏడు రూపాయల అద్దె ఇళ్ళల్లో పడివుండేవారు. ఇప్పుడు అక్కడ 'మామా కీ పోల్' బంగళాలలో ఉండేవారు కార్లలో నా దగ్గరకు వస్తుండేవారు. ఎందుకంటే వాళ్ళు కష్టాలలో ఇరుక్కునివున్నారు కనుక నా దగ్గరకు వచ్చేవారు. ఏదో ఒక పిచ్చి పని చేసి వస్తారు. అప్పుడు వాళ్ళని 'వెనక గుమ్మం' నుంచి బయటకు పంపించేవాడిని (అంటే నేను కొన్ని ఉపాయాలు చెప్పి వాళ్ళని వాటి లోంచి బయటపడే మార్గాన్ని సూచించేవాడిని). వెనక గుమ్మాన్ని చూపించి, అందులోంచి బయటపడండి అని చెప్పేవాడిని. అలా తప్పు చేసింది వాళ్ళయితే వాళ్ళని నేను వెనక గుమ్మం నుంచి బయటకు పోయే మార్గాన్ని నేను ఇస్తాను. అంటే ఆ తప్పుని నా తల మీద వేసుకునేవాడిని. ఎందుకు? నా మానం కాపాడుకునేందుకు. వెనక గుమ్మం నుంచి పారిపోనివ్వటం తప్పు కాదా? అలా తెలివిగా ఆలోచించి దారి చూపించేవాడిని, దానితో వాళ్ళు తమను తాము కాపాడుకునేవారు. అందువలన వాళ్ళు నన్ను గౌరవించేవారు. కానీ తప్పు నా తల మీద పడేది. అయితే అర్థమైంది, అవగాహనా శూన్యం వలన, గౌరవాలను నిలుపుకునేందుకు అలాంటి తప్పులు జరుగుతుంటాయని. అలా గౌరవం నిలిచింది. గౌరవ మర్యాదల గురించి చాల ఎక్కువ చింత ఉండేది.

**ప్రశ్నకర్త:** మరి ఆ మానం అనేది మీ చేతుల్లోకి వచ్చిందా? దాన్ని ఎలా అంతం చేసారు?

**దాదాశ్రీ:** మానం చనిపోదు. మానానికి కేవలం ఉపశమనం కలిగించానంతే. లేదంటే మానం మరణించదు. ఎందుకంటే, మరణించేవాడే తనైనపుడు తనను తాను ఎలా అంతం చేసుకోగలడు? తనని తాను ఎలా చంపుకుంటాడు? అర్థమైందా మీకు? అందువలన ఉపశమనం కలిగించాను. తర్వాత ఎలాగో అలాగ రోజులు గడిపాను.

## ఆ అహంకారం రాత్రింబవళ్ళు తొలుస్తూవుంటుంది

నా బుద్ధి కాస్త ఎక్కువగా ఎగిరి గంతులు వేస్తుండేది, అహంకారం కూడా ఎగిరి గంతులు వేస్తుండేది. మా అన్నయ్య చాల పెద్ద అహంకారి. పర్సనాలిటీ బావుండేది. అతన్ని చూస్తూనే వందమంది అటు ఇటు పారిపోయేవారు. కేవలం ఆయన చూపుల పర్సనాలిటీయే అలా ఉండేది. కంటి చూపులు, ముఖం ప్రభావం అలా ఉండేది!! చూస్తూనే నాకు అనిపించేది, 'ఈయనని చూస్తే నాకు భయం వేస్తుంది' అని. అయినా ఆయన 'నీలాంటి అహంకారిని ఎవరూ చూడలేదు' అని నన్ను అనేవాడు. అరె, నేను ఆయనని చూసి ఎగిరిపడుతుంటాను. అయినా వంటరిగా ఉన్నప్పుడు, నేను నీలాంటి అహంకారిని ఎవరినీ చూడలేదు అనేవాడు. నిజానికి ఆ అహంకారం ఏమిటన్నది నా దృష్టికి వచ్చింది. ఆ అహంకారం నన్ను బాధించటం మొదలుపెట్టినపుడు నాకు తెలిసింది మా అన్నయ్య చెప్పిన అహంకారం అంతా అదేనని. 'నాకు ఇంకేమీ వద్దు!' అంటే లోభం నామమాత్రానికైనా లేని అహంకారం! వెంట్రుక మాత్రం లోభం కూడా లేదు. అంటే అది అభిమానం ఎలా ఔతుంది? ఒకవేళ అభిమానం, లోభం వేరుగా ఉన్నట్లయితే అభిమానం కాస్త తక్కువ పాళాలోనే ఉండివుంటుంది....

## మనసులోనే పెట్టుకున్న అభిమానం

మనసులో నాకున్న దురభిప్రాయం, ఈ ప్రపంచంలో ఉన్నది నేను మాత్రమే. వేరెవరూ లేరని. చూసారా నన్ను నేను ఎలా ఊహించుకున్నానో! జమీందారీలో ఏమీ లేదు. కేవలం పది భీగాల భూమి, ఒక ఇల్లు తప్ప మరేమీ లేదు. కానీ మనసులో గర్వం ఎలాంటిది? చరోత్తర్ గ్రామానికి రాజులా. ఎందుకంటే చుట్టుపక్కల ఉన్న ఆరు గ్రామాలవారు మమ్మల్ని అలా పైకెత్తారు. వరకట్నం మరిగిన వరుడు అడిగినంత కట్నం ఇస్తేనే పెళ్ళికి ఒప్పుకుంటాడు. అతని మెదడులో అలాంటి నిషా జమై ఉంటుంది. పూర్వ జన్మ నుంచి ఏదో సంపాదించి తెచ్చుకునివుంటాడు అందుకే అలాంటి నిషా వుండివుంటుంది.

కానీ మా అన్నగారు పూర్తిగా నిషాతలకెక్కివుండేవారు. నేను నా అన్నగారిని 'మానీ' (అభిమాని) అనేవాడిని. కానీ అప్పుడు నన్ను అభిమాని అనేవారు. ఒకసారి

నాతో, 'నీలాంటి అభిమానిని నేను చూడలేదు!' అన్నారు. నేను, 'మీకు నాలో అభిమానం ఎక్కడ కనిపించింది?' అని అడిగాను. అందుకాయన, 'ప్రతి విషయంలోను నీ అభిమానం ఉంటుంది' అన్నారు.

ఆ తర్వాత వెతికితే నాకు నాలోని అభిమానం కనిపించింది. అదే నన్ను బాధిస్తుండేది. ఈ అభిమానం ఎలా పుట్టింది? అందరూ నన్ను 'అంబాలాల్ భాయ్, అంబాలాల్ భాయ్' అనేవారు. అంబాలాల్ అని ఎవరూ అనేవారు కారు. ఆరు అక్షారలతో పిలిపించుకోవటం అలవాటయింది. దానికి హాబిట్యువేట్ అయిపోయాను. ఇక అభిమానం అంత భారమైపోయినపుడు దాన్ని రక్షించుకోవటం కూడా అవసరమే కదా! అందువలన ఎవరైనా పొరపాటున తొందరలో 'అంబాలాల్ భాయ్' అని అనలేక 'అంబాలాల్' అని పిలిస్తే వాళ్ళ తప్పేముంది అందులో? ఆరు అక్షరాలను ఎవరైనా ఒకేసారి ఎలా పలుకుతారు?

**ప్రశ్నకర్త:** ఏమిటి మీరు అలా ఆశించేవారా?

**దాదాశ్రీ:** అరె, నాలో ఇక తర్జనభర్జన మొదలౌతుంది, 'అరె, ఇతను నన్ను అంబాలాల్ అని పిలుస్తాడా? తనని తాను ఏమనుకుంటున్నాడు? ఏం అతను 'అంబాలాల్ భాయ్' అని పిలవలేడా? ఊళ్ళో పది పన్నెండు భీగా భూమి ఉంటే పెద్దగా గర్వం చూపించాల్సింది ఏమీ లేదు కానీ, మనసులో నన్ను నేను ఏమనుకుంటున్నాను? 'ఆరు గ్రామాల పటేలు, వరకట్నంవాడిని మరి!'

ఎదుటి మనిషి నన్ను 'అంబాలాల్ భాయ్' అనకపోతే రాత్రంతా నిద్రపట్టేది కాదు, వ్యాకులత ఉండిపోయేది. చూడండి!! దానివలన ఏం లాభం? అలా చేయటం వలన నోరు ఏమైనా తీపి అవుతుందా? మనిషి స్వార్థం ఏవిధంగా ఉంటుంది! ఎలాంటి స్వార్థమంటే దాని వలన ఏమీ పొందలేనిది! అయినా దాన్ని సొంతం చేసుకున్నాను. అదీ లోకుల నుంచి వచ్చే గౌరవం! లోకులే నన్ను పెద్దవాడిని చేసారు, ఆ మనుషులే నాకు పెద్ద అనే అభిమానాన్ని కూడా అందించారు. కానీ అలా లోకులు ఇచ్చే గౌరవాభిమానాలు ఎందుకు పనికివస్తాయి?

ఈ ఆవులు, గేదెలు నా వైపు చూస్తే, ఆవులన్నీ నావైపే చూస్తూవుండిపోతూ, చెవులు ఊపుతూ నిలబడితే ఏమిటి? అవి మనకి గౌరవం ఇచ్చినట్లా! ఇదంతా

కూడా దానితో సమానమే. మనం కేవలం మనసులో అనుకుంటూవుంటాం ఈ మనుషులంతా మనకి గౌరవమిస్తున్నారని. మనసులోని గౌరవం అది. వీళ్ళంతా పాపం వారివారి బాధలు, కష్టాల్లో మునిగివున్నారు, చింతాక్రాంతులైవున్నారు. వాళ్ళు ఏమైనా మీకోసం కాచుకుని ఉన్నారా పనేమీ లేకుండా? అందరూ వారివారి చింతలను ఎత్తుకుని తిరుగుతున్నారు!

## మనసుకి నచ్చిన అహంకారం దుఃఖదాయకమైంది

ఆ సమయంలో చుట్టుపక్కలవాళ్ళు ఏమనేవారో తెలుసా? సుఖంగా జీవిస్తున్నాడు! కాంట్రాక్ట్ పని. డబ్బులు ఆడుతుంటాయి. మనుషులంటే ఎంతో ప్రేమ! ఆ మనుషులు కూడా ఈయన ప్రేమ దృష్టిని స్వీకరిస్తారు, దేవుడిలాంటి మనిషి, ఎంతో సుఖ జీవనం సాగిస్తున్నాడు! మనుషులంతా నన్ను సుఖంగా ఉన్నాడని అనుకుంటున్నారు, నేనేమో చింతిస్తూవుండేవాడిని.

ఒక రోజు నాకు నిద్ర కూడా పట్టలేదు. బాధ పోవటం లేదు. ఇక లేచి కూర్చున్నాను. చింతలన్నిటినీ కలిపి ఒక పొట్లంలో బాగా చుట్టిచుట్టి కట్టాను. తర్వాత విధి చేసి, రెండు తలగడల మధ్య పెట్టి పడుకుంటే బాగా నిద్రపట్టింది. తెల్లవారి లేచి ఆ పొట్లాన్ని విశ్వామిత్రీ నదిలో కొట్టుకునిపోయేటట్లుగా చేసాను. ఇక చింత తగ్గిపోయింది. కానీ 'జ్ఞానం' కలిగినపుడు ప్రపంచాన్నంతా చూసి అర్థం చేసుకున్నాను.

**ప్రశ్నకర్త:** కానీ, జ్ఞానానికి ముందు కూడా జాగృతి ఉండేది కదా, ఇది అహంకారం అని?

**దాదాశ్రీ:** ఔను. ఈ జాగృతైతే ఉండేది. అహంకారం ఉందన్నది కూడా తెలుసు కానీ అది నాకు ఇష్టంగా ఉండేది. కానీ అది ఎప్పుడైతే చాల ఎక్కువగా బాధించటం మొదలుపెట్టిందో, అది నాకు మిత్రుడు కాదని, నాకు శత్రువని, అందులో ఎటువంటి సుఖమూ లేదని అర్థమైంది.

**ప్రశ్నకర్త:** ఎప్పటి నుంచి అహంకారం శత్రువని తెలిసింది?

**దాదాశ్రీ:** రాత్రిళ్ళు నిద్రపోనిచ్చేది కాదు. దానితో ఇదెలాంటి అహంకారమో అర్థమైంది. అందువలన ఒక రాత్రి దాన్ని పొట్లం కట్టి, పొద్దున్నే విశ్వామిత్రీలో కలిపేసివచ్చాను! మరేం చెయ్యను?

**ప్రశ్నకర్త:** అంటే ఆ పొట్లంలో ఏం పెట్టారు?

**దాదాశ్రీ:** ఇంత అహంకారమా! పోనీ దాన్ని! దేనికోసం ఇదంతా? అనవసరంగా ఏ లాభమూ లేకుండా! అందరూ చాల సుఖపడుతున్నానంటారు కానీ నాకైతే ఒక్క చుక్క సుఖం కూడా కనపడలేదు. లోపలేమో అహంకారానికి చెందిన అపారమైన చింత, వ్యథ ఉండేది.

## ఆ అహంకారం ఎప్పుడు వదిలింది?

**ప్రశ్నకర్త:** ఈ అహంకారాన్ని వదిలేయాలనే కోరిక ఎప్పుడు కలిగింది? ఆ పిచ్చి అహంకారాన్ని మీరు ఎప్పుడు వదిలేసారు?

**దాదాశ్రీ:** ఇది వదిలించుకుంటే వదిలేది కాదు. అహంకారం వదిలిపెట్టి పోతుందా ఎక్కడైనా? సూరత్ స్టేషన్‌లో జ్ఞానోదయం కలిగింది, దానితో దానంతటదే వదిలిపోయింది. పోతే, వదిలించుకుంటే వదిలేది కాదిది. వదిలేసేది ఎవరు? అహంకార రాజ్యంలో వదిలేస్తున్నవారు ఎవరు? రాజుకే అహంకారం ఉన్నచోట, దాన్ని వదిలేసేది ఎవరు?

## ఆ రోజు నుంచి 'నేను' వేరే స్వరూపంలో

**ప్రశ్నకర్త:** మీకు లభించిన జ్ఞానం గురించి కాస్త వర్ణించి చెప్పండి! ఆ సమయంలో మీ మనోభావాలు ఎలా ఉన్నాయి?

**దాదాశ్రీ:** నా మనోభావాలలో ఎలాంటి విశేష భావమూ లేదు. తప్తి రైల్వే లైను మీద సోన్‌గఢ్-వ్యారా అనే చోటుంది. అక్కడ నా బిజినెస్ నడుస్తోంది. అక్కడి నుంచి తిరిగి సూరత్ స్టేషన్‌కి వచ్చాను. అప్పుడు ఒక భాయ్ ఎప్పుడూ నాతో ఉండేవాడు. ఆ రోజుల్లో సూర్యనారాయణుని అస్తమయానికి ముందు భోజనం చేసేవాడిని. అందువలన ట్రైన్ లోనే భోజనం చేసేసాను. సూరత్ స్టేషన్‌లో ఆరు

గంటలకు ట్రైన్ దిగాను. ఆ సమయంలో నాతోపాటు ఉన్న భాయ్, భోజనం చేసిన గిన్నెలను కడగటానికి వెళ్ళాడు. నేను రైల్వే బెంచ్ మీద ఒంటరిగా కూర్చుని ఉన్నాను. ఆ సమయంలో నాలో ఈ 'జ్ఞానం' ఉత్పన్నమై, ఈ జగత్తు ఏమిటి, ఇది ఎలా నడుస్తోంది, ఎవరు నడుపుతున్నారు, ఇదంతా ఎలా నడుస్తోంది అన్న లెక్కంతా కంటికి కనిపించింది. ఆ రోజు నుంచి నా ఇగోయిజమ్ (అహంకారం) మొదలైనవన్నీ అంతమయ్యాయి. తర్వాత నేను వేరే స్వరూపంలో ఉండటం మొదలుపెట్టాను. విదౌట్ ఇగోయిజమ్, విదౌట్ మమత్వం (అహంకారం, మమత్వం లేకుండా)! పటేల్ అలాగే ఉన్నాడు మునపటిలాగానే. కానీ, 'నేను' స్వరూపం వేరుగా మారింది! అప్పటి నుంచి నిరంతర సమాధి తప్ప, ఒక్క సెకండ్ కూడా వేరే ఏమీ లేదు.

## సూరత్ స్టేషన్‌లో ఏం కనిపించింది?

**ప్రశ్నకర్త:** దాదాజీ, మీకు సూరత్ స్టేషన్‌లో 'జ్ఞానం' కలిగినపుడు మీకు కలిగిన అనుభవం ఎలా ఉంది?

**దాదాశ్రీ:** బ్రహ్మాండమంతా కనిపించింది. ఈ జగత్తు ఎలా నడుస్తూవుంది, ఎవరు నడుపుతున్నారు, అంతా కనిపించింది. ఈశ్వరుడెవరు, నేనెవరు? ఇతనెవరు? ఇదంతా దేని ఆధారంగా నడుస్తూవుంది, అంతా కనిపించింది. అవగతమైంది, పరమానందం కలిగింది. రహస్యమంతా వెల్లడైంది. శాస్త్రాలలో సంపూర్ణంగా రాయలేరు. శాస్త్రాలలో ఎంతవరకు భాషలోని పదాలు అందుకోగలవో, అంతవరకే రాయగలుగుతారు. కానీ జగత్తు భాషలోని పదాలకు అందనంత చాలా ముందుకి ఉంది.

## జనమధ్యంలో ఏకాంతం, కలిగింది భగవద్దర్శనం

**ప్రశ్నకర్త:** సూరత్ స్టేషన్‌లో కలిగిన అనుభూతి, ఒక్కసారిగా వచ్చిన డైరెక్ట్ ప్రకాశం అదంతా అనాయాసంగానే జరిగిందా?

**దాదాశ్రీ:** ఔను అనాయాసంగానే జరిగింది. దానంతటదే ఉత్పన్నమైంది. సూరత్ స్టేషన్‌లో ఒక బెంచ్ మీద కూర్చున్నాను. జనంతో చాల రద్దీగా ఉంది. కానీ ఇదంతా అనాయాసంగానే జరిగింది!

**ప్రశ్నకర్త:** ఆ తర్వాత?

**దాదాశ్రీ:** తర్వాత అంతా పూర్ణ రూపంలో కనిపించసాగింది. ఆ తర్వాత పరివర్తనే జరిగింది.

**ప్రశ్నకర్త:** ఆ సమయంలో ప్రపంచంలోని జనమంతా ఎక్కడివాళ్ళు అక్కడే ఉన్నారు కదా?

**దాదాశ్రీ:** ఔను. అప్పుడు మనుషుల ప్యాకింగ్ కనిపించసాగింది. ప్యాకింగ్ లోపలి సరుకు కూడా కనిపించసాగింది. వెరైటీస్ ఆఫ్ ప్యాకింగ్ (రకరకాల ప్యాకింగ్) కాని సరుకు (ఆత్మ) ఒకే రకంగా! అంటే, అదే క్షణంలో ప్రపంచం అంతా భిన్నంగా కనిపించింది అక్కడ.

**ప్రశ్నకర్త:** జ్ఞానం తర్వాత వ్యవహార కార్యం జరిగేదా?

**దాదాశ్రీ:** చాలా బాగా జరిగేది. అంతకు ముందు అహంకారం వ్యవహారాన్ని కలుషితం చేసేది.

**ప్రశ్నకర్త:** పద్యంలోని 'జనమధ్యంలో ఏకాంతం, కోలాహలంలో శుక్లధ్యానం' అన్నదానికి కాస్త వివరణనిస్తారా?

**దాదాశ్రీ:** 'జనం మధ్యలో ఏకాంతం' అంటే ఏమిటంటే, మనిషి ఏకాంతంలో కూడా ఏకాంతంలో ఉండలేడు. ఎందుకంటే అతని మనస్సు ఉంటుంది కదా! అందువలన ఎక్కడైనా జనం ఎక్కువగా ఉంటే, అక్కడ ఏకాంతం! తర్వాత 'కోలాహలంలో శుక్లధ్యానం' ఉత్పన్నమైంది. ఇటు, అటు ఎంత కోలాహలమంటే ఏం చెప్పను? జనం రద్దీగా ఉన్నారు, నేను నా శుక్లధ్యానంలో ఉన్నాను. అంటే ప్రపంచం అంతా సంపూర్ణంగా నాకు జ్ఞానంలో కనిపించింది. ఉన్నదున్నట్లుగా కనిపించింది.

**ప్రశ్నకర్త:** అటువంటి అవస్థ ఎంత సేపు ఉంది?

**దాదాశ్రీ:** ఒక గంటసేపు! అంతా ఎగ్జాక్ట్‌గా ఒక గంటసేపట్లోనే అయిపోయింది. తర్వాత ఎంతో పరివర్తన కనిపించింది. అహంకారమైతే సమూలంగా మాయమైపోయింది. క్రోధం-మానం-మాయ-లోభం అన్ని విధాల బలహీనతలు వెళ్ళిపోయాయి. నేనైతే అలా జరుగుతుందని ఆశించనేలేదు.

అందరూ నన్ను, 'మీకు జ్ఞానం ఎలా కలిగింది?' అని ప్రశ్నిస్తారు. 'మీరు దాన్ని అనుకరిద్దామనుకుంటే దాన్ని అనుకరించటమనేది కుదిరే పని కాదు. దిసీజ్ బట్ నేచురల్ (ఇది సహజంగా జరిగింది)! అనుకరించదగ్గదైతే నేనే చెప్తాను, భాయీ నేను ఈ మార్గంలో వెళ్ళాను, ఇటు తిరిగాను, అటు వెళ్ళాను, అలా నాకు ఇది లభించింది అని. నేను వెళ్ళిన మార్గంలో నాకు ఇంత గొప్ప బహుమతి లభించటమనేది అసంభవమే. నేను ఏదో సాధారణమైన ఫైవ్ పర్సెంట్ (ఐదు శాతం) లభిస్తుందని, నా శ్రమ ఫలిస్తే అందులో నాకు ఒకటో అరో శాతం లభిస్తుందేమో అని భావించాను.

## తేదీతో పేచీ ఏమీ లేదు

**ప్రశ్నకర్త:** దాదాజీ మీకు జ్ఞానం కలిగిన తేదీ ఏమిటి?

**దాదాశ్రీ:** సంవత్సరమైతే యాభై ఎనిమిది (1958). తేదీ అయితే నాకు తెలియదు. దాన్ని నోట్ చేసుకునే అవసరం కూడా కలుగుతుందని నాకేం తెలుసు? ఎవరైనా ఆ నోట్‌ని అడుగుతారని కూడా తెలియదు కదా! నేనైతే, నాకు మార్గం దొరికిందనే అర్థం చేసుకున్నాను.

**ప్రశ్నకర్త:** దాని ఉపయోగం ఏమిటో తెలుసుకుని పరిశోధన చేయాలి కదా?

**దాదాశ్రీ:** లేదు లేదు. తారీఖు కావాలని ఉంటే దానంతటదే దొరుకుతుంది. ఇప్పుడు దాని గురించి మనకెందుకీ పేచీ?

**ప్రశ్నకర్త:** అది వర్షాకాలమా?

**దాదాశ్రీ:** లేదు. అది వేసవి, వర్షాకాలాలకు మధ్య కాలం.

**ప్రశ్నకర్త:** జూలై నెల అయ్యుండవచ్చా?

**దాదాశ్రీ:** అది జూలై కాదు జూన్! నాకు దానితో ఎటువంటి సంబంధమూ లేదు. నాకైతే వెలుగయింది. దానితోనే సంబంధం.

**ప్రశ్నకర్త:** తర్వాత దాని గురించి తెలుసుకునేందుకు అందరూ ఆత్రుత చూపిస్తారేమో?

**దాదాశ్రీ:** అలా అత్రుత చూపిస్తే తెలిసిపోతుందేమో కూడా. అవసరం పడితే తప్పక తెలుస్తుంది.

## ఇలా చెయ్యాలి ప్రతిక్రమణ

అరె, అప్పుడు అజ్ఞానావస్థలో ఉన్నపుడు నా అహంకారం చాల ఎక్కువగా ఉండేది. వాళ్ళు ఇలా, వీళ్ళు అలా, తిరస్కారం, తిరస్కారం, తిరస్కారం, తిరస్కారం..... ఎప్పుడైనా ఎవరినైనా మెచ్చుకోవటం కూడా జరిగేది! ఒక పక్క ఇతన్ని మెచ్చుకోవటం, మరోపక్క అతన్ని నిరసించటం. కానీ 1958లో 'జ్ఞానం' కలిగిన దగ్గరి నుంచి ఎ.ఎమ్.పటేల్ కి తెలియజేసింది, ఎవరెవరిని తిరస్కార భావంతో చూసానో వాళ్ళందరినీ వెతికి వెతికి పట్టుకుని, అలా తిరస్కరించినవాళ్ళని సబ్బుతో కడుగు అని. అందువలన ఒక్కొక్కరినీ వెతికి వంతులవారీగా కడిగివేయటం మొదలుపెట్టాను. ఇటువైపున్న పొరుగువారు, అటువైపున్న పొరుగువారు, కుటుంబ సభ్యులంతా, బాబాయి, మామయ్య, అందరినీ నిరసించేవాడిని కారణం లేకుండానే! వాళ్ళందరినీ కడిగివేసాను.

**ప్రశ్నకర్త:** అంటే మనసులో ప్రతిక్రమణ చేసారు కానీ ముఖాముఖిగా కాదా?

**దాదాశ్రీ:** నేను ఎ.ఎమ్.పటేల్‌తో చెప్పాను, మీరు చేసిన చెడ్డ పనులన్నీ నాకు కనిపిస్తాయి అని. ఇక ఇప్పుడీ తప్పులన్నిటినీ కడిగివేయండి. కనుక అతను ఏం చెయ్యటం మొదలుపెట్టాడు? ఎలా కడిగివేసాడు? నేనప్పుడు అతనికి అన్నీ గుర్తుతెచ్చుకోండి అని చెప్పాను. చందూభాయ్‌ని తిట్లు తిట్టారు. జీవితాంతం చెడ్డగా మాట్లాడారు, తిరస్కరించారు, అదంతా వర్ణిస్తూ చెప్పాలి, 'ఓ చందూభాయ్, మన-వచన-కాయా కా యోగ్, ద్రవ్యకర్మ, భావకర్మ, నోకర్మలకు వేరుగా ప్రకటమైన

శుద్ధాత్మా భగవాన్! చందూభాయ్‌లో స్థితమైయున్న శుద్ధాత్మా భగవాన్! నేను చందూభాయ్‌ని మళ్ళీ మళ్ళీ క్షమాపణ కోరుకుంటున్నాను. దాదా భగవాన్ సాక్షిగా క్షమాపణ కోరుకుంటున్నాను. మళ్ళీ అటువంటి తప్పు చేయను'. మీరు అలా చేస్తేనే ఎదుటివారి ముఖంలో మార్పుని మీరు చూస్తారు. వాళ్ళ ముఖంలో మార్పు మీకు కనిపిస్తుంది. మీరు ఇక్కడ ప్రతిక్రమణ చేస్తూవుంటే అక్కడ వాళ్ళలో మార్పు వస్తుంటుంది.

## ఈ జ్ఞానం కలిగిన తర్వాత

సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ అంతా రావటం మొదలై, సూరత్ స్టేషన్‌లో ఆ కాలం కలిసివచ్చింది. ఆ కాలం వలన ఈ జ్ఞానోదయం కలిగింది– జగత్తు దేని ఆధారంగా నడుస్తూవుంది, ఎలా నడుస్తోంది, అదంతా. విజ్ఞానమంతా కనిపించింది. బయటి కంటికి కాదు. అంతర్నేత్రంలో. అంతే, అదే క్షణం నా అహంకారమంతా వెళ్ళిపోయింది. 'నేను శరీరాన్ని' అనేది ఎగిరిపోయింది. తక్షణం నుంచే సంపూర్ణమైన జ్ఞాన దశ కలిగింది.

అప్పుడు నేను జ్ఞాన దశలో ఉండేవాడిని బడౌదాలో! అంతకు ముందు కర్మల కారణంగా పాత ఫ్రెండ్ సర్కిల్ అంతా వచ్చిపోతుండటం జరిగింది. అంతకు ముందులాగానే అందరితో, 'ఎలా ఉన్నారు? ఏం జరిగింది, ఏం లేదు' అనటం జరిగింది కానీ, అంతకు ముందున్న మమత్వం లేదు. అది లేదు! అంతకు ముందు నా అభిమానానికి తగ్గట్లుగా నేను మాట్లాడుతుండేవాడిని. ఎవరికీ ఏ పనినీ ఉచితంగా చెయ్యలేదు. దానికి ప్రతిగా నాలోని అభిమానానికి పోషణ లభిస్తుండేది. అంటే, ఏ కారణం లేకుండా ఏ పనీ జరిగేది కాదు. కానీ తర్వాత అదే పని అభిమానంతో పనిలేకుండా జరుగసాగింది.

జ్ఞానం వెల్లడించిన తరువాత నాలుగు సంవత్సరాలు గడిచాయి. అప్పటి వరకు ఎవరికీ తెలియనే లేదు ఈయన ఏదైనా సాధించారని. తరువాత గుంపు రావడం ప్రారంభమైనది. (ప్రజలు జ్ఞానం పొందేందుకు రావడం ప్రారంభించారు.)

# 4. భాగస్వామ్యంలో వ్యాపారం చేస్తూ....

## ఉద్యోగంలో ఎంత వచ్చేదో అంతే ఇంటి ఖర్చు కోసం

వీలయినంత వరకు తప్పు మార్గంలో సంపాదించిన డబ్బుని ఇంటికి తీసుకుని రాకూడదు అని నేను చిన్నప్పుడే నిర్ణయించుకున్నాను. ఒకవేళ సంయోగంతో వచ్చినట్లయితే, దాన్ని వ్యాపారంలోనే ఉంచేయాలి కాని, ఇంట్లోకి రానీయగూడదు. అందువలన నాకు అరవైఆరు సంవత్సరాలైంది కాని ఇంతవరకు ఇంటికి అబద్ధపు డబ్బుని ఇంట్లోకి రానివ్వలేదు. ఇంట్లో ఎప్పుడూ క్లేశాలు తలెత్తలేదు. ఇన్ని డబ్బులతో ఇల్లు గడపాలి అని ఇంట్లో నిర్ణయించుకోవటం జరిగింది. వ్యాపారంలో లక్షల్లో డబ్బు వస్తుంది. కానీ, ఈ ఎ.ఎమ్.పటేల్ సర్వీస్ (ఉద్యోగం) కి పోతే అతనికి జీతం ఎంత వస్తుంది? ఎక్కువలో ఎక్కువ ఆరు ఏడు వందల రూపాయలు రావొచ్చు. వ్యాపారమనేది పుణ్యం వలన వచ్చేది. అందువలన ఉద్యోగంలో ఎంత వస్తుందో, అన్ని డబ్బుల్లోనే ఇంటి ఖర్చులు వెళ్ళదీయాలి. మిగతాది వ్యాపారంలోనే ఉండనీయాలి. ఇన్‌కమ్ ట్యాక్స్ వాళ్ళ దగ్గరి నుంచి ఉత్తరం వస్తే, 'ఇదిగో ఈ డబ్బు ఉంది దీన్ని జమకట్టుకోండి' అనాలి. ఎటువంటి 'అటాక్' ఎప్పుడు జరుగుతుందో చెప్పలేము. ఒకవేళ ఆ డబ్బులను ఖర్చుపెట్టేస్తే, అప్పుడు ఇన్‌కమ్ ట్యాక్స్‌వాళ్ళ 'అటాక్' జరిగితే, దానితో పాటు ఇక్కడ రెండవ 'అటాక్' (హార్ట్‌కి) కూడా వస్తుంది! అన్ని చోట్లా 'అటాక్' లే జరుగుతున్నాయి కదా? దీన్ని జీవనం అని ఎలా అంటాము? మీకేమనిపిస్తోంది? తప్పు జరుగుతుంది అని అనిపిస్తోందా లేదా? మనం ఆ తప్పుని తుడిచివేయాలి.

## డబ్బులకు లోపం ఉండొద్దు, అతిగానూ ఉండొద్దు

నాకెప్పుడూ డబ్బుకి లోపం లేదు, ఎక్కువగానూ లేదు. ఒక లక్ష రూపాయలు వస్తున్నాయంటేనే ఎక్కడో ఒక దగ్గరి నుంచి వచ్చి బాంబు పడేది (ఏదో ఒక విధంగా) ఖర్చువచ్చిపడేది. అంటే ఎక్కువైతే ఉండదు. ఒక్కోసారి అసలే ఉండేది కాదు. కొన్ని దాచి పెట్టి కూడా ఉంచటం జరిగింది. మన దగ్గరికి చెడు మార్గంలో డబ్బు వస్తే దాన్ని దాచిపెట్టి ఉంచాలి కదా. అలా చెడ్డ డబ్బు రాకపోతే మనం దాచి ఎలా పెట్టుకుంటాం? అలా నాకు వద్దు కూడా. నాకు తక్కువ పడకూడదు, ఎక్కువా ఉండ కూడదు. లేకపోతే కష్టంగా ఉంటుంది.

## తిరిగి అడిగితే కష్టాలను తెచ్చిపెడుతుంది కదా!

ఇది 1942 వ సంవత్సరంలో సంగతి. ఆ రోజుల్లో ఫ్రెండ్స్ సర్కిల్‌లో ఇచ్చి పుచ్చుకోవటాలు జరుగుతుండేవి. ఆ డబ్బులను తిరిగివ్వటానికి ఎవరూ రాలేదు. మొదట్లో ఎవరికైనా డబ్బులు అప్పు ఇస్తే వంద ఐదువందలు ఇచ్చేవారు కారు. అది పరవాలేదు! నా దగ్గర ఉన్నాయి కనుక నా స్నేహితులకు హెల్ప్ (సహాయం) చేస్తుండేవాడిని. కానీ తర్వాత తిరిగిచ్చేందుకు రాకపోవటంతో నా లోపలి నుంచి సందేశం వచ్చింది, 'మంచిదయింది. డబ్బులు అడిగి తీసుకుంటే వాళ్ళు మళ్ళీ మళ్ళీ అప్పు కోసం వస్తుంటారు' అని. డబ్బులు తిరిగి అడిగి తీసుకుంటే కొంచెం కొంచెంగా ఒక ఐదు వేల వరకూ వసూలౌతాయేమో కానీ తర్వాత పదివేలు అడగటానికి వస్తారు. అందువలన అడిగేవారిని నిలిపివేయటానికి ఇదే మంచి మార్గం. నేను దానితోనే నిలిపివేసాను, తాళం వేసేసాను. అడిగి తీసుకుంటే వాళ్ళు మళ్ళీ మళ్ళీ వచ్చి అడుగుతుంటారు కదా? ఇక వాళ్ళు నా గురించి, 'తిరిగి అడగనే అడగడు, మంచిదే మా పనైతే నెరవేరింది' అనే అభిప్రాయంలోకి వచ్చారు. అందువలన వాళ్ళు మళ్ళీ రానేలేదు, నాకూ అదే కావలసింది కూడా. అంటే, 'మంచిదయింది గొడవ ఒదిలిపోయింది. హాయిగా హరినామ స్మరణ చేసుకుందాం'. అలా ఆ సమయంలో ఆ కళను ప్రదర్శించటం జరిగింది.

నాకు తెలిసినతను ఒకతను డబ్బు అప్పుగా తీసుకునిపోయాడు. తిరిగి ఇవ్వటానికి రానేలేదు. అప్పుడు నాకు అర్థమైంది అతనితో కర్మానుబంధం ఉండివుంటుంది. అందుకే తీసుకునిపోయాడు. పైగా నేను అతనితో, 'నీవు డబ్బులు తిరిగివ్వటానికి రావొద్దు, నిన్ను వదిలేస్తున్నాను' అన్నాను. అలా డబ్బులు పోగొట్టుకోదలచుకుంటే, పోగొట్టుకుని కూడా కర్మ బంధాన్ని వదిలించుకోవచ్చు.

## అప్పు ఇచ్చినతనికే రెండవసారి డబ్బు ఇచ్చాను! ఎలా పడ్డాను వలలో?

అదేమిటంటే, ప్రపంచంలో ఇచ్చిపుచ్చుకోవటాలు జరుగుతూనేవుంటాయి. ఒకసారి ఎవరి దగ్గరి నుంచైనా తీసుకోవటం జరుగుతుంది, ఒకసారి ఎవరికైనా ఇవ్వటం జరుగుతుంది. ఎప్పుడైనా ఒక వ్యక్తికి డబ్బు అప్పుగా ఇచ్చి, అతను తిరిగి

ఇవ్వకపోతే మనసులో బాధ కలుగుతుంది కదా? మనసులో, 'అతను ఎప్పుడు తిరిగిస్తాడో? ఎప్పుడు తిరగిస్తాడో' అనే ఆలోచన వస్తూనేవుంటుంది. దానికి అంతమేమైనా ఉందా?

నా విషయంలో కూడా అలాగే జరిగింది కదా! డబ్బు తిరిగి రాకపోతే దాని గురించి ముందు నుంచే ఆలోచించటం చేసేవాడిని కాను. సాధారణంగా అయితే అతన్ని నిలబెడతాం, తప్పక ఏమైనా అంటాం. నేను ఒక మనిషికి ఐదు వందల రూపాయలు అప్పుగా ఇచ్చాను. ఇచ్చినపుడు బైఖాతోలో రాయలేదు. కాగితం మీద సంతకం కూడా పెట్టించుకోలేదు. ఇది జరిగిన సంవత్సరం, సంవత్సరంన్నర అయింది. నాకు కూడా జ్ఞాపకం రాలేదు. ఒకసారి ఆ మనిషి నాకు దారిలో కనిపించినపుడు నాకు గుర్తుకొచ్చి అతన్ని, 'ఇప్పుడు పరిస్థితి బావున్నట్లయితే, నీకు నేనిచ్చిన ఐదు వందల రూపాయల అప్పుని తిరిగిచ్చేయగూడదూ?' అని అడిగాను. అప్పుడతను, 'ఐదు వందలా ఏ సందర్భంలో?' అన్నాడు. నేను అతనికి గుర్తుచేసాను, 'నా దగ్గర అప్పు తీసుకున్నారు కదా ఆ డబ్బు' అని. అది విని అతను, 'మీరు నాకు ఎప్పుడు ఇచ్చారు? డబ్బు నేను కదా మీకు అప్పిచ్చాను, మీరది మర్చిపోయారా?' అన్నాడు. అప్పుడు నాకు ఆశ్చర్యమనిపించలేదు. కాసేపు ఆగి, 'ఔనా! కాస్త ఆలోచించనీయండి' అని, కాసేపు ఆలోచించినట్లుగా నటించి అన్నాను, 'ఆ. గుర్తుకొచ్చింది! నిజమే! ఒక పని చేయండి, రేపు వచ్చి తీసుకోండి!' అన్నాను. రెండవ రోజు అతనికి డబ్బు ఇచ్చేసాను. ఆ మనిషి అక్కడికి వచ్చి, మీరు నాడబ్బుని తిరిగివ్వకపోతే నేనేం చెయ్యాలి అన్నాడు నాతో. ఇలాంటి ఎన్నో సంఘటనలున్నాయి ఉదాహరణగా.

అందువలన, ఇలాంటి ప్రపంచాన్ని ఎలా దాటాలి? నేను ఎవరికైనా డబ్బు అప్పుగా ఇస్తే, దాన్ని నల్ల గుడ్డలో కట్టి నదిలో పడేసిన తర్వాత తిరిగి వస్తుందని ఆశించిన రీతిగానే ఉంటుంది. ఒకవేళ వాపసు వస్తే జమకట్టుకోండి. తీసుకునివచ్చిన మనిషికి టీ ఇచ్చి, 'భాయీ నీవు చాల సహాయం చేసావు డబ్బు తిరిగిచ్చి. లేకపోతే ఈ కాలంలో ఎవరైనా ఇలా తిరిగిస్తారా? మీరు తిరిగిచ్చారు ఆశ్చర్యం కదా' అనండి. అతను ఒకవేళ, 'వడ్డీ ఇవ్వలేను' అంటే, 'అసలు వచ్చింది అంతే చాలు' అనండి. అర్థమైందా? అలాంటిదీ ప్రపంచం. అప్పు తీసుకున్నవాడికి తిరిగివ్వటం కష్టంగా

ఉంటుంది. అప్పు ఇచ్చినవాడికి వాపసు రాదన్న చింత ఉంటుంది. వీరిలో ఎవరు సుఖంగా ఉన్నారు? ఇది వ్యవస్థితం (సైంటిఫిక్ సర్‌కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్). డబ్బు తిరిగివ్వడంటే అదీ వ్యవస్థితమే, నేనే డబల్ ఇవ్వవలసివస్తే, అది కూడా వ్యవస్థితమే.

**ప్రశ్నకర్త:** మీరు మళ్ళీ ఐదు వందలు ఎందుకు ఇచ్చారు?

**దాదాశ్రీ:** మళ్ళీ ఏ జన్మలోను ఆ మనిషితో పాలపడకూడదని. ఇలా తప్పు చోటికి చేరుకున్నామన్న జాగృతి ఉండాలి.

## మోసానికి గురవుతాను కానీ కషాయాన్ని పెంచుకోవటానికి కాదు

నా తోటి మనిషి ఒకసారి నాతో, 'మీ అమాయకత్వాన్ని వాడుకుంటున్నారు' అన్నాడు. అందుకు నేను, 'మీరు నన్ను అమాయకుడని అనుకుంటున్నారు కానీ మీరే అమాయకులు. నేను కావాలనే మోసపోతాను' అంటే అతను, 'ఇక ఇప్పటి నుంచి నేను అలా అనను' అన్నాడు. నేనేమనుకుంటానంటే, ఈ వ్యక్తి బుద్ధే అలాంటిది, అతని ప్రవర్తనే అలాంటిది కనుక పోనీలే, లెట్‌గో అనుకోండి! నేను కషాయ ముక్తుడనవటానికే వచ్చాను. నా వలన కషాయం జరగకూడదు కనుకనే మోసపోతాను. రెండవసారి కూడా మళ్ళీ మోసపోతాను. కావాలనే మోసపోవటంలో మజా వస్తుందా లేదా? కావాలని మోసపోయేవారు అరుదుగా ఉంటారు కదా?

**ప్రశ్నకర్త:** అసలే ఉండరు.

**దాదాశ్రీ:** చిన్నప్పటి నుంచీ నా ప్రిన్సిపుల్ (సిద్ధాంతం) ఏమిటంటే, అర్థం చేసుకుని మోసపో. ఇక ఎవరైనా నన్ను మూర్ఖుడుని చేసినా, మోసం చేసినా అందులో ఏమీ ఉండదు. అలా కావాలని మోసపోవటం వలన ఏం జరిగింది? బ్రైన్ టాప్ లోకి వచ్చేసింది. పెద్ద పెద్ద జడ్జ్‌లకు మెదడు పనిచేయటం మానేస్తుందే అలా జరిగింది. జడ్జ్‌కి ఏమనిపిస్తుందంటే, అతను కూడా అర్థం చేసుకుని మోసపోయే వారిలోకి వస్తారు. అలా కావాలని మోసపోయేటప్పటికి బ్రైన్ టాప్‌లోకి వస్తుంది. కానీ చూడండి, మీరు అలాంటి ప్రయోగాలు చెయ్యకండి. మీరు జ్ఞానం తీసుకున్నారు కదా? జ్ఞానం తీసుకోనప్పుడు అలాంటి ప్రయోగాలు చేయాలి.

అంటే, కావాలనే మోసపోవాలి కాని, ఎవరి నుండి అలా మోసపోవాలి? మనకి రోజూ సంబంధం ఉన్నవారితో! బయటివారితో కూడా అప్పుడప్పుడూ మోసపోండి కానీ పరిస్థితిని అర్థం చేసుకుని! ఎదుటివారికి, నేను ఇతన్ని మోసం చేసాను, ఇతన్ని మూర్ఖుడిని చేసాను అనిపించాలి.

## వ్యాపారంలో కూడా ఓపెన్ టు స్కై

వ్యాపారంలో కూడా అంతా ఉన్నదున్నట్లుగా మాట్లాడేవాడిని. అప్పుడు ఒక మనిషి నాతో, 'ఎందుకలా చెప్పేస్తారు?' అన్నాడు. అందుకు నేను, 'ఎవరి దగ్గరి నుంచైనా లోన్ (ఋణం) గా డబ్బు తీసుకోవాలంటే, అతను దాన్ని గుప్తంగానే ఉంచుతాడు. నాకు లోన్ అవసరమే లేదు. ఎవరైనా ఇవ్వదలచుకుంటే ఇవ్వమనండి. నాదైతే ఓపెన్ టు స్కై లాంటిది. కాబట్టి నేను చెప్పేస్తాను, ఈ సంవత్సరం ఇరవై వేల రూపాయల నష్టం వచ్చింది అని. నేనీ మాటను ఓపెన్‌గానే చెప్పేస్తాను. గొడవలేని పని కదా!'

## లెక్క సరిపోయింది, చింత తీరిపోయింది

జ్ఞానోదయానికి ముందు నేను చేసే వ్యాపారంలో ఏమయిందంటే, ఒకతను అకస్మాత్తుగా పదివేల రూపాయల నష్టం కలిగించాడు. ఆ రోజుల్లో పదివేల రూపాయలంటే చాల విలువైన సొమ్ము. ఈ రోజుల్లో పదివేలంటే లెక్కలోకే రాదు కదా! నాకు అప్పుడు పెద్ద దెబ్బే తగిలి, విచారం మొదలైంది. విషయం అక్కడి వరకు వెళ్ళింది. అదే సమయంలో నా లోపలి నుంచి ఇలా సందేశం వచ్చింది, 'ఈ వ్యాపారంలో నిజంగా మన వాటా ఎంత?' ఆ రోజుల్లో మేము ఇద్దరం పార్టనర్స్ ఉండేవాళ్ళం. నేను లెక్కవేసి చూసాను. కాగితం మీద ఇద్దరం పార్టనర్స్. కానీ నిజానికి ఎంతమంది? నిజం చెప్పాలంటే నా ఇల్లాలు, పార్టనర్ వైఫ్, వాళ్ళ కొడుకులు, కూతుళ్ళు, వీళ్ళంతా పార్టనర్సే కదా! అప్పుడు నాకు అనిపించింది ఏమిటంటే, వీళ్ళందరిలో ఎవరికీ లేని చింత నా ఒక్కడి మీదనే భారమై నా తల మీద ఎందుకు మోయాలి, అని. ఆ రోజు వచ్చిన నా ఈ ఆలోచన నన్ను రక్షించింది. ఇది వాస్తవమే కదా?

## ఒకవేళ నష్టాన్నే ఆశిస్తే?

నేను నా జీవితం మొత్తం చేసింది కాంట్రాక్ట్ పని. రకరకాల కాంట్రాక్ట్‌లు చేసాను. వాటిలో సముద్రంలో జెట్టీలను తయారుచేసే పని కూడా ఉంది. వ్యాపారం మొదట్లో ఏం చేసేవాడినో తెలుసా? ఐదు లక్షల రూపాయల లాభం ఉండేచోట మొదటి నుంచే లక్ష రూపాయలు దొరికితే చాలు అనుకునేవాడిని. లేదా లాభం కాని నష్టం కాని లేకుండా కేవలం ఇన్‌కమ్‌ట్యాక్స్ కట్టగలిగి, నా సొంత ఇంటి ఖర్చులు తీరిపోతే అదే చాలు అనుకునేవాడిని. ఆ తర్వాత మూడు లక్షల రూపాయలు మిగిలితే ఎంత ఆనందంగా ఉంటుంది? ఎందుకంటే ఆశించినదానికంటే ఎక్కువ మిగిలింది కనుక. నలభై వేలు ఆశించి ఇరవై వేలు మిగిలితే ఇక దుఃఖమే దుఃఖం కాదా?

చూడండి, ఇది చాల పిచ్చి పద్ధతే కదా! జీవనాన్ని సాగించే విధానమే పిచ్చి పద్ధతి! ఎవరైనా మొదట్లోనే నష్టాన్నే ఆశిస్తే అతన్ని మించిన సుఖజీవి మరెవరూ ఉండరు. నష్టాన్నే ఉపాసిస్తే ఇక జీవితంలో నష్టమనేదే రాదు!

## అభిప్రాయ భేదాలు లేకుండా చెయ్యటానికి కష్టాలు పడ్డాను

తోటివారితో నేను నలభై ఐదు సంవత్సరాలు కలిసే తిరిగాను కానీ, ఒక్కసారి కూడా అభిప్రాయ భేదం రాలేదు. దానికోసం ఎన్ని కష్టాలు పడుంటాను నేను? లోలోపల కష్టపడాల్సివుంటుంది కదా! ఈ ప్రపంచంలో అభిప్రాయ భేదం అంటే ఏమిటి? కష్టాలు పెట్టుకోవటమే.

## ఫలితంగా తోటివారు భగవాన్‌గా తలచారు

అంటే, జ్ఞానోదయానికి ముందే నేను అభిప్రాయభేదాలను రానివ్వలేదు. ఒక నల్లితో కూడా అభిప్రాయభేదం లేదు. నల్లులు కూడా అర్థం చేసుకున్నాయి, అభిప్రాయభేదం లేని మనిషి ఒకడు ఉన్నాడు, మనం మన కోటా (భాగం) మనం తీసుకునిపోదాం అని.

**ప్రశ్నకర్త:** కానీ మీరు ఇచ్చేది మీ పూర్వపు సెటిల్‌మెంట్ (బాకీ తీర్చుకోవటం) అనుకోవాలా వద్దా, ఏమిటి దానికి ప్రమాణం?

**దాదాశ్రీ:** సెటిల్‌మెంటే. ఇదేమీ కొత్త సంగతి కాదు. ఇక్కడ ప్రశ్న సెటిల్‌మెంట్‌ది కాదు. మరోవిధంగా భావన దెబ్బతినగూడదు. ఇది సెటిల్‌మెంటే, ఎఫెక్ట్ (పరిణామం). ఆ సమయంలో కొత్తగా భావన దెబ్బతినదు. మన భావన ఎలా ఉండాలంటే, ఈ జరుగుతున్నదంతా కరెక్ట్ (సరైనది) అని.

**ప్రశ్నకర్త:** దీనివలన క్లేశ విముక్తి జరుగుతుంది.

**దాదాశ్రీ:** ఔను. సహించినప్పుడు క్లేశం నుంచి ముక్తి కలుగుతుంది. అయితే కేవలం క్లేశం నుంచి విముక్తే కాదు, దానితోపాటు ఎదుటి వ్యక్తి, మన తోటివారు, వాళ్ళ కుటుంబానికి చెందినవారు అందరికీ కూడా ఊర్ధ్వగతి కూడా లభిస్తుంది. మనల్ని అలా చూడటం వలన వాళ్ళ హృదయం కూడా విశాలం ఔతుంటుంది. సంకుచితంగా ఉండే మనసు విశాలమౌతుంటుంది. తోటివారు కూడా రాత్రింబవళ్ళు మనతోపాటే ఉన్నా, మనకు గౌరవమిస్తూ, 'దాదా భగవాన్ రండి! మీరు సాక్షాత్తూ భగవాన్!' అంటారు. చూసారా మరి నా తోటివారికి నా మీద ప్రేమ కలిగిందా లేదా? తోడుగా ఉన్నాం కాని, అభిప్రాయభేదం లేదు, ప్రేమ ఉత్పన్నమైంది. అటువంటి పరిస్థితిలో వాళ్ళకి ఎంత లాభం కలుగుతుండవచ్చు!

నాకోసం నేనేమీ చెయ్యలేదు. వ్యాపరమైతే దానంతటదే నడుస్తుండేది. నా తోటివారు కేవలం, 'మీరీ ఆత్మకి సంబంధించినవన్నీ చేస్తుంటారు కదా, వాటిని కొనసాగించండి. అవి చేస్తూవుండండి, రెండు మూడు నెలలకు ఒకటో అరో సార్లు మాకు, ఇలా చెయ్యి అలా చెయ్యి అని నిర్దేశాలిచ్చివెళ్తుండండి' అనేవారు. అంతే వాళ్ళు నాచేత చేయించుకున్న పనులింతే.

**ప్రశ్నకర్త:** అయితే తోటి పనివారికి కూడా ఏదో కాస్త మిగులుతుందనే ఉద్దేశ్యం ఉండవచ్చు కదా? తోడుగా పనిచేస్తే తనకు కూడా ఏమైనా లాభం ఉంటుందని అనిపిస్తేనే కదా తోడుగా పనిచేస్తారు?

**దాదాశ్రీ:** ఔను.

**ప్రశ్నకర్త:** మరి ఆ సందర్భంలో అతనికి ఏం లాభం కలిగివుండేది?

**దాదాశ్రీ:** అతనికి ప్రాపంచికంగా చూస్తే డబ్బుల పరంగా చాలా లాభం కలిగింది. అతను తన కొడుకులతో, దాదాజీ సమక్షంలో అతను శ్రీమంతుడయ్యాడని అంటుండేవాడు. నాకు ఎప్పుడూ డబ్బులకు కొదవు రాలేదు.

# 5. జీవితంలో నియమం

## నన్ను నేను టెస్టెడ్ చేసుకున్నాను

1961-62 లో నేను ఒకసారి, 'నన్ను ఒక్కసారి పిడికిలితో గుద్దినట్లయితే నేను వాళ్ళకి ఐదు వందల రూపాయలు ఇస్తాను' అన్నాను. కానీ ఎవరూ నన్ను గుద్దటానికి రాలేదు. అప్పుడు నేను, 'అరె, డబ్బులు కావాలంటే వచ్చి కొట్టండి' అంటే, 'లేదు లేదు నాకే గతి పడుతుందో' అన్నారు. ఎవరు కొడతారు? అలా ఎవరు చేస్తారు? ఎవరైనా ఉచితంగా కొట్టినట్లయితే, ఈ రోజు ఎంత గొప్ప బహుమతి దొరికింది అని అనుకోవాలి. దాన్ని ఒక పెద్ద బహుమతి అనే అనుకోవాలి. పూర్వం నేను ఇవ్వటంలో ఏదో లోపం చేసుంటే, అదే వాపసు తిరిగి వస్తుంది.

నేను చెప్పేదేమిటంటే, ఈ ప్రపంచంలోని క్రమం ఎలాంటిదంటే, మీకు 1995 లో ఒక చొక్కా లభించేదుంటే, దాన్ని మీరు ఈ రోజే వాడేసారనుకోండి, 1995 లో చొక్కా లేకుండా ఉండాల్సివస్తుంది. నేను ఇక్కడ స్పష్టం చేసేది మీరు దాన్ని సరైన ఉపయోగంలోకి తెచ్చుకోండి. ఉపయోగించకుండా దేన్నీ తీసిపడేయకండి. ఒకవేళ తీసివేయదలచుకుంటే, అది బాగా పనికిరాకుండా పోయిన తర్వాతనే తీసిపడేస్తే మంచిది! నా నియమం అదే. అందువలన, ఎంతో ఎక్కువగా దాన్ని వాడకపోతే ఆ వస్తువుని పడేయకండి. ఎందుకంటే ఏదో కాస్త వస్తువు మిగిలివుంటే, దాన్ని ఉపయోగించగలిగేటట్లుగా ఉంటే, దాన్ని ఒట్టిగా తీసిపడేయవద్దు. అది మీనింగ్‌లెస్ (అర్థరహితం) అవుతుంది కదా! అంటే మీరు ఉపయోగిస్తున్న ఈ వస్తువులన్నిటికీ లెక్క అనేది ఉంటుంది కదా? దాని లెక్క ఉంటుంది, ఎంతవరకు అనే లెక్క ఉంటుంది. ప్రతి ఒక్క పరమాణువుకీ లెక్క ఉంది ఇక చెప్పండి! అక్కడ గుడ్డిగా ఎలా నడుస్తుంది? 'వ్యవస్థితం' నియమం, పరమాణువు వరకు లెక్క ఉండటం. అందుకే దేన్నీ పాడుచేయవద్దు.

## ప్రపంచంలో లొసుగులు పనిచేయవు

జ్ఞానిపురుష్‌కి త్యాగాత్యాగాలు సంభవం కాదు. అయినా నాకు నీటిని పాడుచేయ వలసివుంటుంది. నాకు కాలిలో ఫ్రాక్చర్ అవటం వలన విదేశీ మరుగు దొడ్డిని ఉపయోగించవలసివస్తుంది, రెండు డబ్బాల నీరు పోతుంది. ఇది ఎందుకు చెప్తున్నాను? నీరు తక్కువగా ఉందనా లేక నీరు ఖరీదైన కారణంగానా? నీటి వలన ఎన్నో జీవాలు కొట్టుకునిపోయి చచ్చిపోతాయి. తక్కువ నీటితో పని జరిగే వీలుంటే అక్కడ అంత వృధా ఎందుకు చేయాలి? నేను జ్ఞాని పురుష్‌ని కనుక తప్పు జరగగానే వెంటనే మందు వేస్తాను (ప్రతిక్రమణ చేస్తాను). అయినా మనందరం కూడా మందు వేసుకోవాలి. ఎందుకంటే అక్కడ ఉన్నది జ్ఞాని పురుష్ అయినా లేక ఎవరైనా సరే వాళ్ళదేమీ నడవదు. ఇదేమీ అరాచకమైన నగరంలో నడిచే గూండా రాజ్యం కాదు. ఇది వీతరాగుల శాసనం. ఇరవైనాలుగు మంది తీర్థంకరుల శాసనం. మీకు అర్థమౌతుందా తీర్థంకరుల ఇటువంటి మాటలు?

## వేర్పాటు స్థితిలో జాగృతి

నాకు జ్వరం వచ్చినప్పుడు ఎవరైనా వచ్చి, 'మీకు జ్వరం వచ్చిందా?' అని పలకరిస్తే, 'ఔను అన్నా, నాకు తెలిసిన ఎ.ఎమ్.పటేల్‌కి జ్వరం వచ్చింది' అంటాను. 'నాకు జ్వరం వచ్చింది' అని అంటే అది నాకు చుట్టుకుపోతుంది. తన గురించి ఎలా భావిస్తే అలాగే అవుతుంది. అందువలన నేను, 'నాకు జ్వరం వచ్చింది' అని అనను.

## నా ఒక అనుభవం

నేను రైలులో ఫస్ట్ క్లాస్‌లో ప్రయాణం చేయను. ఎందుకంటే ఇతర ప్యాసెంజర్లు వెనకబడిపోతారు. నాకు ఏదో ఒక అబద్ధం చెప్పటం రాదు. వాళ్ళు నా గురించి అడిగినట్లయితే నేను నిజం చెప్తే వాళ్ళు వెతుక్కుంటూ నా ఇంటికి వచ్చిపడ్తితే? అంటే ఇలాంటి అనవసరమైన చికాకు ఎందుకు పెట్టుకోవాలి? దానికంటే నా సొంత సోదరులలాంటి థర్డ్ క్లాస్ ప్యాసెంజర్లు నయం. తాత్పర్యం ఏమిటంటే, వచ్చిపోయే వాళ్ళు వచ్చి తగిలినప్పుడు లోపల ఉండే కషాయ భావం ఎలాంటిదన్నది తెలుస్తుంది. ఎవరితోనైనా తగిలి కొట్టుకున్నప్పుడు లోపల ఉండే బలహీనతలు బయటపడతాయి. అలా అన్ని బలహీనతలు పోతాయి.

రైలు యాత్ర పూర్తయిన తర్వాత కాళ్ళు నొప్పులు వస్తుంటే 'అంబాలాల్ భాయ్, మీ కాళ్ళల్లో నొప్పి కలిగిందా లేదా? అలిసిపోయారా? ముడుచుకుని కూర్చోవటం వలన కాళ్ళు నొప్పులు వచ్చుంటాయి' అంటాను. బాత్‌రూంలోకి పోయి వీపు తట్టి, 'నేనున్నానుగా మీతో, భయమెందుకు? నేను శుద్ధాత్మ భగవాన్‌ని కదా, మీకు తోడుగా ఉన్నానుగా' అంటాను. దానితో మళ్ళీ ఫస్ట్‌క్లాస్ అయిపోతుంది.

కష్టం కలిగినపుడు వెన్నుతట్టి, జ్ఞానం కలుగకముందు మీరు ఒంటరివారు, ఇప్పుడు జంటగా అయ్యారు. ఇంతకు ముందు మీకు ఎవరి మద్దతూ లేదు. మీరు మద్దతు కోసం వెతుకుతుండేవారు. ఇప్పుడు ఒంటరివారు జంటగా అయ్యారు. అలా ఎప్పుడైనా చేసారా లేదా?

**ప్రశ్నకర్త:** చేసాను.

**దాదాశ్రీ:** ఆ సమయంలో మనకు వేరే విధమైన అనుభూతి కలుగుతుంది కదా? బ్రహ్మాండానికే మహారాజులా మాట్లాడాలి. నా అనుభవంలోని విషయాలన్నీ మీకు చెప్పాను.

నేను ఎ.ఎమ్.పటేల్‌తో ఎన్నో మాటలు మాట్లాడేవాడిని. అతనికి నచ్చే మాటలు చెప్పేవాడిని. నేను కూడా డెబ్బై ఆరు సంవత్సరాల నుంచి అంబాలాల్ భాయ్‌తో అలా మాట్లాడుతూనేవస్తున్నా కదా! 'డెబ్బై ఆరు సంవత్సరాలయింది. ఏమైనా తెలివి వచ్చిందా? అనుభవంతో సరైన జ్ఞానం పొంది తెలివిగా తయారయ్యారు'.

**ప్రశ్నకర్త:** మీరు ఎప్పటి నుంచి అలా మాట్లాడుతున్నారు

**దాదాశ్రీ:** జ్ఞానోదయం తర్వాత. అంతకు ముందు ఎలా మాట్లాడ గలిగేవాడిని? 'నేను వేరు' అనే అవగాహన వచ్చిన తర్వాతనే.

పెళ్ళికి కూర్చున్నప్పుడు దాన్ని గుర్తు తెచ్చుకుని అంబాలాల్‌తో, 'ఓహోహో! మీరు పెళ్ళి చేసుకోవటానికి కూర్చున్నారు కదా! ఏమిటి? తల మీద నుంచి తలపాగా కిందికి జారిందా? మీకు భార్యావియోగం కలుగుతుందనే ఆలోచన వచ్చింది కదా' అని కూడా అంటూవుంటాను. పెళ్ళి చేసుకుంటున్న సమయంలో తలపాగా కిందికి ఎలా జారింది అన్నదంతా కనిపిస్తుంది. ఆ ఆలోచన రాగానే కనిపిస్తుండేది. నేను

చెప్తుంటే అతనికి ఆనందం కలుగుతుంటుంది. అలా మాట్లాడినప్పుడు అతను ఆనందపడుతుండేవాడు.

## 6. భార్య హీరాబా తో అడ్జస్ట్‌మెంట్

### అభిప్రాయ భేదం రాకుండా జాగ్రత్తపడ్డాను

పెళ్ళప్పుడు చెప్తారు, 'సమయానుకూలంగా సావధాన సావధాన' అని. అలా పెళ్ళి చేయించే పురోహితుడు చెప్పింది చాల సరైనది. ఈ షరతు మీదనే ప్రపంచంలో పెళ్ళిళ్ళు జరుగుతుంటాయి. ఆమె గనక ఎగిరిపడుతున్నప్పుడు మనం కూడా ఎగిరిపడితే దాన్ని సావధానం లేకపోవటం అనాలి. ఆమె ఒకవేళ ఆవేశపడుతుంటే, మనం శాంతంగా ఉండాలి. సావధానంగా ఉండటం అవసరం కాదా? నేను అలా సావధానంగా ఉండేవాడిని. మధ్యలో బీట్లు పడనిచ్చేవాడిని కాను. సంబంధం బీట్లుబారుతున్నట్లయితే వెల్డింగ్ చేసేసేవాడిని.

ముప్పై సంవత్సరాల వయసులోనే నేను అంతా రిపేర్ చేసేసాను. ఇంట్లో ఇక ఎలాంటి గొడవలూ లేవు, అభిప్రాయ భేదాలు లేవు. ఒకవేళ ముందు నుంచే ఆమెతో నాకు గొడవలు అయినట్లయితే అది తెలివితక్కువ గొడవలు అయ్యుండేవి. ఎందుకంటే పెత్తనం చెలాయించచూసాను కనుక.

**ప్రశ్నకర్త:** అందరూ పెత్తనం చెలాయిద్దామనే చూస్తారు. దాదాజీ మీరు చెలాయించే పెత్తనంలో తేడా ఉండేవుంటుంది కదా?

**దాదాశ్రీ:** తేడానా? ఎలాంటి తేడా? పెత్తనం చెలాయించటం పిచ్చితనం. మేడ్‌నెస్ అనాలి!! చీకటిలో ఎన్నితేడాలుంటాయి?

**ప్రశ్నకర్త:** అయినా, మీ విషయంలో వేరేలా ఉండివుండాలి కదా? మీది కాస్త కొత్త తరహాలో ఉండవచ్చు కదా?

**దాదాశ్రీ:** కొద్దిగా తేడా అయితే ఉంది. ఒకసారి ఒక విషయంలో అభిప్రాయం వస్తే దాన్ని మరోసారి రానివ్వలేదు. ఒకవేళ వచ్చినా దాన్ని తిప్పేయటం నాకు వచ్చు. అభిప్రాయభేదమనేది సహజంగా వస్తుంది. నేను ఆమె పక్షంలోనే

మాట్లాడినప్పటికీ ఆమెకి మరోలా అనిపిస్తే దానికి ఉపాయం ఏముంటుంది? ఈ ప్రపంచంలో మంచి చెడు అని చెప్పటానికి కూడా లేదు. ఏ రూపాయి చెల్లుతుందో అదే సరైనది. చెల్లనిది సరైనది కాదు. నావైతే అన్ని రూపాయలూ చెల్లుతాయి. మీవి అక్కడక్కడ చెల్లకపోవచ్చు కదా?

**ప్రశ్నకర్త:** ఇక్కడ దాదాజీ దగ్గర చెల్లుతాయి కానీ వేరేచోట చెల్లవు.

**దాదాశ్రీ:** అలాగా? అయితే సరే! ఆఫీసులో చెల్లినా ఎక్కువే. ఇది ప్రపంచానికి హెడ్ ఆఫీస్ అనిపించుకుంటుంది, నేనేమో బ్రహ్మాండానికి యజమానిని! అలాంటి మాట వినగానే అందరూ ప్రసన్నులైపోతారు, బ్రహ్మాండానికే యజమాని! అలా ఎవరూ అనలేదు. మరి ఈ మాట నిజమే కదా! మనోవాక్కాయకర్మల మీద యాజమాన్యం ఎవరికైతే వదిలిపోయిందో, వారిని సంపూర్ణ బ్రహ్మాండానికే యజమాని అనవచ్చు.

## భార్యకి ప్రామిస్ చేసాను, అందుకే...

హీరాబా కి 1943 ఒక కంటి చూపు పోయింది. ఆమెకున్న గ్లకోమో వ్యాధికి డాక్టర్ వైద్యం చేస్తూనేవున్నా ఆ వ్యాధి ప్రభావం పడి నష్టం జరిగింది.

ఇక అందరి మనసులలోకి ఒక కొత్త పెళ్ళికొడుకు వచ్చేసాడు. మరో పెళ్ళి చేయాలి. కన్యలు కోకొల్లలు కదా! మరి ఆ కన్యల తల్లిదండ్రులకు, ఏదో విధంగా చేసి, నూతిలోకి తోసైనా సరే పని వెళ్ళదీయాలనే కోరిక. అందువలన భాదరణకు చెందిన పటేల్ ఒకతను వచ్చాడు. అతని బావమరిది కూతురు ఉందనుకుంటా, అందుకే వచ్చాడు. 'ఏం కావాలి మీకు?' అని అడిగితే, 'మీరు ఎంత బాధపడ్డారో' అన్నాడు. అప్పుడు 1944లో నా వయసు ముప్ఫై ఆరు. అందుకు నేను, 'ఏం ఎందుకలా అడుగుతున్నారు?' అన్నాను. 'ఒక పక్క హీరా బా కన్ను పోయింది. రెండవది ఆమె వలన సంతానం కూడా కలుగలేదు' అన్నాడు. అప్పుడు నేను, 'సంతానం లేకపోతే ఏమిటి? నాదగ్గర ఒక స్టేట్ కూడా లేదు. బడౌదాలాంటి రాజ్యం లేదు దానిని ఏలే వారసుడు కావటానికి. స్టేట్ కనుక ఉంటే వారసుడికి ఇచ్చేవాడిని. ఒకటి రెండు గూడ్లు, కాస్త భూమి ఉంది. అది కూడా నన్ను రైతునే చేస్తుంది కదా!

ఏదైనా స్టేట్ ఉంటే బాగుండేది!' అని మళ్ళీ ఆయనతో, 'మీరు అలా ఎందుకు అంటున్నారు? నేను హీరాబాని పెళ్ళిలో ఆమెకి వాగ్దానం చేసాను. ఒక కన్ను పోతే ఏమైంది? రెండు కళ్ళు పోయినా నేను ఆమె చెయ్యి పట్టుకుని నడుస్తాను' అన్నాను. 'మీకు ఒకవేళ కట్నం ఇస్తే సంగతి?' అన్నాడతను. అందుకు నేను, 'మీరు మీ అమ్మాయిని నూతిలోకి తోసేద్దామనుకుంటున్నారా? దానివలన హీరాబాకి దుఃఖం కలుగుతుంది. హీరాబా కి దుఃఖం కలుగుతుందా లేదా? నా కన్ను పోయినందు వలనే నాకీ గతి పట్టింది కదా అనిపిస్తుంది. నేనైతే ప్రామిస్ టు పే (వాగ్దానం) చేసాను. నేను ఆమెతో, 'నేను ఎటువంటి పరిస్థితులలోను వెనక్కి తీసుకునేవాడిని కాను. ప్రపంచం తలకిందులైనా సరే, ప్రామిస్ అంటే ప్రామిసేది' అన్నాను. నేను ప్రామిస్ చేసాను కనుక, ఆ ప్రామిస్‌ని వెనక్కి తీసుకోను. నా ఈ ఒక్క జన్మ ఆమెకే! దానివలన ఏం కష్టమొచ్చిపడుతుంది? పెళ్ళి మండపంలో చెయ్యి పట్టుకున్నాను. చెయ్యి పట్టుకోవటమంటే ప్రామిస్ చేసాను. నేను అందరి సమక్షంలో ప్రామిస్ చేసాను. ఒక క్షత్రియుడిగా నేను చేసిన ప్రామిస్‌ని ఒక జన్మలో ఆమె కోసం నెరవేర్చవలసిందే.

## ఎలాంటి అవగాహన? ఎలాంటి అడ్జస్ట్‌మెంట్?

నేను ఎలాంటివాడినంటే, కఢీ (మజ్జిగ పులుసు) ఉప్పగా ఉంటే తక్కువ తింటాను. కఢీ తినక తప్పని పరిస్థితి ఉంటే అందులో కాస్త నీళ్ళు కలుపుకుంటాను. ఉప్పగా ఉంటే దాంట్లో నీళ్ళు కలుపుకుంటే ఉప్పదనం వెంటనే తగ్గిపోతుంది. ఒకసారి అది చూసి హీరాబా అరిచింది, 'ఇదేం చేసారు? ఇదేం చేస్తున్నారు? మీరు అందులో నీళ్ళు పోసారేం?' అని. 'నీళ్ళు పోసి పొయ్యి మీద వంటచేస్తారు, కాసేపటి తర్వాత రెండు పొంగులు వస్తే ఉడికిందని అనుకుంటారు. ఇప్పుడు నేను నీళ్ళు పోస్తే అది పచ్చిగా అయిందని అనుకుంటారు. కానీ అలాగేమీ కాదు' అన్నాను. కానీ ఆమె అలా ఒప్పుకుంటుందా? తిననివ్వలేదు. పొయ్యి మీద కూడా కలిపేది నీళ్ళే కదా?

ఇవన్నీ మనసులో మనం పెట్టుకున్న నమ్మకాలే. మనసు అలా నమ్మినట్లయితే మనం అది నిజమే అనుకుంటాం. లేకపోతే అది చెడిపోయింది అనుకుంటాం. కానీ ఏదీ చెడిపోదుగా! వస్తువులన్నీ అవే ఐదు తత్త్వాలతో తయారైవున్నాయి– వాయువు, జలం, అగ్ని, పృథ్వీ, ఆకాశం. అందువలన ఏమీ చెడిపోదు.

## నిరంతర జాగృతి యజ్ఞ ఫలితమే 'అక్రమ విజ్ఞానం'

**ప్రశ్నకర్త:** కానీ దాదాజీ, మీరు చేసిన ఆ పని, నీళ్ళు కలపటమనేది ఎంత జాగృతితో చేసివుంటారో? ఆమెకి బాధ కలుగకూడదని మీరు చెప్పదలచుకో లేదు. ఉప్పు కాస్త ఎక్కువవటంతో నీళ్ళు కలిపారు.

**దాదాశ్రీ:** ఔను. అరె, ఎన్నోసార్లు టీలో పంచదార ఉండేది కాదు. అప్పుడు కూడా నేను నోరు విప్పలేదు. అందుకు అందరూ, 'ఇలా చేస్తే సంసారం చెడిపోతుంది' అనేవారు. అందుకు నేను, 'రేపు చూడండి మీరు' అనేవాడిని. ఆ రెండవ రోజు ఆమె అనేది, 'నిన్న టీలో పంచదార లేదు. అయినా మీరు నన్ను ఏమీ అనలేదు' అని. 'నేను మీకు చెప్పాల్సిన అవసరం ఏముంది? మీకు ఎలాగైనా తెలిసేదే కదా! మీరు ఒకవేళ టీ తాగేవారు కాకపోతే నేను చెప్పవలసివచ్చేది. కానీ మీరు కూడా టీ తాగుతారు ఇక నేను ఎందుకు చెప్పటం?' అన్నాను.

**ప్రశ్నకర్త:** ఎంత జాగృతిలో ఉండాల్సివస్తుంది ప్రతి క్షణం!

**దాదాశ్రీ:** ప్రతి క్షణం, ఇరవై నాలుగు గంటలు, ఆ తర్వాత ఈ జ్ఞాన ప్రాప్తి అయింది. ఈ జ్ఞానం అలా ఒట్టిగా వచ్చేయలేదు.

నేను ఇక్కడ మాట్లాడేదంతా, మీరు ప్రశ్న అడిగేటప్పుడు ఆ అప్పటి సందర్భపు దర్శనం పైకి వస్తుంది. దర్శనం అంటే ఎలా జరిగిందో అలా యథాతథంగా కనిపించటం. ఎలా జరిగిందో అలా దృశ్యం కనిపించటం.

## అభిప్రాయ భేదం నుంచి మొదటి నుంచే సావధానం

నాలో కలుషిత భావాలు ఉండనట్లయితే ఎదుటివారిలోకి కూడా కలుషిత భావాలు ఉండవు. మనం కోపం చూపించకపోతే వాళ్ళు శాంతిస్తారు. ఏమీ వినిపించకుండా ఉండేందుకు ఒక గోడలా అవాలి. ఇప్పటికి యాభై సంవత్సరాలైంది. మా మధ్య అభిప్రాయభేదాలు రాలేదు. హీరాబా చేతిలోంచి నెయ్యి కింద ఒలికిపోతున్నా సరే నేను ఏమీ మాట్లాడకుండా చూస్తూ ఉండిపోతాను. ఆ సమయంలో మన (ధ్యానం) జ్ఞానం హాజరులో ఉంటే ఆమె నేయిని ఒలికి పడేయటం జరగదు. నేను ఆమెతో కింద పడేయమని అన్నా సరే ఆమె పడేయదు. కావాలని ఎవరైనా నెయ్యిని కింద

ఒలికిస్తారా? లేదే! అయినా నెయ్యి ఒలికిపోతుంటుంది కదా! అది చూడాల్సింది. అభిప్రాయ భేదాలు రాక ముందే నాకు జ్ఞానం ఆన్ ద మూమెంట్ (తక్షణం) హాజరైయ్యుంటుంది.

## మనస్తత్వాన్ని గమనించి సమాధానంతో మెలగాలి

మా ఇంట్లో అభిప్రాయ భేదాలు ఎప్పుడూ రాలేదు. నేనేమో పటేల్‌ని కదా, నా నుంచి కిందపడే పరిస్థితి ఉండదు. అంటే వడ్డించే సమయంలో నేతి గిన్నె లోంచి జాగ్రత్తగా నెమ్మది నెమ్మదిగా వేయటం కోసం ముందుకు వంగటం జరిగేది. అందుకోసం నేను ఎలా వంగేవాడిని? పూర్తిగా నైన్టీ డిగ్రీస్! మిగతావాళ్ళు అలా ఎందుకు చేస్తారు? అక్కడ చూస్తే ఎప్పుడూ డిగ్రీ-డిగ్రీవాళ్ళే (కొద్దికొద్దిగానే కానీ పూర్తిగా వంగరు). ఈ హీరాబా కూడా డిగ్రీ-డిగ్రీవాళ్ళలోదే. అది నాకు నచ్చేది కాదు, మనసులో చెడ్డగా అనిపించేది. కానీ, ఇది కదా ఆమె ప్రకృతి అని నేను ఆమె మనస్తత్వాన్ని గుర్తించాను. అందువలన నేను ఎప్పుడైనా వంగితే ఆమె సర్దుకుపోయేది. ఆమె నాతో, 'మీరు చాల అమాయకులు. అందరికీ పంచుతూవుంటారు' అంటుండేది. ఆమె అన్నది కూడా నిజమే! నేను అల్మేరా తాళం చెవిని ఆమెకిచ్చాను. ఎందుకంటే, ఎవరైనా కష్టాలలో ఉన్నవారిలా నటిస్తూ వచ్చినట్లయితే నేను అటువంటివాళ్ళని గుర్తించకుండా వెంటనే ఇచ్చేస్తుంటాను. నేను అలాంటి తప్పులు చేస్తుండేవాడిని, దానివలన ఎదుటివారికి అనవసరమైన ఎంకరేజ్‌మెంట్ (ప్రోత్సాహం) కలుగుతుండేది. ఇది హీరాబా అనుభవం కనుక నేను తాళంచెవిని ఆమెకే అప్పజెప్పాను. ఇదంతా అజ్ఞాన దశలో జరుగుతుండేది. జ్ఞానోదయం తర్వాత అభిప్రాయభేదం ఎప్పుడూ రాలేదు.

## మాట వెనక్కి తీసుకుని కూడా అభిప్రాయభేదం రాకుండా చేసాను

నేను మీ అందరికీ చెప్తున్న ఈ విషయాలన్నిటినీ నేను ట్రయల్ వేయకుండా చెప్పటం లేదు. అన్ని విషయాలనూ ట్రై చేసిన తర్వాతనే చెప్పాను. ఎందుకంటే, జ్ఞానం కలుగనప్పుడు కూడా వైఫ్‌తో నాకు అభిప్రాయభేదాలు లేవు. అభిప్రాయభేదం అంటే గోడకి తల కొట్టుకోవటమే. మనుషులకు ఈ విషయంలో అవగాహన లేకపోవచ్చు

కానీ నాకైతే అర్థమైంది, అభిప్రాయభేదం అంటే అది, 'కళ్ళు తెరిచే గోడకి కొట్టుకోవటం' వంటిదని.

జరిగిందేమిటంటే, ఒకసారి హీరాబాతో అభిప్రాయభేదం వచ్చింది. నేను ఇరుక్కుపోయాను. నేను నా భార్యని హీరాబా అని పిలుస్తాను. నేనేమో జ్ఞానిపురుష్. కనుక ఆడవాళ్ళలో పెద్దవాళ్ళందరినీ బా (మాత) అని, మిగతా అందరినీ బేటీ (కూతురు) అని పిలుస్తాను. మీరు వినదలచుకుంటే చెప్తాను. మరీ పెద్ద కథేమీ కాదు. చాల చిన్న విషయమే.

ఒకసారి మా మధ్య కూడా అభిప్రాయభేదం వచ్చింది. నేను ఇరుక్కుపోయాను. హీరా బా నాతో, 'నా అన్నయ్యకి నలుగురు కూతుళ్ళు. వాళ్ళలో పెద్ద కూతురు పెళ్ళి. ఆమెకి మనం ఏ వెండి వస్తువు ఇద్దాం?' అని అడిగితే నేను, 'ఇంట్లో ఉన్నవాటిలోంచి ఏదైనా ఇవ్వు' అన్నాను. అప్పుడామె, మా ఇంట్లో 'నీది-నాది' అని అనము. 'మనది' అనే అంటాము. కానీ ఆ రోజు ఆమె, 'మీ మామయ్య కూతుళ్ళకైతే ఇంతింత పెద్ద పెద్ద వెండి గిన్నెలిచ్చారు' అన్నది. అలా ఆ రోజు మాటల్లో నీది నాది అనేది వచ్చింది. 'మీ మామయ్య కూతుళ్ళు' అన్నదే. అంత వరకు వచ్చింది! నాది ఇంత అజ్ఞానమా! అలా అనిపించింది నాకు. నేను వెంటనే మాట వెనక్కి తీసుకున్నాను. మాట వెనక్కి తీసుకోవటంలో తప్పు లేదు. అభిప్రాయ భేదం వచ్చేదానికంటే మాటను వెనక్కి తీసుకోవటమే నయం కనుక నేను ఆ క్షణమే మాట మార్చాను. నేను ఆమెతో, 'నా ఉద్దేశ్యం అలా అనటం కాదు. దానితోపాటు వాళ్ళకి నగదు రూపంలో ఐదువందల ఒక్క రూపాయలు కూడా ఇవ్వు' అన్నాను. అప్పుడామె, 'ఏమీటీ? మీరు ఎంతటి అమాయకులు! చాల అమాయకులు! అన్ని రూపాయలు ఎవరైనా ఇస్తారా ఎక్కడైనా?' అన్నది. చూసారా, నేనే గెలిచాను కదా? 'ఐదు వందల నగదు ఇవ్వు, దానితోపాటు చిన్నచిన్న వెండి గిన్నెలు కూడా ఇవ్వు' అన్నాను. అప్పుడామె నన్ను, 'మీరు చాల అమాయకులు. అంత ఎవరైనా ఇస్తారా?' అన్నది. చూసారా అభిప్రాయభేదం లేకుండా చేసాను కదా? అభిప్రాయ భేదమే రానివ్వలేదు సరికదా, ఆమె నన్ను 'మీరు చాల అమాయకులు' అని అన్నది. మీరు నా అన్నకి తక్కువ ఇస్తారా అనే ఆలోచన ఆమె మనసులోకి రావటానికి బదులు, అంత ఎక్కువ ఇవ్వగూడదని ఆమె అన్నది.

## చెల్లని డబ్బులు భగవాన్ పాదలకు సమర్పణ

ఇంట్లో పెత్తనం చెలాయించవద్దు. పెత్తనం చేసే మనిషికి తిరుగులాట ఎక్కువగా ఉంటుంది. నేను కూడా హీరా బా తో, నేను చెల్లని నాణేన్ని అని చెప్పేసాను. నాకు ఎక్కువగా తిరగటం నచ్చదు కదా! పనికి రాని నాణెం ఎందుకు పనికివస్తుంది? దేవుడి దగ్గర పడివుంటుంది. ఇంట్లో ఆధిపత్యాన్ని చెలాయించబోతే, గొడవలు జరుగుతాయి కదా? నేను 'సమభావంతో పనులు నెరవేర్చుకోవాలి.' ఇంట్లో భార్యతో ఫ్రెండ్ (మిత్రుడు) లా ఉండాలి. మీరు ఆమె ఫ్రెండు, ఆమె మీకు ఫ్రెండు! ఇక్కడ ఎవరూ నోట్ చేయరు, నడుస్తున్న విధానం మీదా మీ భార్యదా అని. మునిసిపాలిటీలో కూడా నోట్ అవదు, భగవాన్ దగ్గర కూడా నోట్ అవదు. మనకు కావలసింది భోజనమా లేక పద్ధతులా? మంచి భోజనం ఎలా లభిస్తుంది అన్నది ఆలోచించండి. మునిసిపాలిటీవాళ్ళు ఇంట్లో ఎవరిది నడుస్తుంది అని నోట్‌చేసుకునేటట్టయితే, నేను కూడా అడ్జస్ట్ అవను. కానీ, దాన్ని ఎవరూ నోట్ చేసుకోరు.

బడౌదా వెళ్ళినపుడు నేను మా ఇంట్లోనే హీరా బా ని గెస్ట్‌లా చూసుకుంటాను. ఇంట్లోకి కుక్క చొరబడ్డా, హీరా బాకే కష్టం కలుగుతుంది. 'గెస్ట్' కి ఏం కష్టం? కుక్క చొరబడి నేతిలో మూతి పెట్టినట్లయితే, ఆ ఇంటి యజమానికి బాధ కలుగుతుంది కాని గెస్ట్‌కి ఏముంటుంది? గెస్ట్ అయితే అలా చూస్తూ వుండిపోతాడు. చాల ఎక్కువైంది అనుకున్నపుడు 'ఏం జరిగింది?' అని అడుగుతాడు. 'నెయ్యి పాడైంది' అని అంటే, గెస్ట్, 'అరె నష్టమే జరిగింది' అంటాడు నాటకీయంగా. అనాల్సివస్తుంది కదా, 'అయ్యో నష్టం జరిగిందే' అని? 'చాల బాగైంది' అని మనం అంటే మనల్ని ఇంట్లోంచి బయటకు పంపిచేస్తారు. మనల్ని గెస్ట్‌లా ఉండనీయరు.

## మీరు లేకుండా నాకు బావుండదు

నాకింత వయసు వచ్చినా కూడా ఇప్పటికీ, 'నేను బయటి ఊరికి వెళ్ళినపుడు మీరు లేకపోతే నాకు బాగనిపించదు' అంటాను. నేను అలా అనకపోతే ఆమె మనసులో ఏమేం ఆలోచనలు పెట్టుకుంటుంది? నాకు బాగానే ఉన్నప్పుడు ఆయనకెందుకు బాగుండదు? ఇలా మాట్లాడితే సంసారం నిలబడుతుంది. నెయ్యి వెయ్యరాదూ!

వెయ్యకపోతే ఎండపోయిట్లుంటుంది. మంచి భావాన్ని ప్రసరింపజేయి. నేను అలా అంటాను కదా! అప్పుడు ఆమె అంటుంది, 'మీకు నేను గుర్తుకు వస్తానాయ' అని. అందుకు నేను, 'బాగా గుర్తుకి వస్తావు. మిగతా అందరూ గుర్తున్నప్పుడు మీ జ్ఞాపకం రాదా?' అంటాను. అయితే నిజంగానే గుర్తుకొస్తుంది– గుర్తుకి రాదని కాదు.

## అప్పుడు ఎంత జాగ్రత్తగా చూసుకోవలసివచ్చింది?

నలభై ఐదు సంవత్సరాలయ్యాయి, నా వైఫ్‌తో అభిప్రాయభేదాలు రాలేదు. ఆమె కూడా మర్యాద పూర్వకంగా మాట్లాడుతుంది, నేనూ మర్యాదపూర్వకంగానే మాట్లాడుతాను. ఆమె ఎప్పుడైనా ఆ పరిధి దాటి బయటకు వెళ్తే నాకు అర్థమౌతుంది ఆమె మర్యాద వీడుతున్నదని. అందువలన నేను, మీరు చెప్పేది నిజమే అంటానే కానీ ఘర్షణ రానివ్వను. ఒక నిమిషం సేపైనా నేను బాధ పెడుతున్నదన్న అభిప్రాయం ఆమెకి కలుగనివ్వను. నాకు కూడా ఆమె నన్ను బాధపెడతున్నదని అనిపించదు.

ఒక వ్యక్తి నాతో, 'ప్రస్తుతం మీ భార్యతో మీ వ్యవహారం ఎలా ఉంది? రండి, తీసుకోండి అని అంటారా? అని అడిగాడు. 'లేదు హీరా బా అని పిలుస్తాను' అన్నాను. ఆమె అంత పెద్దది డెబ్బై ఆరు సంవత్సరాలకు వచ్చింది, నేను డెబ్బై ఎనిమిది సంవత్సరాలకు. 'రండి, తీసుకోండి' అనటం ఏం బావుంటుంది? 'హీరా బా' అని పిలుస్తాను అన్నాను. అతను మళ్ళీ, 'మీ పట్ల పూజ్య భావంతో ఉంటుందా?' అని అడిగాడు. నేను బడౌదా వెళ్ళినపుడు ఆమె విధి చేసిన తర్వాత ఆసనం తీసుకుంటుంది. ఇక్కడ చరణాలకు తల ఆనించి విధి చేస్తుంది. ప్రతి రోజు విధి చేస్తుంది. వీళ్ళంతా చూసారు, నేను ఆమెను ఎలా చూసానో ఆమె అలా విధి చేయటానికి అని'. ఏ జ్ఞాని భార్య కూడా ఆ విధంగా విధి చేసివుండదు. ఇవన్నీ వింటే మీకు అర్థమైందా?

## విషయ సమాప్తి తర్వాత సంబోధన 'బా' అని

హీరాబా తో నా శారీరక సంబంధం సమాప్తమైన దగ్గరి నుంచి నేను ఆమెని 'హీరా బా' అని పిలుస్తాను. (దాదాజీ 35 సంవత్సరాల వయసులో బ్రహ్మచర్యం లోకి వచ్చారు). ఆ తర్వాత నాకు వైఫ్‌తో ఘర్షణ ఎప్పుడూ జరగలేదు. అంతకు

ముందు ఏమైనా ఘర్షణ జరిగితే అది విషయం మూలంగానే! సాహచర్యంలో కొద్దో గొప్పో ఘర్షణలు జరుగుతుంటాయి కానీ మైథున ప్రభావం ఉన్నంత వరకు అది 'అడ్డంకి' ఎక్కడ పోతుంది? ఆ ప్రభావం పోగానే అది వీడిపోతుంది. ఇది నా అనుభవం తో చెప్తున్నాను. ఇది నాకు కలిగిన జ్ఞానం వలన సరిగ్గా నడిచింది కాని, జ్ఞానం వచ్చివుండకపోతే, ఆ ప్రభావం అలాగే ఉండివుండేది. అటువంటి పరిస్థితిలో అహంకారమనేది ఉంటుంది కదా! ఆ అహంకారంలో ఒక భాగమే 'భోగించటం' అనేది. దానితో 'అతను నన్ను అనుభవించాడు' అని, 'ఆమె నన్ను అనుభవించింది' అనే మాటలు వస్తాయి. కానీ ఇక్కడ (జ్ఞానం తర్వాత) దాన్ని నశింపజేయవచ్చు. అయినా ఆ డిశ్చార్జ్‌కి చెందిన కీచులాట ఉంటుంది. కానీ, మా మధ్య అది కూడా లేదు. అలా మా మధ్య ఘర్షణ లేదు.

# 7. జ్ఞాని దశలో అలాగే ఉంటాము

## ప్రతి ఒక్క పర్యాయాన్నీ దాటి

ఇవన్నీ నేను విశ్లేషించబడినవి. ఇక అది (పురుషార్థం) ఒక అవతారానిది కాదు. ఒక అవతారంలో ఇంత విశ్లేషణ చేయటం ఎక్కడ సంభవం? ఎనభై సంవత్సరాలలో ఎంత తెలుసుకోగలం? ఈ రోజు ప్రకటితమైనది అనేక అవతారాల నుంచి తెలుసుకుంటూవస్తున్నది.

**ప్రశ్నకర్త:** ఇన్ని జన్మల నుంచి విశ్లేషిస్తూవస్తున్నది ఈ సమయంలో ఎలా దగ్గరకు కూడీ ప్రకటితమైంది?

**దాదాశ్రీ:** పొర విడిపోవటం వలన. జ్ఞానమంతా లోపల ఉన్నదే. దాని పైన ఆవరించిన పొర వీడిపోవాలి కదా? జ్ఞానం అనేది పోగుచేసుకుంటూ వస్తున్న పెట్టుబడిలో ఉన్నదే కానీ, ఆవరించిన పొర తొలగిపోయేటప్పటికి బహిర్గతమౌతుంది.

అన్ని ఫేజెస్ (దశల) జ్ఞానాన్ని నేను శోధించి తెలుసుకున్నాను. అన్ని దశల నుంచీ బయటపడ్డాను. అన్ని దశలను నేను 'ఎండ్' చేసాను. ఆ తర్వాతనే ఈ జ్ఞానం లభించింది.

## మాట్లాడే సమయంలో కూడా శుద్ధత

నేను ఏది మాట్లాడినా, ఉపయోగంలో ఉండే అది చెప్తాను. ఈ రికార్డ్ మాట్లాడుతుంది (నోటి నుంచి వాణి వెలివడుతుంది), దాని వెనక నేను ఏమేం తప్పులు చేసాను, చెయ్యలేదు అనే నా అనుభవం ఉంటుంది. స్యాద్వాద్ (సాపేక్షితావాదంలో ఏమైనా తప్పులున్నాయేమోనని జాగ్రత్తగా చూస్తాను. ఇక మాట్లాడేదంతా రికార్డ్. అందరు మనుషులకూ మాట్లాడేది రికార్డే కానీ వాళ్ళు మనసులో 'ఇదంతా మాట్లాడుతున్నది నేనే' అనుకుంటారు. నేను నిరంతరం శుద్ధాత్మ ఉపయోగంలో ఉంటాను– మీతో మాట్లాడుతున్నప్పుడు కూడా.

## విధి చేయకుండా ఒక క్షణం కూడా గడపలేదు

ఈ మాటల్లో ఉన్నదే నేను చూస్తాను. ఒక క్షణమాత్రమైనా, ఒక నిమిషం సేపైనా ఉపయోగంలోకి రాకుండా లేను. ఆత్మకి ఉపయోగపడుతుంటాను.

నేను విధి చేయాలంటే, మనసుకి కాస్త విశ్రాంతి దొరకగానే వెంటనే లోపల విధి మొదలౌతుంది. ఆ సమయంలో అందరికీ ఏమనిపిస్తుందంటే, దాదాజీ ఈ సమయంలో ఏదో పనిలో వ్యస్థులైవున్నారు అని. మూడ్ లేదు అని ఎవరికీ అనిపించదు. ఏదో పనిలో మునిగివున్నారేమో అనిపిస్తుంది. నేను అలా నా కార్యాలను నెరవేరుస్తుంటాను. విధి చేయటం ఏమైనా మిగిలిపోతే, మధ్యాహ్నం ఎవరైనా ఊడిపడి చెయ్యలేకపోతే, ఎప్పుడు ఖాళీ దొరికితే అప్పుడు జరిగిపోతుంటుంది. అది కూడా శుద్ధ ఉపయోగం తర్వాతనే జరుగుతుంది.

## భోజనం చేసే సమయంలో దాదాజీ ఉపయోగంలో

భోజనం సమయంలో నేను ఏం చేస్తానో తెలుసా? భోజనం ఎక్కువ సేపు చేస్తాను. తినేది తక్కువే కాని తినేటప్పుడు ఎవరితో మాట్లాడను. హంగామా ఏమీ చేయను. అంటే భోజనం సమయంలో ఏకాగ్రత ఉంటుంది. నేను నమలగలను కనుక బాగా నమిలి తింటాను, రుచిని పూర్తిగా ఆస్వాదిస్తాను. అందులో లోభం చూపించను. ఈ విషయంలో మనుషులు లోభత్వం చూపిస్తారు. కానీ నేను దాన్ని గమనిస్తాను. ఎంత రుచికరమైన ఆహారం అన్నది గ్రహిస్తాను, ఇది ఇలా ఉంది కదా

అని. ఎగ్జాక్ట్ (యదార్థ రూపంలో) తెలుసుకోవటం, రుచిలో నిమగ్నమవటం, దాన్ని అనుభవించటం. ప్రపంచంలోని మనుషులంతా దాన్ని అనుభవిస్తారు లేదా రుచిలో నిమగ్నమౌతారు.

చలికాలంలో కూడా షాలు కప్పుకోవలసినప్పుడు దాన్ని కాస్త కిందకు జారుస్తాను. చల్లగాలి తగిలితే నిద్ర రాదు. అలా రాత్రంతా మెలకువలోనే ఉంటాను. లేకపోతే దగ్గు వస్తే లేవనేలేస్తాను, ఇక ఉపయోగంలో ఉంటాను.

నేను ఎన్నో సంవత్సరాలుగా, రాత్రిపూట ఆరోగ్యం బాగోలేకపోయినా, మరేమైనా, ఉదయం ఎగ్జాక్ట్‌గా ఆరున్నర గంటలకు లేస్తాను. నేను లేచేసరికి ఆరున్నర కూడా అవుతుంది. నిజానికి నేను నిద్రే పోను. రాత్రి రెండున్నర వరకు నా లోపల విధి జరుగుతూవుంటుంది. పదకొండున్నర వరకు సత్సంగం నడుస్తుంటుంది. పన్నెండు గంటలకు పడుకుంటాను. సాధారణంగా నిద్ర సుఖాన్ని, భౌతికపరంగా నేను అనుభవించను.

## స్టోర్ కూడా నమస్కారం పెడుతుంది ఇలాంటి వీతరాగికి

అమెరికాలో నన్ను స్టోర్‌లోకి తీసుకుపోతారు. 'దాదాజీ పదండి' అంటారు. మేము స్టోర్‌లోకి పోయినప్పుడు స్టోర్ పాపం మళ్ళీ మళ్ళీ నమస్కారం పెడుతుంటుంది, 'ధన్యులు మీరు. మా మీద దృష్టిని చెదరనివ్వరు!' అంటూ. నేను చూస్తాను కాని నా దృష్టి చెదిరిపోదు. నాకు ఏ వస్తువు కావాలి? ఏ వస్తువూ కూడా నాకు ఉపయోగపడదు. నీ దృష్టయితే చెదురుతుంది కదా?

**ప్రశ్నకర్త:** ఆవశ్యకతనుబట్టి వస్తువుని కొనవలసివస్తుంది.

**దాదాశ్రీ:** ఆ. నా దృష్టి చెదరదు. ఈ స్టోర్ నాకు రెండు చేతులెత్తి నమస్కరిస్తుంది, ఇలాంటి మనిషి దర్శనం నాకు ఇంతవరకు అవలేదు అని. అలా అని ఎటువంటి తిరస్కార భావం కూడా ఉండదు. ఫస్ట్ క్లాస్! రాగమూ లేదు, ద్వేషమూ లేదు! నన్నేమంటారు? వీతరాగి వచ్చారు! వీతరాగ భగవాన్!

## విశ్వంలో వీతరాగులు ఎక్కువ ఉపకారులు

నేను ఒకవేళ ఏదైనా పెళ్ళికి వెళ్తే, ఆ పెళ్ళేమైనా నన్ను చుట్టుకుంటుందా? నేను పెళ్ళికి వెళ్ళినా పూర్తిగా వీతరాగిలా ఉన్నాను. ఎప్పుడైనా మోహబజారుకి వెళ్తే, అప్పుడు సంపూర్ణంగా వీతరాగి అయిపోతాను. భక్తి బజారుకి పోయినట్లయితే వీతరాగం కాస్త తగ్గిపోతుంది.

## తన్మయం లేకుండా వ్యవహారం

పెళ్ళిళ్ళు, వ్యవహారిక సందర్భాలను గడపవలసివస్తుంది. వ్యావహారికంగా నేను దేన్నయితే పూర్తిచేస్తారు, మీరు కూడా పూర్తిచేస్తారు కానీ, మీరు తన్మయాకారులై పూర్తిచేస్తారు, నేను వాటికి విడిగా ఉండి పూర్తిచేస్తాను. అంటే, భూమికను మార్చుకోవలసిన అవసరం ఉంది కానీ, స్వయంగా మారవలసిన అవసరం లేదు.

## జ్ఞాని ఆత్మ స్వరూపులుగా ప్రకటితమౌతారు

**పశ్నకర్త:** ఈ మూడు రోజుల్లో నా మనసులో ఒకే ఆలోచన చెలరేగుతోంది. మీరు డెబ్భై ఐదు సంవత్సరాల వయసులో కూడా ఉదయం నుంచి సాయింత్రం వరకు స్థిరంగా కూర్చునివుంటారు. నేనైతే ఇక్కడ గంటన్నర సేపు కూడా కూర్చోలేను. మీలో అటువంటి ఏ శక్తి పనిచేస్తోంది?

**దాదాశ్రీ:** ఈ శరీరం ముసలిదన్నది నిజమే కానీ లోపల అంతా యవ్వనమే ఉంది. అందువలన, ఒకే చోట కూర్చుని పది గంటల సేపు నేను మాట్లాడుతూ ఉండగలను. ఎందుకంటే ఈ శరీరం ఇలా కనిపిస్తున్నప్పటికీ, యాభై ఏళ్ళ ప్రభావం పడినప్పటికీ, వెంట్రుకల మీద కూడా ప్రభావం పడినప్పటికీ, లోపల అంతా యవ్వనమే. అందువలన ఈ శరీరంలో ఎప్పుడైనా వ్యాధి కలిగినట్లయితే నేను వీళ్ళతో, 'భయపడకండి, ఈ శరీరం వదిలిపెట్టబోవటం లేదు. లోపల అంతా యవ్వనంగానే ఉంది' అంటాను. ఎందుకంటే వాళ్ళు స్థిమితంగా ఉంటారు కనుక. ఎందుకంటే నా లోపలి స్థితి వేరు. ఒక్క నిమిషం కూడా నేను అలసిపోను. ఇప్పటికీ రాత్రి మూడున్నర వరకు నాతోపాటు కూర్చునేవాళ్ళు కావాలి. (అంటే ఆయనతో సత్సంగం నడుస్తుండాలి).

ఇకపోతే నాలో ఫ్రెష్‌నెస్ (తాజాతనం) ఎప్పుడూ పోలేదు. మీరు కూడా ఫ్రెష్ (తాజాతనంతో) ఉన్నట్లయితే మీకు అనిపిస్తుంది, దాదాజీ మమ్మల్ని ఫ్రెష్‌గా చేసారు అని.

**ప్రశ్నకర్త:** దాదాజీ, మీ వయసయితే అయిపోయింది కానీ....

**దాదాశ్రీ:** కానీ! వయసు అయిపోయింది దేహానికి కదా, నాకు వయసు ఎక్కడ అయిపోతుంది? మరో విషయం ఏమిటంటే మీ అందరికీ సైకలాజికల్ ఎఫెక్ట్ ఉంటుంది. నాకు అలాంటి సైకలాజికల్ ఎఫెక్ట్ ఉండదు, 'నాకు జ్వరం వచ్చింది' అని. ఎవరైనా అడిగితే నేను అలాగే చెప్తాను కానీ ఆ తర్వాత దాన్ని నేను తుడిచేస్తాను. ఆ జాగృతి ఉంటుంది.

## 'నేను' 'నాలో', 'పటేలు' జగత్కళ్యాణ విధిలో

చాలవరకు నేను మూల స్వరూపంలో ఉంటాను. అంటే ఒక పొరుగువానిలా ఉంటాను. చాల కొద్ది సేపటి కోసం అందులోంచి (స్వరూపం లోంచి) బయటకు వస్తాను. మూల స్వరూపంలో ఉన్న కారణంగా ఫ్రెష్‌నెస్ యథాతథంగా ఉంటుంది. రాత్రిళ్ళు కూడా ఎక్కువగా నిద్రపోను. ఒక పావు గంట సేపు కునుకు వస్తుంది అంతే. రెండు పూటలకు కలిపి పావు గంట. మిగతా సమయంలో కేవలం కళ్ళు మూసుకునివుంటాయి. ఈ చెవులకు కాస్త తక్కువగా వినిపిస్తుంది కనుక, దాదాజీ నిద్రపోతున్నారని చూసేవాళ్ళు అనుకుంటారు, అలా అనుకోవటమే మంచిదని నేనూ అనుకుంటాను. నేను విధి చేసుకోవలసివుంటుంది కనుక నేను నాలో, ఎ.ఎమ్.పటేల్ విధిలో ఉంటాము. అంటే, ఈ జగత్కళ్యాణం కోసం చేయవలసిన విధులను చేస్తాను. అంటే ఆయన ఎల్లప్పుడూ విధిరతలో ఉంటారు. పగలు రాత్రి కూడా విధిరతలోనే ఉంటారు.

## ప్రకృతిని జ్ఞాని అలా మలుచుకుంటారు

దాదాజీ తన గదిలోకి పోయి నిద్రలోకి వెళ్తారని అందరూ అనుకుంటారు. కానీ అది సత్యం కాదు. పద్మాసనం వేసుకుని గంట వరకు కూర్చుంటాను. అది కూడా డెబ్బై ఏడు సంవత్సరాల వయసులో పద్మాసనంలో కూర్చోవటం సులభమైన

పనా? కాళ్ళు ముడుచుకోగలుగుతాను కనుకనే కళ్ళల్లో శక్తి, కంటి చూపు సురక్షితంగా ఉన్నాయి.

## నాకు లభించిన సుఖమే జగత్తుకంతా లభించాలి

నేను చెప్తుంటా కదా, భాయ్ నేను ఇరవై ఏడు సంవత్సరాల నుండి (1958 లో ఆత్మజ్ఞాన ప్రాప్తి కలిగిన దగ్గరి నుంచి) ముక్తుడనయ్యాను– ఏ టెన్షన్ లేకుండా. అంటే, ఎ.ఎమ్.పటేల్‌కి టెన్షన్ ఉండేది, నాకు కూడా కొద్దో గొప్పో ఉండేది. కానీ, ఎ.ఎమ్.పటేల్‌కి కూడా టెన్షన్ ఉన్నంత వరకు అది నా మీద కూడా భారంగానే ఉంటుంది కదా! అవి తీరిపోతే నేను ముక్తుడనయ్యానని భావిస్తాను. ఈ శరీరం ఉన్నంత వరకు ఈ బంధం ఉంటుంది. కానీ ఇప్పుడు నాకు దాని గురించి కూడా ఏ బాధా లేదు. మరో రెండు జన్మలున్నా కూడా నాకు అభ్యంతరం లేదు. నా లక్ష్యమేమిటంటే, 'నాకు లభించిన సుఖం ప్రపంచానికి కూడా లభించాలి' అని. ఏమిటి చెప్పండి మీకు తొందరగా ఉందా? మీరు అక్కడికి చేరుకోవాలని తొందర పడుతున్నారా?

## దాదాజీ బ్లాంక్ చెక్

ఈ దాదాజీ ఎంత నిమిత్తులంటే, 'దాదాజీ' పేరు తలచుకోగానే, ఎవరైనా వ్యాధినపడి మంచంలో ఉన్నా, పక్కలో అటు ఇటు తిరగలేకపోతున్నా, లేచి కూర్చోవచ్చు. అందువలన మీ పని నెరవేర్చుకోండి. మీరు అనుకున్న కార్యాలు అయిపోతాయి. అంటే నిమిత్తులుగా. కానీ అందులో చెడు ఉద్దేశ్యాలు పెట్టుకోకండి. ఎవరి పెళ్ళికైనా వెళ్ళటం కోసం శరీరం సహకరించాలి (ఆరోగ్యం బాగుపడాలి) అని మాత్రం కోరుకోకండి. ఇక్కడికి సత్సంగానికి రావటం కోసం శరీరం సహకరించాలి అని కోరుకోండి. అంటే, దాదాజీని సదుపయోగం చేసుకోండి కాని ఆయన దురుపయోగం జరగకూడదు. దురుపయోగం చేయనట్లయితే 'దాదాజీ' రెండవసారి కష్టకాలంలో పనికివస్తారు. అందువలన మనం ఆయనని ఒట్టిగా అనవసరమైన పనిలోకి తీసుకునిరావొద్దు.

అనగా, ఈ దాదాజీ బ్లాంక్ చెక్ లేక దాని మీద ఏమీ రాయని చెక్ అనవచ్చు. దాన్ని మళ్ళీ మళ్ళీ లాభం కోసం ఉపయోగించగలిగింది కాదు. పెద్ద కష్టం వచ్చినప్పుడే చైన్ లాగండి. సిగరెట్ ప్యాకెట్ కింద జారిపడింది, దానికోసం రైల్లో గొలుసు లాగితే దానికి దండన చెల్లించవలసివుంటుంది కదా? అంటే, అలాంటి దురుపయోగం చేయకండి అని.

## సొంతమనేదాన్ని వదిలేసాను

చూడండి, నేను మీకు చెప్పేదేమిటంటే, నేను ఈ పరిశోధనలో చాలా కాలం గడిపాను. అందువలనే మీకు తేలిక మార్గాన్ని చూపిస్తున్నాను. నాకైతే దారి వెతుక్కోవలసివచ్చింది. మీకు నేను ఏ దారిలో వెళ్ళానో చూపిస్తున్నాను, తాళం తెరిచేందుకు తాళంచెవిని అందిస్తున్నాను.

ఈ ఎ.ఎమ్.పటేల్ తనకు తానుగా తన సొంతం అనేదాన్ని భగవాన్‌కి అర్పించారు. అందుకే భగవాన్ ఆయనను అన్ని విధాలా కాపాడుతూవచ్చారు. అలా కాపాడుతూవుంటారు కదా సరైన అర్థంలో! కానీ ఎప్పటి నుంచి అలా కాపాడుతుంటారు? తనలో నాది అనే భావన పోయినప్పటి నుంచి, అహంకారం నశించిన తర్వాత నుంచి. కాకపోతే, అహంకారం పోవటమే కష్టమైన పని.

అందుకే ముంబై, బడౌదాలలో కొందరు అంటూవుంటారు, 'దాదాజీ మీరు ముందు మాకు దొరికివుంటే బావుండేది' అని. అప్పుడు నేను, 'ఒక మూటలా నన్ను తీసుకునివస్తే ఇక్కడ రావటం జరుగుతుంది. అలాగే ఒక మూటలా కట్టి పంపిస్తే పోతాను' అని అంటే వాళ్ళకి అర్థమౌతుంది. అయినా అడుగుతారు, 'మూటకట్టినట్లు అని ఎందుకు అంటారు?' అని. అరె, ఇది ఒక మూటే కదా. మూట కాకపోతే ఏమిటి మరి? లోపల భగవాన్ పూర్ణ రూపంలో ఉన్నారు కానీ, బయట ఒక మూటే కదా! అంటే, నాది నా సొంతం అనేది లేదిక.

## మహాత్మ్యాలంతా ఒక రోజు భగవాన్ అయితీరుతారు

**ప్రశ్నకర్త:** మమ్మల్నందిరీ భగవాన్‌గా చేస్తానని మీరు అన్నారు. అది జరిగినప్పుడు జరుగుతుంది కాని ప్రస్తుతమైతే అవలేదు కదా!

**దాదాశ్రీ:** కానీ వాళ్ళు అవుతారు కదా! ఎందుకంటే ఇది అక్రమ విజ్ఞానం. తయారుచేసేవాడైన నిమిత్తుడు, తయారయ్యే కోరిక ఉన్నవారు ఈ ఇద్దరూ కలిసినప్పుడు అప్పుడు అది జరిగే తీరుతుంది. తయారుచేసేవారు క్లియర్‌గా (స్పష్టతతో) ఉన్నారు. నేను కూడా క్లియరే. నాకు వేరే వృత్తి ఏమీ లేదు. అందువలన ఏదో ఒక రోజు ఈ అంతరాయాలు తొలగిపోతాయి, మన మూల స్వరూపమే అయిన భగవాన్ అయితీరుతారు.

**–జై సచ్చిదానంద**

# నవకలమ్

(తొమ్మిది ప్రగాఢ అంతరంగ భావనలు)

(ప్రతిరోజూ మూడుసార్లు చదవండి)

1. ఓ దాదా భగవాన్! దేహధారియైన ఏ జీవాత్మ యొక్క అహంకారము కించిత్ మాత్రము కూడా గాయపడటకు నేను కర్తను, కారాయితను, ప్రేరకుడను, అనుమోదకుడను కాకుండునట్లు నాకు పరమశక్తిని ప్రసాదించండి.

   ఏ దేహధారి జీవాత్మ యొక్క అహంకారమును ఏ మాత్రము గాయపరచకుండు నట్టి సాత్విక వాణి, వార్తన, విచారము కలిగి ఉండునట్లు నాకు పరమశక్తిని ప్రసాదించండి.

2. ఓ దాదా భగవాన్! ఎవరి ధర్మ ప్రమాణములు కించిత్ మాత్రము కూడా కించపడుటకు నేను కర్తను, కారాయితను, ప్రేరకుడను, అనుమోదకుడను కాకుండునట్లు నాకు పరమశక్తిని ప్రసాదించండి.

   ఎవరి ధర్మము యొక్క ప్రమాణమును అణుమాత్రమైన కించపరచ కుండుటకు తగిన, అందరికీ ఆమోద్యమైన సాత్విక వాణి, వార్తన, విచారము కలిగి ఉండునట్లు నాకు పరమశక్తిని ప్రసాదించండి.

3. ఓ దాదా భగవాన్! ఏ దేహధారి ఉపదేశక సాధు, సాధ్వీ, ఆచార్యుల పట్ల అవర్ణవాదం,అపరాధం, అవినయం చేయకుండ ఉండే పరమ శక్తిని ప్రసాదించండి.

4. ఓ దాదా భగవాన్! ఏ దేహధారి జీవాత్మ పట్ల ఏమాత్రమైనా అభావం, తిరస్కారం, నానుండి ఎప్పుడూ జరగకుండా, జరిగించకుండా, కర్తగా ఆమోదించకుండా ఉండగల పరమ శక్తిని ప్రసాదించండి.

5. ఓ దాదా భగవాన్! నేను ఏ దేహధారి జీవాత్మ పట్ల ఎప్పుడూ కఠోరమైన పదజాలంతో, జగడాలమారి పదజాలంతో మాట్లాడకుండా, మాట్లాడించకుండా, లేదా మాట్లాడటానికి ఆమోదించకుండా ఉండగల పరమ శక్తిని ప్రసాదించండి.

ఎవరైనా కఠోరంగా, తగవులాడే భాషలో మాట్లాడితే నేను మృదు సరళ భాషలో మాట్లాడేందుకు పరమ శక్తిని ప్రసాదించండి.

6. ఓ దాదా భగవాన్! నేను ఏ దేహధారి జీవాత్మ పట్ల, స్త్రీ పురుష నపుంసకులు ఏ లింగానికి చెందినవారైనా, వారిపట్ల ఏమాత్రమైనా విషయవికార సంబంధ దోషాలు, కోరికలు, చేష్టలు, లేక ఆలోచనల దోషాలు ఉండకుండా, అలా చేయించకుండా లేదా కర్తగా ఆమోదించకుండా ఉండే పరమ శక్తిని ప్రసాదించండి.

నేను నిరంతరం నిర్వికారిగా ఉండగల పరమ శక్తిని ప్రసాదించండి.

7. ఓ దాదా భగవాన్! నేను ఏ విధమైన ప్రత్యేక రుచికీ అలవాటుపడకుండా ఉండే శక్తిని ప్రసాదించండి.

సమరస ఆహారాన్ని తీసుకునే పరమ శక్తిని ప్రసాదించండి.

8. ఓ దాదా భగవాన్! ఏ దేహధారి జీవాత్మ యొక్క ప్రత్యక్ష లేదా పరోక్ష, జీవించివున్నా లేదా మరణించినా, ఎవరిపట్లనైనా ఏమాత్రమైనా అవర్ణవాదం, అపరాధం, అవినయానికి పాల్పడకుండా, అలా చేయించకుండా, లేక కర్తగా ఆమోదించకుండా ఉండగల పరమ శక్తిని ప్రసాదించండి.

9. ఓ దాదా భగవాన్! జగత్ కళ్యాణ కార్యములో సాధనముగా మారుటకు నాకు పరమ శక్తిని ప్రసాదించండి, శక్తిని ప్రసాదించండి, శక్తిని ప్రసాదించండి.

(పై విధంగా దాదా భగవాన్ని అడుగుతూ ఉండండి. ఇది ప్రతిరోజూ యాంత్రికంగా చదవాల్సిన విషయం కాదు, హృదయంలో ఉంచుకోవలసిన విషయం. ఇది ప్రతిరోజూ ఉపయోగ పూర్వకముగా అనుభూతి చెందాల్సిన విషయం. ఈ నవరత్నాలలో సమస్త శాస్త్రాల సారము ఇమిడి ఉన్నది)

# తెలుగులో దాదా భగవాన్ పుస్తకాలు

| | |
|---|---|
| 1. | అన్ని చోట్లా సర్దుబాటు |
| 2. | విభేదాలను తొలగించడానికి |
| 3. | ఎలాగైనా జస్టిస్ జరిగింది |
| 4. | బాధితుడు తప్పిదము |
| 5. | క్రోధం |
| 6. | చింత |
| 7. | నేను ఎవరు? |
| 8. | భావనతో మెరుగుపడతాయి జన్మ-జన్మలు |
| 9. | మృత్యు సమయం దానికి ముందు, దాని తర్వాత... |
| 10. | ఆత్మ సాక్షాత్కారం |
| 11. | మానవ ధర్మం |
| 12. | సేవ, పరోపకారం |
| 13. | ప్రతిక్రమణ |
| 14. | భార్యాభర్తల దివ్య వ్యవహారం |
| 15. | అంతఃకరణ స్వరూపం |
| 16. | పాప-పుణ్యం |
| 17. | తల్లి-తండ్రి, పిల్లల వ్యవహారం |
| 18. | దాదా భగవాన్? |
| 19. | కర్మ విజ్ఞానం |


❖ తెలుగులో మరిన్ని పుస్తకాలు జోడించబడుతున్నాయి మరియు త్వరలో అందుబాటులోకి వస్తాయి.

❖ దాదా భగవాన్ పుస్తకాలు వివిధ భాషలలో అందుబాటులో ఉన్నాయి. గుజరాతీ, హిందీ, ఇంగ్లీష్, మరాఠీ, తెలుగు, కన్నడ, ఒరియా, మలయాళం, బెంగాలీ, పంజాబీ, అస్సామీ, తమిళం, జర్మన్, స్పానిష్, రష్యన్, మొదలైనవి.

❖ 'దాదావాణి' పత్రిక ప్రతి నెలా మూడు భాషలలో ప్రచురితమవుతుంది : గుజరాతీ, హిందీ & ఇంగ్లీష్.

❖ అన్ని దాదా భగవాన్ పుస్తకాలు మరియు మ్యాగజైన్‌లు ఆన్‌లైన్ పుస్తక దుకాణంలో కూడా అందుబాటులో ఉన్నాయి : https://store.dadabhagwan.org

## దాదా భగవాన్ ఫౌండేషన్ తెలుగు యూట్యూబ్ ఛానల్




❖ ఇది అడాలజ్ దాదా భగవాన్ ఫౌండేషన్ యొక్క అధికారిక తెలుగు యూట్యూబ్ ఛానెల్.

❖ దిగువ లింక్ నుండి తెలుగు భాషలో సత్సంగ వీడియోలను చూడండి.

**'Dada Bhagwan Foundation Telugu' Channel:**

https://dbf.adalaj.org/yttelugu

*Open Link OR*

*Scan QR*

YouTube

---

*Dada Bhagwan Foundation Youtube video channels are available in other regional languages: Gujarati, Hindi, Marathi, Bengali, Tamil, Telugu, Kannada, Malayalam, Spanish, Portuguese, etc.*

# Persons to Contact

## Dada Bhagwan Foundation

**Adalaj** : **Trimandir**, Simandhar City, Ahmedabad-Kalol Highway
P/O: Adalaj, Dist. Gandhinagar - 382421, Gujarat, India.
Tel: +91-9328661166 / 9328661177
E-mail : info@dadabhagwan.org

**Mumbai** : **Trimandir**, Rushivan, Kajupada, Borivali (E)
Tel: +91-9323528901

| | | | |
|---|---|---|---|
| **Kolkata:** | 9830093230 | **Delhi:** | 9810098564 |
| **Jaipur:** | 9351408285 | **Chennai:** | 7200740000 |
| **Bhopal:** | 9425024405 | **Patna:** | 7352723132 |
| **Indore:** | 9039936173 | **Amravati:** | 9422915064 |
| **Raipur:** | 9329644433 | **Bangalore:** | 9590979099 |
| **Chandigarh:** | 9780732237 | **Hyderabad:** | 9989877786 |
| **Kanpur:** | 9452525981 | **Pune:** | 9422660497 |
| **Bhubaneswar:** | 8763073111 | **Jalandhar**: | 9814063043 |
| **Varanasi:** | 9795228541 | **Sangli:** | 9423870798 |

**USA: Dada Bhagwan Vignan Institute**
Tel: + 1-877-505-DADA (3232)
Email: info@us.dadabhagwan.org

**U.K: Dada Darshan (UK)**
Tel: +44 330-111-DADA (3232)
Email: info@uk.dadabhagwan.org

| | |
|---|---|
| **Germany** | : +49 700 32327474 |
| **UAE** | : +97 1557316937 |
| **Kenya** | : +25 4722722063 |
| **Dubai** | : +971 501364530 |
| **Australia** | : +61 421127947 |
| **Singapore** | : +65 81129229 |
| **New Zealand** | : +64 210376434 |

Website : www.dadabhagwan.org



## పదునాలుగు భువనాలకు అధిపతి
## ఇక్కడ ప్రకటితమయ్యారు

ప్రశ్నకర్త – 'దాదా భగవాన్' అనే పదాన్ని ఎవరి కోసం సృష్టించారు?

దాదాశ్రీ – దాదా భగవాన్ కోసమే కాని నా కోసం కాదు. నేనైతే జ్ఞాని పురుష్‌ని. దాదా భగవాన్ పదునాలుగు భువనాలకు అధిపతి. ఆయన మీ లోపల కూడా ఉన్నారు. కానీ మీలో ప్రకటితమవలేదు. మీలో అవ్యక్త రూపంలో ఉన్నారు. ఇక్కడ (నా లోపల) వ్యక్తమయ్యారు. వ్యక్తం (ప్రకటితం) అయినవారు ఫలితాన్నిస్తారు.

**-దాదాశ్రీ**

मूल दीपक से प्रकटे दीपमाला

dadabhagwan.org

9 788198 166708

Printed in India

Price ₹70